జనవరి
2014

93

సంపుటి : 8 సంచిక : 9

వెల రు. 5/-

## ఈ సంచికలో........

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు రాష్ట్రానికి నష్టదాయకం
సర్దార్ పటేల్ ఒక మతతత్వ వాది, అందుకే బిజెపీకి ఆయనపై ఎనలేని భక్తి
అవినీతి, పెట్టుబడిదారీ సమాజం -కమ్యూనిస్టు పార్టీ
కౌలు రైతు సమస్య: గ్రామీణ ప్రాంతాల్లో నేటి తక్షణ వర్గ సమస్య
సోషలిస్టు ప్రత్యామ్నాయం కోసం పోరాటాలు పెంచాలి!
వెనిజులా ప్రత్యామ్నాయ ఆరోగ్య విధానం - విజయాలు, సమస్యలు
నల్లజాతి విప్లవ చైతన్య జ్వాల నెల్సన్‌మండేలా
రాష్ట్ర రాజకీయ పరిస్థితులు మరింత స్పష్టమైన తరువాతనే సర్దుబాట్లు/స్వతంత్ర పోటీపై నిర్ణయం

స్ఫూర్తి


# నల్లజాతి విప్లవ చైతన్య జ్వాల నెల్సన్‌మండేలా

కె. గడ్డెన్న

అమానుషమైన వర్ణవివక్షపై విరామ మెరుగక పోరాడిన విప్లవ యోధుడాయన. చీకటి ఖండంలో వెలుగుల్ని నింపిన నల్లజాతి నిప్పు కణిక. అశేషమైన ఆఫ్రికన్లచేత మడీబా (తండ్రి) అని ముద్దుగా పిలిపించుకునే జాతిపిత. ఆయపేరు నెల్సన్ మండేలా. గత కొన్ని మాసాలుగా ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ 2013 డిసెంబరు 5న జొహాన్నెస్ బర్గ్‌లోని తన నివాసంలో ఆయన శాశ్వతంగా కన్ను మూశారు. మండేలా మృతి ఆఫ్రికన్లనే కాదు, యావత్ ప్రపంచ ప్రజానీకాన్ని తీవ్ర దుఃఖసాగరంలో ముంచేసింది. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతి దురహంకార వ్యవస్థను కూల్చి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో కూడిన ప్రజాతంత్రయుత రాజకీయ వ్యవస్థకోసం ఆయన ఎనలేని కృషిచేశాడు. అసమానతలను పూర్తిగా రూపు మాపాలన్న ఈ నల్లజాతి సూరీడి ఆశయం అసంపూర్తిగా అలానే మిగిలివుంది. కానీ, ఆయన రగిలించిన పోరాట స్ఫూర్తి ప్రపంచ వ్యాపితంగా విమోచనోద్యమాలకూ, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే శక్తులకూ సదా ఉత్తేజాన్నిస్తూనే వుంటుంది. ఆయన పుట్టిన రోజును మండేలా డే పేరుతో అంతర్జాతీయంగా ప్రతి సంవత్సరం జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది.

“చరిత్ర నిర్మించేది రాజులూ, సైనిక జనరల్సూ కాదు, ప్రజలే.” అని మండేలా తరచూ చెబుతుండేవారు. చెప్పడమే కాదు ఆచరణలో నిరూపించాడాయన.

నెల్సన్ మండేలా పూర్తిపేరు నెల్సన్ రొహిలాలా మండేలా. 1918 జులై 18న కేప్ ప్రావిన్స్ లోని మేవ్‌జోలో థెంబూ రాచరిక కుటుంబంలో పుట్టాడు. ఆయన తొలి పేరు రొహిలాలా. జోసా భాషలో దీనర్థం అల్లరి చేసేవాడు అని. అ పేరును అక్షరాలా సార్థకం చేశాడు మండేలా. ఆయన అల్లరి అలాంటి ఇలాంటిది కాదు. అది ఒక జాతి దాస్య శృంఖలాను పటాపంచలు చేసింది. మండేలాకు క్రీడలంటే ఎనలేని మక్కువ. ఆయన మంచి అథ్లెట్. బాక్సర్ కూడా. ఆయన షోర్ట్ హేర్, విట్ వాటర్ స్టాండ్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్య పూర్తి చేశాడు. న్యాయవాద వృత్తి చేపట్టాడు. నల్లవారి భూములపై తెల్లవాడు పెత్తనం చలాయించడాన్ని చూసి ఆగ్రహంతో రగలిపోయాడు. ఈ అన్యాయం ఇంకానా ఇకపై సాగకూడదనుకున్నాడు. శ్వేత జాతీయుల రాక్షస



పాలనపై తిరుగుబాటు బావుటా ఎగరవేశాడు. తన స్నేహితుడు వాల్టర్ సిసులుతో కలిసి ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి)లో సభ్యుడిగా చేరాడు. 1940లో ఎఎన్‌సి యూత్ లీగ్ వ్యవస్థాపక సభ్యునిగా వున్నాడు. 1952లో ఆయన శాసనధిక్కార ఉద్యమం నడిపాడు. దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ (ఎస్ఎసిపి)లో సభ్యునిగా చేరాడు. లాటిన్ అమెరికా వేగు చుక్క చేగువేరా స్ఫూర్తితో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ స్వరూపాన్ని మార్చేశాడు. 1962లో అరెస్టయ్యే నాటికి మండేలా దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా వున్నాడు. జైలు నుంచి విడుదలయ్యాక ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ -ఎఎన్‌సి అధ్యక్షుడయ్యాడు.

దక్షిణాఫ్రికా స్వేచ్ఛా స్వాతంత్ర్య సాధన కోసం ఎఎన్‌సి, సౌతాఫ్రికా కార్మిక సంఘాల సమాఖ్య (కొసాటు), దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ కలిసి సమిష్టిగా అనేక పోరాటాలు నిర్వహించాయి. వర్ణ వివక్షత, సామ్రాజ్యవాదం, దోపిడీలకు వ్యతిరేకంగా ప్రపంచంలో ఇతర ప్రాంతాల్లో సాగే ఉద్యమాలపై దక్షిణాఫ్రికా పోరాటం ఎంతో ప్రభావం చూపింది. ఈ విషయాలేవీ కార్పొరేట్ మీడియాలో రావు. మండేలాను కొనియాడుతూనే ఎంతో ముఖ్యమైన ఇటువంటి విషయాల్ని అది తొక్కిపెడుతోంది. ఇరవయ్యో శతాబ్దపు బానిస విధానాలకూ, వలసవాదానికీ వ్యతిరేకంగా ఆఫ్రికా ఖండమంతటా దావాగ్నిలా వ్యాపించిన ఆగ్రహ జ్వాలలకు ప్రతినిధిగా ఎఎన్‌సి నిలిచింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ఆఫ్రికన్ల పోరాటాలు మరింత పదునుతేలాయి. అటు ఉత్తర ఆఫ్రికా, ఈజిప్టు, అల్జీరియా మొదలైన దేశాలనుండి ఇటు దక్షిణాదిలోని అంగోలా, మొజాంబిక్, జింబాబ్వే, నమీబియా వరకు, తూర్పున కెన్యా, టాంజానియా దగ్గర నుంచి మధ్య ఆఫ్రికాలోని కాంగో మీదుగా పశ్చిమాన వున్న ఘనా, గినియా, మాలి తదితర ప్రాంతాల దాకా ఏకరీతిన ఈ ఉద్యమాలు సాగాయి. లక్షలాది మంది వీధుల్లోకి వచ్చారు. జాతి విమోచన కోసం కొందరు సాయుధ పోరాటం సాగించారు.. సాయుధ పోరాటాలు లేనిచోట రాజకీయ ప్రతిఘటన మరో రూపంలో సాగింది. ఆ క్రమంలో కొన్ని దేశాలు స్వాతంత్ర్యం సాధించాయి. వలసవాదులనూ, వారి తైనాతీలనూ దేశం నుండి తరిమేసేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో వారు ఆయుధాలు చేపట్టారు. 1952–56 మధ్య దక్షిణాఫ్రికాలో శాసనోల్లంఘన నాద్యమం ఉవ్వెత్తున సాగింది. దీంతో గంగవెర్రులెత్తిన ప్రభుత్వం ఎఎన్‌సి, దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ ఆఫ్ డెమొక్రాట్స్, కలర్డ్ పీపుల్స్ కాంగ్రెస్, ఫెడరేషన్ ఆఫ్ సౌతాఫ్రికన్ వుమెన్, సౌతాఫ్రికన్ ఇండియన్ కాంగ్రెస్, దక్షిణాఫ్రికా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌లపై నిర్బంధాన్ని ప్రయోగించింది. మండేలాతో సహా 156 మంది ఆర్గనైజర్లపై రాజద్రోహ నేరాభియోగాన్ని మోపి జైలులో కుక్కింది. 1966 మార్చి 21 షార్పెవెల్లి ఊచకోత తరువాత ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్, పాన్ ఆఫ్రికనిస్టు కాంగ్రెస్, తదితర పార్టీలపై నిషేధం విధించింది.

ఈ నేపథ్యంలో మండేలా, ఆయన సహచర కామ్రేడ్స్‌తో కలిసి ఉంఖోంటో వె సిజ్వే (ఎఎన్‌సి అనుబంధ సాయుధ విభాగం)ను ఏర్పాటు చేశాడు. ఈ దళం తెల్లజాతి పాలనకు చిహ్నాలైన ప్రభుత్వ భవనాలు, రైలు మార్గాలపై పెద్ద ఎత్తున గెరిల్లా దాడులు చేసింది. 1961 మే నెలలో సార్వత్రిక సమ్మె జరిగింది. మండేలా దక్షిణాఫ్రికాలోని ఒక అజ్ఞాత ప్రదేశం నుంచి బ్రిటిష్ వార్తా విలేకరికి ఇంటర్వ్యూ ఇస్తూ, “అహింస గురించి శత్రువుతో చర్చలు కొనసాగించడం వృథా ప్రయాస” అని వ్యాఖ్యానించాడు.

పార్టీపై నిషేధం విధించాక మండేలా రహస్యంగా ఆఫ్రికా ఖండంలోని ఇతర ప్రాంతాల్లో పర్యటించారు. 1962 జనవరిలో ఇథియోపియాలో పాన్ ఆఫ్రికన్ ఫ్రీడమ్ మూవ్‌మెంట్ మహాసభలో ఎఎన్‌సి తరపున ప్రతినిధిగా మాట్లాడుతూ, “గత పది మాసాలుగా అనేక అవరోధాల మధ్య దేశాటన చేశాను. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, విద్యార్థులు, సకల వృత్తులవారిని, పట్టణాల్లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడాను. నిరసనలతో దేశం

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

**1. నల్లజాతి విప్లవ చైతన్య జ్వాల నెల్సన్‌మండేలా**
– కె. గడ్డెన్న 2

**2. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు రాష్ట్రానికి నష్టదాయకం**
– బి.వి.రాఘవులు 4

**3. సర్దార్ పటేల్ ఒక మతతత్వ వాది, అందుకే బిజెపీకి ఆయనపై ఎనలేని భక్తి**
– ఎ.జీ. నూరాని 9

**4. అవినీతి, పెట్టుబడిదారీ సమాజం - కమ్యూనిస్టు పార్టీ**
– ఎస్. వీరయ్య 16

**5. కౌలు రైతు సమస్య: గ్రామీణ ప్రాంతాల్లో నేటి తక్షణ వర్గ సమస్య**
– నాగబోయిన రంగారావు 19

**6. సోషలిస్టు ప్రత్యామ్నాయం కోసం పోరాటాలు పెంచాలి!**
– ఆర్. అరుణ్‌కుమార్ 22

**7. వెనిజులా ప్రత్యామ్నాయ ఆరోగ్య విధానం - విజయాలు, సమస్యలు**
– ఇవాన్ రాబర్ట్‌సన్ 29

**8. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు మరింత స్పష్టమైన తరువాతనే సర్దుబాట్లు/స్వతంత్ర పోటీపై నిర్ణయం**
– బివి రాఘవులు 33

**ఎడిటర్:**
ఎస్. వెంకట్రావు

**ఎడిటోరియల్ బోర్డు:**
పాటూరు రామయ్య
బి.వి. రాఘవులు
తమ్మినేని వీరభద్రం
ఎస్. వీరయ్య
తెలకపల్లి రవి

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్:** ఎడిటోరియల్ **0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail:svenkatarao_1958@yahoo.com
Visit cpi(m) site at : cpim.org

# మార్క్సిస్టు మేధావి మాకినేని శతజయంతి

ఇది కామ్రేడ్ మాకినేని బసవపున్నయ్య శతజయంతి సంవత్సరం. మొదటి ప్రపంచ యుద్ధ సంక్షోభ కాలంలో, 1914 డిసెంబర్ 14న గుంటూరు జిల్లా రేపల్లె తాలూకాలో ఒక కుగ్రామంలో జన్మించిన బసవపున్నయ్య అంచెలంచెలుగా ఎదిగి భారత విప్లవోద్యమంలో అత్యంత కీలకమైన నేతగా ఆవిర్భవించారు. 1992 ఏప్రిల్ 12న తుదిశ్వాస విడిచే వరకూ ఆయన ఉద్యమానికి నాయకత్వం వహిస్తూనే ఉన్నారు.

భారత కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేతల్లో ఒకరూ, కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సంస్థాపకుల్లో ముఖ్యులూ అయిన కామ్రేడ్ మాకినేని శతజయంతిని ఈ సంవత్సరం ఘనంగా జరపాలని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ నిర్ణయించింది. భారత కమ్యూనిస్టు ఉద్యమంలోనేగాక, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ తలెత్తిన అనేక సైద్ధాంతిక సమస్యలకు సాధికారికమైన భాష్యం చెప్పిన ఘనుడు కామ్రేడ్ బసవపున్నయ్య. ఆయన సైద్ధాంతిక రంగంలో చేసిన కృషి ప్రత్యేకత కారణంగా ఆ దిశలోనే కార్యక్రమాలు నిర్వహించాలని కూడా కేంద్ర కమిటీ నిర్ణయించింది.

కామ్రేడ్ బసవపున్నయ్య భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కార్యక్రమ రూపశిల్పి. సిపిఐ(ఎం) కార్యక్రమం అంటే భారత విప్లవోద్యమానికి సైద్ధాంతిక దిక్సూచి. అటువంటి కార్యక్రమాన్ని రూపొందించడం అంత సులువైన విషయం కాదు. భారత దేశంలో చారిత్రకంగా పరిణమించిన అనేక సంక్లిష్టతల్లోనుండీ, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో అనేక దశాబ్దాల అంతర్మథనం నుండీ రూపొందించబడిన కార్యక్రమం అది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోని సమస్యలూ దీనికి తోడైనాయి. బసవపున్నయ్య ఇటువంటి సంక్లిష్టతలను అర్థం చేసుకుని, సరైన కార్యక్రమం రూపొందిచండంలో కీలక భూమిక నిర్వర్తించారంటే దానికి ఆయన సుదీర్ఘ విప్లవ పోరాటానుభం, తనదైన మేధోసంపద ఎంతగానో తోడ్పడింది.

కామ్రేడ్ బసవపున్నయ్య పిన్నవయస్సులోనే స్వాతంత్ర్యోద్యమంలో పనిచేశారు. కాంగ్రెస్ విధానాలవల్ల ఈ దేశంలో శ్రామిక ప్రజా విముక్తి జరగదన్న నిశ్చయానికి వచ్చి 1934లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. భారత విప్లవానికి రిహర్సిల్‌గా భావించిన వీరతెలంగాణా విప్లవ పోరాటానికి నాయకత్వ స్థానంలో ఉన్నారు. వివిధ రాష్ట్రాల్లోని రైతాంగ పోరాటాలు చూశారు. ముంబయి, మీరట్, కాన్పూర్ మొదలైన పారిశ్రామిక కేంద్రాల్లో కార్మికోద్యమాల సారాన్ని అర్థం చేసుకున్నారు. భారత విప్లవోద్యమం రష్యా మార్గంలో సాగాలా, చైనా మార్గంలో నడవాలా అన్న చర్చకు ముగింపు పలికేందుకు మాస్కో వెళ్ళి, కామ్రేడ్ స్టాలిన్‌తో చర్చలు జరిపిన నలుగురు సభ్యుల్లో ఆయన ఉన్నారు. ఈ సుదీర్ఘ అనుభవమే ఆయనను ఒక గొప్ప సిద్ధాంత కర్తగా తీర్చిదిద్దింది. ఆ అనుభవమే ఆయనా, ఆయన సహచరులైన పుచ్చలపల్లి సుందరయ్య, ఇఎంఎస్ నంబూద్రిపాద్ వంటి వారితో కలిసి అంతర్జాతీయంగానూ, జాతీయంగానూ అటు రివిజనిజానికీ, ఇటు ఒంటెత్తు వాదానికీ వ్యతిరేకంగా తీవ్రమైన సైద్ధాంతిక పోరాటం చేయడానికి తోడ్పడింది.

అటువంటి సిద్ధాంతవేత్త శతజయంతిని కిందినుండి పైవరకు పార్టీ క్యాడర్ యొక్క సైద్ధాంతిక పదును పెంచడానికి ఉపయోగించుకోవాలి! సమకాలీన సమస్యలకు మార్క్సిజాన్ని ఎలా వర్తింపజేయాలి, నయా-ఉదారవాదం నేపథ్యంలో పెట్టుబడిదారీ వ్యవస్థలోని వివిధ రంగాల్లో వచ్చిన మార్పులను ఎలా అర్థం చేసుకోవాలి అనే అంశాలపై విస్తృతంగా గోష్టులు, సెమినార్లు, స్టడీసర్కిల్స్ వగైరా రూపాల్లో కార్యక్రమాలు రూపొందించాలనీ, నూతన పరిస్థితుల్లో ఉద్యమాలకు ఊపిరులూదడానికి కార్యకర్తల కరవాలంగా సైద్ధాంతిక శక్తిని రూపొందించడానికి ఈ మహామేధావి శతజయంతి సందర్భంగా 2014 సంవత్సరం ఆసాంతం కృషి జరగాలని పార్టీ ఆకాంక్షిస్తోంది.

**చందా వివరాలు**
విడిపత్రిక : **రు.5** సంవత్సర చందా : **రు.60**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**ఎడిటర్,**
**మార్క్సిస్టు**
**(సైద్ధాంతిక మాసపత్రిక)**
**ప్రజాశక్తి ప్రెస్, గవర్నర్‌పేట,**
**విజయవాడ-2**

**ఈ మాసం ముఖ్యాంశం**

# బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు రాష్ట్రానికి నష్టదాయకం

*బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు పర్యవసానాలు కృష్ణా నదీ జలాల పంపిణీకీ, మూడు పరీవాహక రాష్ట్రాలకే పరిమితంకావు. తీర్పులో వెల్లడించిన అనేక మార్గదర్శక సూత్రాలు దేశం మొత్తం మీద తన ప్రభావాన్ని వేస్తాయి. జలాల లెక్కింపుకు కనీసం ఎన్ని సంవత్సరాలను పరిగణించాలి? లెక్కించిన సంవత్సరాల్లో ఎంత నిష్పత్తిని నికర జలాల గుర్తింపుకు తీసుకోవాలి? మూడు దశల్లో మూడు నిష్పత్తుల్లో నికర జలాలను లెక్కించడం సబబేనా? వంటి అనేక ప్రశ్నలు ట్రిబ్యునల్ తీర్పు మూలంగా ఉదయిస్తున్నాయి.*

**బి.వి. రాఘవులు**

కృష్ణా నదీ జలాల పంపిణీకై నియమించిన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు నష్టం కల్గించడమే కాకుండా, వివాదాస్పదం కూడా అయ్యింది. నదీ జలాల పంపిణీలో ఇప్పటి వరకూ అనుసరిస్తున్న అంగీకృత మార్గదర్శకాలకు భిన్నంగా అది కొత్త ఆలోచనలను ప్రవేశ పెట్టింది. ఈ ఆలోచనలు నీటి వివాదాలను గతం కన్నా మెరుగైన పద్ధతిలో పరిష్కారం చేయడానికుపయోగపడితే ఆహ్వానించవచ్చు. ట్రిబ్యునల్ నిర్ణయాలు మన రాష్ట్రంలోనే కాకుండా దేశ వ్యాపితంగా నీటి వివాదాలను ఇంకా తీవ్రం చేస్తాయి.

కృష్ణానది మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లగుండా ప్రవహిస్తున్నది. ఈ నదీ జలాలను మూడు రాష్ట్రాల మధ్య పంపిణీ చేసేందుకు 1968 లో ట్రిబ్యునల్ ఏర్పాటైంది. 7 సంవత్సరాల విచారణ తరువాత 1975లో అది తన అవార్డును ప్రకటించింది. 2000 సంవత్సరం మే 31 తరువాత దీనిపై సమీక్ష చేయవచ్చునని బచావత్ అవార్డులో పేర్కొన్నారు. అయితే మూడేళ్ల పాటు ఎటువంటి సమీక్ష జరగలేదు. రాష్ట్రాల మధ్య కొత్త వివాదాలొచ్చినందున 2004 జూన్ 30న కేంద్ర ప్రభుత్వం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌ను నియమించింది. 6 సంవత్సరాల విచారణ తరువాత. 2010 డిసెంబర్ 30న ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు నష్టదాయకంగా వున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో సుప్రీం కోర్టు ట్రిబ్యునల్ తీర్పును గజెట్‌లో ప్రచురించడంపై స్టే మంజూరు చేసింది. ట్రిబ్యునల్ తన తీర్పును పునఃసమీక్షించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అదే ట్రిబ్యునల్ పునఃసమీక్షించి గతంలో ఇచ్చిన మధ్యంతర తీర్పును బలపరుస్తూ అదనంగా ఆంధ్రప్రదేశ్‌కు 4 టిఎంసీలు (ఆర్‌డిఎస్ కుడి కాలువకు) కేటాయింపుతో 2013 నవంబర్ 29న తుది తీర్పు ప్రకటించింది. వివాదం ప్రస్తుతం సుప్రీం కోర్టులో పెండింగులో వున్నది.

బచావత్ ట్రిబ్యునల్ 75శాతం ఆధారంగా, బ్రిజేష్ ట్రిబ్యునల్ 65శాతం సగటు ఆధారాలుగా మూడు రాష్ట్రాలకు కేటాయించిన జలాల వివరాలు పట్టికల్లో ఇవ్వబడ్డాయి. (టేబుల్-1, టేబుల్ - 2)

ట్రిబ్యునల్ ఉత్తర్వులో వివాదాస్పదమైన నిర్ధారణలు, రాష్ట్రానికి నష్టం కల్గించే వాదనలు, అంశాలు చాలావున్నాయి. వాటిలో ముఖ్యమైన వాటిని క్రింద పేర్కొంటున్నాను.


1) ఇప్పటి వరకు నికర జలాలను లెక్కగట్టేందుకు సంవత్సరం వారీ ప్రవాహ వివరాలను అవరోహణ క్రమంలో జాబితా తయారు చేసి, మొత్తం సంవత్సరాలలో 75 శాతం వద్ద వున్న సంవత్సరం ప్రవాహ మొత్తాన్ని నికర జలంగా పరిగణిస్తున్నారు. గత బచావత్ ట్రిబ్యు

**టేబుల్ 1, వివిధ ఆధారాల వద్ద కృష్ణా జలాల వివరాలు(టిఎంసిలలో)**

| | |
|---|---|
| **75శాతం ఆధారం(బచావత్)** | **- 2130** |
| **65శాతం ఆధారం(బ్రిజేష్)** | **- 2293** |
| **సగటు ఆధారంగా(బ్రిజేష్)** | **- 2578** |

**టేబుల్ 2, కృష్ణా జలాల పంపిణీ వివరాలు(టిఎంసిలలో)**


| పంపిణీ కొలబద్ద | కర్నాటక | మహారాష్ట్ర | ఆంధ్రప్రదేశ్ | మొత్తం |
|---|---|---|---|---|
| 75శాతం ఆధారం(బచావత్) | 734 | 585 | 811 | 2130 |
| 65శాతం ఆధారంగా(బిజేష్) | 61 | 43 | 43 | 147 |
| సగటు ఆధారంగా(బ్రిజేష్) | 105 | 35 | 145 | 285 |
| కనీస ప్రవాహానికి | 7 | 3 | 6 | 16 |
| **మొత్తం** | **907** | **666** | **1105** | **2678** |



**రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పొలిట్‌బ్యూరో సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి.**

నల్ కృష్ణా నదీ జలాల పంపిణీకి 78 సంవత్స రాల వివరాలను తీసుకొని 75శాతం సంవత్స రాన్ని (అంటే 58వ సంవత్సరం) ప్రామాణికంగా తీసుకున్నది. దేశంలోనూ, అంతర్జాతీయంగా కూడా ఇదే ప్రమాణాన్ని ఎక్కువగా పాటిస్తు న్నారు. కానీ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 47 సంవత్సరాల వివరాలను తీసుకుని 65శాతం సంవత్సరం (అంటే31వ సంవత్సరం) ప్రవా హాన్ని నికర జలంగా లెక్కించింది. హేతుబద్ధ వివరణలు లేకుండానే అభ్యంతరాలను కొట్టి

> **❝ గతంలో బచావత్ 75శాతం ఆధారం ప్రాతిపదికగా 2130 టి.ఎం.సిలను నికర జలాలుగా నిర్ణయించి మూడు రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. ఆపై వచ్చే నీళ్ళన్నీ మిగులు జలాలుగా ఆంధ్రప్రదేశ్ వాడుకోవచ్చని చెప్పింది. ఇంతకాలం ఆంధ్రప్రదేశ్ వాటిని వినియోగించుకుంటున్నది. వరదలు, తుపాన్లు వచ్చి నష్ట పోయే రాష్ట్రంగా దిగువ రాష్ట్రాలకు ఎక్కడైనా ఆ వెసులుబాటు వుంటుంది. కానీ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ దాన్ని భగ్నం చేసింది. ❞**




వేసింది. 1951-62లో ప్రకాశం బ్యారేజి దెబ్బతిన్నందున 10 సంవత్సరాలకు లెక్కలు లేవనీ, 1961-62 నుండి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో పొందిన లెక్కలున్నా యనీ ట్రిబ్యునల్ చెప్పిన కారణాలు బలమైనవి కావు. ఎక్కువ సంవత్సరాల నిడివి తీసుకున్న పుడే స్వల్పకాల వ్యత్యాసాల ప్రభావం తక్కువ గావుండి నికర జలాల లబ్ధి గ్యారంటీ ఎక్కువగా వుంటుంది. ట్రిబ్యునల్ ఈ అంశాన్ని గాలికి వదిలేసింది.

2) నికర జలాలను లెక్కగట్టేందుకు ఆధార పడాల్సిన సంవత్సరాల నిష్పత్తి విషయంలో కాల పరీక్షకు నిలబడిన పద్ధతిని ట్రిబ్యునల్ మార్చి వేసింది. గతం నుండి వస్తున్న 75శాతం నిష్ప త్తిని 65శాతానికి తగ్గించి, నికర జలాలను లెక్క గట్టింది. అంతటితో ఆగక సగటు ప్రాతిపది కన కూడా తీసుకుని మిగులు జలాలను నిర్ణయిం చింది. అంటే మూడంచెలలో నికర జలాలను నిర్ణయించి వాటిని మూడు రాష్ట్రాల మధ్య మూడు సార్లు పంచింది. ఈ మూడు సార్లు పంపిణీ చేయగా ఇంకా ప్రవాహం వస్తే వాటిని అదనపు జలాలుగా పరిగణించి ఆంధ్రప్రదేశ్ 2050 మే 31 వరకు వాడుకోవచ్చు అని చెప్పింది. ఇది అన్యాయం కదా అంటే గతంలో బచావత్ ట్రిబ్యునల్ 75శాతం నిష్పత్తిపై పంపిణీ చేసిన దాన్ని భగ్నం చేయకుండా అలాగే వుంచాం కదా అని చెబుతున్నది.

గతంలో బచావత్ 75శాతం ఆధారం ప్రాతిపదికగా 2130 టి.ఎం.సిలను నికర జలా లుగా నిర్ణయించి మూడు రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. ఆపై వచ్చే నీళ్ళన్నీ మిగులు జలాలుగా ఆంధ్రప్రదేశ్ వాడుకోవచ్చని చెప్పిం ది. ఇంతకాలం ఆంధ్రప్రదేశ్ వాటిని వినియో గించుకుంటున్నది. వరదలు, తుపాన్లు వచ్చి నష్టపోయే రాష్ట్రంగా దిగువ రాష్ట్రాలకు ఎక్కడైనా ఆ వెసులుబాటు వుంటుంది. కానీ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ దాన్ని భగ్నం చేసింది. 65శాతం ఆధారంగా163 టి.ఎం.సిల జలాలను నికర జలాల క్రింద పంచింది. సగటు ప్రవాహం ఆధారంగా మరో 205 టి.ఎం.సిలను నికర జలాలుగా భావించి మరోసారి పంపిణీ చేసింది. దీనిలో ఆంధ్రప్రదేశ్‌కు 65 శాతం నికర జలాలో 43 టిఎంసీలు, రీ-ఛార్జీ నికర జలాలు 6టిఎంసీలు మరియు సగటు జలాల నుండి 145 టిఎంసీలు కేటాయించింది. అంటే గతం లో ఆంధ్రప్రదేశ్ మిగులు జలాలుగా వాడుకునే 264 టి.ఎం.సిలను ఇప్పుడు ట్రిబ్యునల్ లేకుండా చేసింది.

3) రెండు దశల్లో మిగులు జలాలను నికర జలాలుగా మార్చి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 43+6+145లలో 150 టి.ఎం.సిలను నాగార్జునసాగర్, శ్రీశైలంలో క్యారీ ఓవర్‌గా నిల్వ చేసుకోవాలని ఆంక్ష పెట్టింది. అంటే ఒక చేత్తో ఇచ్చినట్లు ఇచ్చి, ఇంకో చేత్తో

**“బచావత్ కేటాయించిన 811 టి.ఎం.సిలను బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అనుమానాస్పదంగా మార్చింది. 811 లో 442 పైనుండి వచ్చే నీరుగా, 369 టి.ఎం.సి మన రాష్ట్రం లోని పరివాహక ప్రాంతం నుండి వచ్చే జలంగా విభజిం చింది. అంటే ఏ సంవత్సరం అయినా ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం 442 టి.ఎం.సిలు మాత్రమే పై నుండి నికర జలా లుగా ఇవ్వబడ్డాయి.”**

లాగేసుకున్నది. ఇవన్నీ వరద జలాలయినందున గతంలో మన అవసరాలను బట్టి వినియోగించుకోగలిగే వారం. ఇప్పుడు ఆ అవకాశానికి హద్దు విధించింది. కర్నాటక ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును 519.6 మీటర్ల నుండి 524.256 మీటర్ల పెంపుకు ట్రిబ్యునల్ అనుమతించింది. ఆ విధంగా 130 టిఎంసీలు నిల్వ చేయగల ఆల్మట్టి ఎత్తు పెంపుతో 303 టిఎంసీలు నిలువ చేసుకోవచ్చు. కర్నాటకకు కృష్ణా బేసిన్ -2లో నీటి కేటాయింపు 187 టిఎంసీలు లోపే. ఎగువ తుంగపైన కర్నాటక 11 అక్రమ చెక్‌డ్యాంలు 1 టిఎంసీలోపు నిర్మించి తుంగ నీటిని వినియోగిస్తున్నది. తుంగ నుండి శ్రీశైలంకు 230 టిఎంసీల నికర జలాలు రావాలి. అక్రమ నిర్మాణాల వలన శ్రీశైలంకు నీటి రాక తగ్గుతుంది. ఇటు మధ్య కృష్ణా నుండి, అటు తుంగ నదినుండి నీటి రాక తగ్గడంతో అనావృష్టికాలంలో శ్రీశైలం ఎండిపోతుంది.

4) రాష్ట్రాలకు మిగులు జలాల పంపిణీపై ఆంధ్రప్రదేశ్‌కు ఎప్పుడూ హక్కులేదని కుతర్కం చేస్తున్నది. మిగులు జలాలపై ఆంధ్రప్రదేశ్‌కు హక్కు వుందా లేదా అన్నది ముఖ్యమైన సమస్యకాదు. 75శాతం ఆధారం కొలబద్దను మార్చడం న్యాయమా? కాదా? శాస్త్రీయమా? కాదా? అన్నది ప్రధాన సమస్య. 50శాతం ఆధా రాన్ని కొలబద్దగా తీసుకోమని మహారాష్ట్ర కావేరీ ట్రిబ్యునల్ తీర్పును ఉదహరించినప్పుడు దాన్ని ట్రిబ్యునల్ తిరస్కరించింది. కావేరీ నదీ పరివా హక ప్రాంతంలో రెండు రుతుపవనాలు (ఈశా న్య, నైరుతి) వస్తున్నందున ఆ ప్రత్యేక పరిస్థితుల్లో 50శాతం ఆధారంగా తీసుకోబడిందన్న వాస్త వాన్ని ట్రిబ్యునల్ పేర్కొంది. ఒక రుతుపవనం మీద ఆధారపడే నదులకు 75శాతం ఆధారాన్ని మార్చడానికి వచ్చే సరికి ఇప్పటి వరకు అనుసరించిన శాస్త్రీయ పద్ధతిని విస్మరించింది.

5) 75శాతం ఆధారాన్ని తీసుకుంటేనే ప్రతి నాలుగు సంవత్సరాలలో మూడు సంవత్సరాలు నీటి సరఫరా ఖచ్చితంగా జరుగుతుందన్న భరోసా రైతులకుండి వ్యవసాయం సజావుగా జరుగుతుంది. 65 శాతం లేక సగటు ప్రవాహం ఆధారం అయితే అయితే ప్రతినాల్గు సంవత్స రాలలో రెండు సంవత్సరాలు నీటి సరఫరా లేక వ్యవసాయం ఒక జూదంగా మారుతుంది. సరళీకరణ విధానాలొచ్చి వ్యవసాయాన్ని సగం జూదంగా మార్చితే బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ మిగతా సగాన్ని పూర్తి చేసింది.

6) రెండో విడత నికర జలాల పంపిణీలో వచ్చిన 43 టి.ఎం.సి జలాలలో 30 టి.ఎం.సి నాగార్జునసాగర్‌లో క్యారీఓవర్‌గా వుంచాలి. రెండో విడత వచ్చిన 145 టిఎంసీల్లో 120 టి.ఎం.సి సాగర్‌లో క్యారీఓవర్‌గా వుంచాలి. అంటే మొదటి విడత 811 టి.ఎం.సిలే రాకపోతే క్యారీఓవర్ ఎలాగూ వుండదు. అదనంగా వచ్చినప్పుడు రెండు దశల్లో వచ్చిన క్యారీ ఓవర్‌ను ఆ పంట సంవత్సరంలో అవసరమైనా వినియోగించుకోగూడదు. రాబోయే సంవత్సరం కోసం, ప్రస్తుత సంవత్సరంలో పంటలను బలిచెయ్యడం రైతును నష్టపెట్టడమే. పై రాష్ట్రాలలో క్యారీఓవర్ సమస్యలేదు. రెండు, మూడు దశల్లో వచ్చిన నీటిని వారు నిరభ్యంతరంగా వినియోగించుకోవచ్చును. వాస్తవంగా దిగువ రాష్ట్రానికి మూడు రాష్ట్రాల మధ్య పంపిణీ చేసిన జలాలకు అదనంగా క్యారీఓవర్ ఇవ్వడం సమంజసంకాని, ట్రిబ్యునల్ క్యారీ ఓవర్‌ను కూడా పంచిన జలంలో భాగంగా వుంచింది.

7) బచావత్ కేటాయించిన 811 టి.ఎం. సిలను బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అనుమానస్పదంగా మార్చింది. 811లో 442 పైనుండి వచ్చే నీరుగా, 369 టి.ఎం.సి మన రాష్ట్రంలోని పరివాహక ప్రాంతం నుండి వచ్చే జలంగా విభజించింది. అంటే ఏ సంవత్సరం అయినా ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం 442 టి.ఎం.సిలు మాత్రమే పై నుండి నికర జలాలుగా ఇవ్వబడ్డాయి. పై రాష్ట్రాలలో వారికి కేటాయించబడిన మొదటి దశ(బచావత్) నికర జలాలకన్నా అదనంగా ఉన్నా మనకు 811 టి.ఎం.సిలు లేకపోయినా గాని ఇవ్వకుండా పేచీ పెట్టవచ్చు. ఏదైనా సంవత్సరంలో రాష్ట్రంలో వర్షాభావం వలన 369 టి.ఎం.సిలు రాకపోతే రుతుపవనాలు ఆగిపోయిందాకా వేచిచూసి, ఖచ్ఛితమైన లెక్కలు పై రాష్ట్రాలకు అందిస్తే, ఆ లెక్కలను వారు అంగీకరిస్తే అప్పుడు మనకు ఏర్పడిన లోటును పూడ్చుతారని ట్రిబ్యునల్ పేర్కొంది. అంటే సీజన్ అయిపోయిందాకా ఆంధ్రప్రదేశ్ వేచి చూస్తూవుండాలి. ఈ లోపులో అదనంగా నీళ్ళు(మన 442 టి.ఎం. సి+ పైరెండు రాష్ట్రాలకు 1577టి.ఎం.సి) వస్తే వారు నిల్వ చేసుకోవచ్చు. తీర్పులో మరోచోట మనకు దీనితో 811 టి.ఎం.సి నీళ్ళు వచ్చేదాకా పై రాష్ట్రాలు అదనంగా నీళ్ళు నిల్వ చేసుకోరాదు అని ట్రిబ్యునల్ చెప్పిన మాటకు విలువ లేకుండా పోయింది. అంటే మొదటి దశ 811 టి.ఎం. సిలకు కూడా పై రాష్ట్రాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడేట్టు ట్రిబ్యునల్ చేసింది.

8) గతంలో అదనపు జలాలుగా వున్న నీటిని ఇప్పుడు కొత్త కొలబద్దలతో రెండు దశల్లో నికర జలాలుగా మార్చి రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. అదనాన్ని పంచింది కానీ లోటును పంచలేదు. గతంలో మిగులు జలాలన్నింటినీ ఆంధ్రప్రదేశ్ వినియోగించుకునేది. అలాగే లోటును కూడా పూర్తిగా ఆంధ్రప్రదేశ్ భరించేది. ఇది ఒకరకంగా కష్టనష్టాలను ఎక్కువ భరించే రాష్ట్రానికి కొంత మేరకు న్యాయం చేసినట్లుండేది. కానీ ఇప్పుడు లాభాన్ని అందరికీ పంపిణీ చేసి నష్టాన్ని ఒక్కరే భరించాలన్నట్టు ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. కర్నాటక, మహారాష్ట్రలు దాదాపు ఏ సంవత్సరం బీరు పోకుండా నూరు శాతం బచావత్ ఇచ్చిన నికర జలాలను పొందుతున్నాయి. లోటు ఏర్పడిన సంవత్సరాలు బహు అరుదు. కానీ ఆంధ్రప్రదేశ్ నికర జలాలు గ్యారంటీగా పొందిన సంవత్సరాలు 60శాతం మించలేదు. అంటే లోటంతటినీ ఆంధ్రప్రదేశ్ భరిస్తున్నది. శాస్త్రీయంగా పరిశీలనను ట్రిబ్యునల్ అనుసరించి ఉంటే అదనపు జలాలను పంపిణీ చేసినప్పుడు లోటును కూడా పంపిణీ చేసి ఉండేది. లోటును పంపిణీ చేయడం అంటే ఆంధ్రప్రదేశ్‌కు నికర జలాలు రానపుడు ఎప్పటికప్పుడు నికర జలాల వాడకం పూర్తయ్యే వరకూ నిష్పత్తి ప్రకారం నీటిని క్రిందకు విడుదల అయ్యే ఏర్పాటును ట్రిబ్యునల్ ఏర్పాటు చెయ్యాలి.

జూన్, జూలై మాసాలలో 8-10 టి.ఎం.సిలు అడిగితే విడుదల చేయాల్సి రాంటుందన్న ట్రిబ్యునల్ సూచన కంటితుడుపు చర్య మాత్రమే. పై రాష్ట్రాలు విడుదల చెయ్యకపోతే చెయ్య గల్గింది ఏమీ వుండదు.


*9)* ఆల్మట్టి ప్రాజెక్టు 524.246 మీటర్ల ఎత్తు నిర్మాణానికి ట్రిబ్యునల్ ఆమోదముద్ర వేసింది. తుంగ ప్రాజెక్టుకు 36 టిఎంసీలు కేటాయించడాన్ని, 512 మీటర్లకు మించి ప్రాజెక్టు నిర్మాణాన్ని మొదటి నుండి ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం పెడుతూ వచ్చింది. అధిక మొత్తంలో నీరు ఆల్మట్టిలో నిల్వ చేసుకుంటే ఆంధ్రప్రదేశ్‌కు నికర జలాలు రావడం కూడా ఆలస్యం అయిపోతుంది. వ్యవసాయ సీజన్ రెండు-మూడు నెలలు వెనక్కు పోతుంది. అప్పుడు పంటలు వేస్తే, కోతకొచ్చే సమయానికి తుపాన్లు, అతివృష్టితో పండిన పంట కూడా దెబ్బతింటుందని ఆంధ్రప్రదేశ్ మొత్తుకుంటున్నా, పట్టించుకోలేదు. తన పరిధిలో లేని సమస్యపై ట్రిబ్యునల్ ఎలా నిర్ణయిస్తుందన్న విమర్శ కొంత మంది చేస్తున్నా, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోనే ట్రిబ్యునల్‌కు ఆ అధికారం కట్టబెట్టడాన్ని చూపి ట్రిబ్యునల్ సమర్ధించుకుంటున్నది. ఇతర సందర్భాల్లో ప్రాజెక్టులకు అనుమతులివ్వడం, తిరస్కరించడం, సిడబ్ల్యుసి పని అనీ, తమ పని కాదనీ చెప్పిన ట్రిబ్యునల్ ఆల్మట్టి విషయంలో సుప్రీం సూచన పేరుతో జోక్యం చేసుకోవడం ద్వంద్వ విధానంగా ఉన్నది. సుప్రీం సూచన చేసినప్పటికీ తమ పరిధి కాదని సున్నితంగా తిరస్కరించాల్సింది.

ట్రిబ్యునల్ ఆమోదించిన అదనపు ఎత్తులో అదనపు జలాలను మాత్రమే నిల్వ చేసుకోవాలని, అందువలన ఆంధ్రప్రదేశ్‌కు ఎటువంటి ఇబ్బందిరాదని ట్రిబ్యునల్ చెప్పడం పైకీ బాగానే ఉందనిపించినా, నీటిని వినియోగించడం, అయిన ఖాళీని నింపుకోవడం పలుమార్లు చేసుకునే అవకాశం ఉన్నప్పుడు ఆల్మట్టిలో ఉన్న నీరు ఏది నికరం, ఏది మిగులు అని విభజన చేయడం అసాధ్యమన్న విషయాన్ని ట్రిబ్యునల్ గమనించలేదు.

*10)* మూడు రాష్ట్రాల మధ్య పంపిణీ అసమంజసంగా ఉందనుకుంటే, రాష్ట్రానికి కేటాయించిన మిగులు నికర జలాలను రాష్ట్రంలో పంచిన తీరు ప్రాంతాల మధ్య వివాదాలకు ఆజ్యం పోస్తున్నది.

రాష్ట్రానికి మలి రెండు దశల్లో కేటాయించిన 194 టిఎంసీలలో 150 టిఎంసీలు సాగర్ జలాశయంలో క్యారీ ఓవర్‌కు 25 టిఎంసీలు

> **❝ నదీ జలాల వినియోగంలో అంతర్రాష్ట్ర వివాదాలు రోజు రోజుకూ తీవ్రమవుతున్నాయి. తమిళనాడు-కేరళ మధ్య పెరియార్ వివాదం, తమిళనాడు-కర్నాటకల మధ్య కావేరీ వివాదం, ఆంధ్ర ప్రదేశ్-మహారాష్ట్రల మధ్య బాబ్లి వివాదం, ఆంధ్రప్రదేశ్- ఒరిస్సా మధ్య వంశధార వివాదం మనకు తెలిసినవే. ఇటువంటి వివాదాలు భవిష్యత్‌లో ఇంకా ఎక్కువవుతాయి. సమస్య ఎంత తీవ్రంగా భావించబడుతుందంటే భవిష్యత్తులో జరిగే యుద్ధాలు నీటికోసం జరుగుతాయని చెప్పేంత వరకూ వెళ్లింది. ❞**



జస్టిస్ బ్రిజేష్ కుమార్

తెలుగుగంగకు, 9 టిఎంసీలు జూరాలకు, ఆర్‌డిఎస్ కుడివైపుకు 4 టిఎంసీలు కేటాయించింది. శ్రీశైలం రిజర్వాయర్ మీద ఆధారపడి వెనకబడిన కరువు ప్రాంతాలకుద్దేశించబడిన ఎస్‌ఎల్‌బిసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, హంద్రీనీవా, గాలేరు-నగరి, వెలిగొండ ప్రాజెక్టులకు నీరు కేటాయించలేదు. మనకు పంచిన నీటిలో అత్యధికభాగం ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులకు, సాగర్‌కు క్యారీ ఓవర్‌గా, తెలుగుగంగ, జూరాలకు కేటాయించిన తర్వాత వీటికి ఏమి మిగల్లేదు. సాగర్‌కు క్యారీ ఓవర్‌గా కేటాయించకుండా కొత్త ప్రాజెక్టులకు కేటాయించవచ్చు కదా? కాల్వ కూడా లేని ఆర్‌డిఎస్‌కు నీరు కేటాయించారు గాని, ఫ్లోరైడ్ ప్రాంతాల్లో పూర్తయిన తెలంగాణా ప్రాజెక్టులకు కేటాయించకపోవడం అన్యాయమనీ, రాయలసీమ ప్రాజెక్టుల కేటాయింపు నిర్లక్ష్యం చేయబడిందనీ ప్రాంతాల మధ్య వైషమ్యాలు రేకెత్తే చర్చ ప్రారంభమయ్యాయి. కరువు ప్రాంతాలకుద్దేశించిన ప్రాజెక్టుల పేరుతో కర్నాటకలో అనేక కొత్త ప్రాజెక్టులకు ట్రిబ్యునల్ నీరు కేటాయించింది. పశ్చిమ ప్రాంతానికి (అరేబియా సముద్రానికి) వృధాగా పోయే కొయినా విద్యుత్ ప్రాజెక్టుకు అదనంగా 25 టిఎంసీల నికర జలాలను కేటాయించింది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో ఉన్న ఎస్‌ఎల్‌బిసీ, కల్వకుర్తి, నెట్టెంపాడుకు ఏమీ కేటాయించలేదని విమర్శలొచ్చాయి.

కేంద్ర ప్రభుత్వం శాసనసభలో చర్చకోసం పంపిన 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు'లో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ పదవీకాలాన్ని మరో రెండేళ్ళు పొడిగించబడుతుందని పేర్కొనబడింది. బచావత్ కేటాయించిన నీరు ఇప్పటికే ప్రాజెక్టు వారీగా కేటాయించబడింది. ఇప్పుడు బ్రిజేష్ ట్రిబ్యునల్ ఇచ్చిన అదనపు నికర జలాలు కూడా ప్రాజెక్టు వారీ కేటాయించబడ్డాయి. కేటాయించడానికి నీరు లేకుండా రెండేళ్ల పొడిగింపులో ట్రిబ్యునల్ కొత్తగా చేసేదేముంటుంది? మొత్తంగా ట్రిబ్యునల్ తీర్పునే సవరిస్తే తప్ప. కనీసం క్యారీ ఓవర్ కేటాయింపునైనా, ఇప్పుడు పంపిణీ చేసిన జలాలకు అదనంగా కేటాయిస్తే తప్ప ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరగదు.

*11)* నీటి కేటాయింపులను సంక్లిష్టం చేయడమే కాకుండా పంపిణీ చేయడానికి కూడా సంక్లిష్టమైన ప్రణాళికను రూపొందించింది. గత ట్రిబ్యునళ్ళు ఇచ్చిన చాలా సరళమైన పంపిణీ పద్ధతుల అమలే ఎంత కష్టంగా వుందో, ఎంత ఘర్షణాత్మకంగా వుందో చూస్తే బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన సంక్లిష్టమైన పంపిణీ పద్ధతి అమలు కావడం ఎంత క్లిష్టమో, ఎంత వివాదస్పదమవుతుందో వేరే చెప్పనవసరం లేదు. ఇటువంటి వివాదాల్లో సాధారణంగా ఇబ్బందులు పడేది, నష్టపోయేది దిగువ రాష్ట్రాలే. ప్రస్తుత సందర్భంలో ఆంధ్రప్రదేశే.

ట్రిబ్యునల్ మొత్తం కృష్ణానది పైనున్న ప్రాజెక్టులన్నింటినీ పర్యవేక్షించే పేరుతో ఒక బోర్డును ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును అమలు చేయడం, పర్యవేక్షించడం ఈ బోర్డు చెయ్యాలని ప్రతిపాదించింది. సిబ్బంది మీద పూర్తి నియంత్రణ

**"మారిన పరిస్థితుల్లో చట్టంలో అవసరమైన మార్పులు చేయకపోతే నదీ జలాల వివాదాలు చేయి దాటిపోతాయి. పైన చెప్పినట్లు ప్రతిచుక్కా వినియోగంలోకి వచ్చిన సందర్భంలో వివాదాలు తీవ్రమవుతాయి. దేశ వ్యాపితంగా ఉమ్మడి మార్గదర్శకాల అవసరం ఎక్కువవుతూంది."**

లేకుండా, ప్రాజెక్టుల రక్షణపై అజమాయిషీ లేకుండా ఇటువంటి బోర్డులు రాష్ట్ర ప్రభుత్వాలకు అతీతంగా ఎంత సమర్థవంతంగా పని చేయగలదో "తుంగభద్ర బోర్డు" పనితీరు చూస్తే అర్థమవుతుంది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు ప్రకారం రాష్ట్రం విడిపోయి రెండు రాష్ట్రాలయితే కృష్ణ, గోదావరి నదులకు రాష్ట్రస్థాయిలో రెండు రాష్ట్రాలకు కలిపి ఉమ్మడి బోర్డులు, రెండు బోర్డులపైన ఒక ఎపెక్స్ కౌన్సిల్‌ను ప్రతిపాదించారు. ప్రాజెక్టుల రక్షణ బాధ్యతను సి.ఆర్.పి.ఎఫ్‌కు అప్పగించారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ప్రతిపాదించిన బోర్డుకూ, రాష్ట్రంలో ప్రతిపా దించబడుతున్న బోర్డులకూ సంబంధం ఏమి టో, ఎలా వుంటుందో తెలియదు. ప్రతిపాదనలు తయారు చేసిన వారు ట్రిబ్యునల్ తీర్పులోని ప్రతిపాదనను గమనించారో లేదోనన్న అనుమానం కల్గుతుంది.

నదీజలాల విషయంలో అంతర్రాష్ట్ర వివాదాలు ముదురుతున్న నేపథ్యంలో ఫెడరల్ స్ఫూర్తికి భంగంగాకుండా రాష్ట్రాల మధ్య, ప్రాజెక్టుల మధ్య నీటి పంపిణీ సజావుగా, సక్రమంగా, వివాదరహితంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు అవసరమైన యంత్రాంగం అవసరముంది. అటువంటి యంత్రాంగ స్వరూపస్వభావాలను అందరితో చర్చించి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాల్సి వుంది.

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు పర్యవసానాలు కృష్ణా నదీ జలాల పంపిణీకీ, మూడు పరీవావాహక రాష్ట్రాలకే పరిమితంకావు. తీర్పులో వెల్లడించిన అనేక మార్గదర్శక సూత్రాలు దేశం మొత్తం మీద తన ప్రభావాన్ని వేస్తాయి. జలాల లెక్కింపుకు కనీసం ఎన్ని సంవత్సరాలను పరిగణించాలి? లెక్కించిన సంవత్సరాల్లో ఎంత నిష్పత్తిని నికర జలాల గుర్తింపుకు తీసుకోవాలి? మూడు దశల్లో మూడు నిష్పత్తుల్లో నికర జలాలను లెక్కించడం సబబేనా? వంటి అనేక ప్రశ్నలు ట్రిబ్యునల్ తీర్పు మూలంగా ఉదయిస్తున్నాయి. వీటిన్నింటినీ పరిష్కరించి దేశ వ్యాపితంగా ఉమ్మడి మార్గదర్శక సూత్రాలను రూపొందించాల్సిన అవసరం ాంది.

ఉన్న నీటికన్నా వినియోగం ఇప్పటి వరకు తక్కువగా ఉన్నది. నీటి వినియోగానికి అనేక రంగాలు పోటీ పడుతున్నాయి. వ్యవసాయమే కాక, పట్టణ ప్రాంతాలు పెరగడంతో మంచి నీటికీ, పారిశ్రామికీకరణకూ, పర్యావరణానికీ, విద్యుత్ అవసరాలకూ నీటి అవసరం పెరిగింది. ప్రాధాన్యతలూ నిర్వచించాల్సి వస్తున్నది. అన్ని రాష్ట్రాలూ ప్రాజెక్టులు పూర్తిచేసుకుంటుండంతో నీటి వినియోగం ాచ్ఛస్థాయికి చేరింది. పరిమిత నీటి వనరుల కోసం రంగాల మధ్య, ప్రాంతాల మధ్య తీవ్ర పోటీ ఏర్పడింది. ప్రాంతీయ వైష మ్యాలు పెరగడంలో నీటి సమస్య ముఖ్య పాత్ర నిర్వహిస్తున్నది. నీటి పంపిణీ రాష్ట్రాల మధ్య, రాష్ట్రంలో ప్రాంతాల్లో రంగాల మధ్య శాస్త్రీయం గా, న్యాయంగా పంపిణీ చేయడం ఒక ప్రధాన సమస్యగా ముందుకొచ్చింది. నదీ జలాల వినియోగంలో అంతర్రాష్ట్ర వివాదాలు రోజురోజు కూ తీవ్రమవుతున్నాయి. తమిళనాడు-కేరళ మధ్య పెరియార్ వివాదం, తమిళనాడు-కర్నాట కల మధ్య కావేరీ వివాదం, ఆంధ్రప్రదేశ్-మహారాష్ట్రల మధ్య బాబ్లి వివాదం, ఆంధ్రప్రదేశ్-ఒరిస్సా మధ్య వంశదార వివాదం మనకు తెలిసినవే. ఇటువంటి వివాదాలు భవిష్యత్‌లో ఇంకా ఎక్కువవుతాయి. సమస్య ఎంత తీవ్రంగా భావించబడుతుందంటే భవిష్యత్తులో జరిగే యుద్ధాలు నీటికోసం జరుగుతాయని చెప్పేంత వరకూ వెళ్లింది.

నీటి వివాదాలను పరిష్కరించేందుకు అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద పరిష్కార చట్టం 1956 మన దేశంలో ఉన్నది. ఇప్పటి వరకు ఈ చట్టం ఆధారంగా సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఈ చట్టం ప్రధానంగా నదీ జలాల వినియోగంపై వచ్చే వివాదాలను సంబంధిత రాష్ట్రాల మధ్య ఒప్పందాల ద్వారా లేదా ట్రిబ్యునల్ తీర్పుల ద్వారా పరిష్కారం చేసుకోవాలని చెబుతున్నది. నీటి పారుదల అంశం రాష్ట్రాల పరిధిలో ఉన్నందున సాధ్యమయినంత వరకూ ఫెడరల్ స్ఫూర్తిననుసరించి కేంద్ర ప్రభుత్వం నదీ జలాల పంపిణీలో జోక్యం చేసుకోకూడదని భావించబడుతున్నది. అందుకే నదీ జలాల సమస్యపై నియమించబడిన ట్రిబ్యునల్ తీర్పులను మార్చే హక్కు కేంద్ర ప్రభుత్వానికి చట్టం కల్పించలేదు. ఇప్పటి వరకు చట్టంలోని అంశాలు కొంత మేరకు పని చేశాయి. కానీ మారిన పరిస్థితుల్లో చట్టంలో అవసరమైన మార్పులు చేయకపోతే నదీ జలాల వివాదాలు చేయిదాటిపోతాయి. పైన చెప్పినట్లు ప్రతిచుక్కా వినియోగంలోకి వచ్చిన సందర్భంలో వివాదాలు తీవ్రమవుతాయి. దేశ వ్యాపితంగా ఉమ్మడి మార్గదర్శకాల అవసరం ఎక్కువవు తూంది. ట్రిబ్యునళ్లు విచారణ పూర్తిచేసి తీర్పులు వెలువరించడానికి దశాబ్దాలు తీసుకుంటు న్నాయి. (బచావత్ ట్రిబ్యునల్ 7ఏళ్లు, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ 9 ఏళ్లు). ఇంత ఆలస్యం చేయడం ప్రస్తుత పరిస్థితుల్లో అరాచకానికి దారి తీస్తుంది. అందువలన ఫెడరల్ స్ఫూర్తికి నష్టం కల్గకుండానే అఖిల భారత స్థాయిలో ఉమ్మడి మార్గదర్శకాలు, సత్వరం సమస్యలను పరిష్కరించే శాశ్వత పరిష్కార యంత్రాంగం ఏర్పాటు అవసరం. అందుకు అవసరమైన నూతన చట్టాన్ని తయారు చేయాల్సి ఉంది.

అంతర్రాష్ట్ర పంపిణీ, రాష్ట్రంలో ప్రాజెక్టుల మధ్య పంపిణీ విషయాలే కాకుండా, రైతాంగానికి సాగునీటిని పంపిణీ చేసే విషయంలోనూ తీవ్రమైన మార్పులను ప్రభుత్వాలు చాపకింద నీరులా ప్రవేశపెడుతున్నాయి. ప్రపంచబ్యాంకు ప్రోత్సాహంతో తాగునీటిని, సాగునీటిని వ్యాపారసరుకుగా మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. తీవ్ర ఒత్తిడి మూలంగా జల వనరుల బోర్డును ఏర్పాటు చేస్తూ మన రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 23న జి.ఓ.ను జారీ చేసింది. అంతర్రాష్ట్ర వివాదాలు ఎన్ని సమస్యలు తెస్తాయో నీటి పంపిణీ సంస్కరణలు క్షేత్రస్థాయిలో వ్యవసాయదారులకు అంతకన్నా ఎక్కువ సమస్యలు తెస్తాయి.

వీటన్నింటి గురించి పారదర్శకంగా దేశ వ్యాపితంగా చర్చ జరగాలి. సరియైన విధానాలను చట్టాలను రూపొందించాలి.

**ఈమాసం ప్రత్యేకం**

# సర్దార్ పటేల్ ఒక మతతత్వ వాది, అందుకే బిజెపీకి ఆయనపై ఎనలేని భక్తి



**ఎ.జీ. నూరాని**

"మెజారిటీ మతానికి చెందిన మత తత్వాన్ని, జాతీయవాదంగా భావించే ప్రమాదం నిరతంతరం పొంచి వుంటుంది"


– 1961 జనవరి 5న జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన మాటలివి.

1945 నవంబర్‌లో ముంబయిలోని మెరైన్ డ్రైవ్ వద్ద 'ప్రాణ్ సుఖ్‌లాల్ మఫత్‌లాల్ హిందూ స్విమ్మింగ్ బాత్'ను ఒక ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు ప్రారంభించారు. ఆనాటి నుండి ఈనాటివరకు ఆ స్విమ్మింగ్‌పూల్ లోకి కేవలం హిందువులను మాత్రమే అనుమతిస్తారు. ముస్లిములనూ, ఇతర మతస్థులనూ నేటికీ అందులోకి అనుమతించడం లేదు. అటువంటి స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభించిన వ్యక్తి ఎవరో తెలుసా. ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్. ఆయన సాధించిన ఈ ఘనకార్యం గురించి తెలియ జేస్తూ ఆ ప్రాంగణ ముఖద్వారం వద్ద చాలా కాలం పాటు ఒక ఫలకం వుండేది.

ఇది జరిగిన కొద్ది రోజులకే 1945 నవంబర్ 18న అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) సమావేశంలో పటేల్‌కూ, ద్విజాతి సిద్ధాంతకర్త మొహమ్మద్ ఆలీ జిన్నాకూ మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమావేశంలో పటేల్ ప్రసంగానికి జిన్నా ఇలా సమాధానం ఇచ్చారు: "హిందూ, ముస్లింలు సోదరులు, ఒకే జాతికి చెందిన వారు అని పటేల్ లాంటి వ్యక్తి ఎంత తక్కువగా చెబితే అంత మంచిది. ఆయన ఈ మాటలు చెప్పడానికి ఎంతమాత్రం అర్హుడు కాడు. ముంబయిలో కేవలం హిందువులకు మాత్రమే అనుమతిచ్చే ఈత కొలనును వల్లభ్‌భాయ్ పటేల్ ప్రారంభించలేదా? సముద్రపు నీటిని కూడా పంచుకోడానికి ముస్లిం సోదరులకు అనుమతిలేని ఈత కొలను ప్రారంభోత్సవంలో పటేల్ పాల్గొనడాన్ని నిరసిస్తూ కొంతమంది యువకులు ప్రదర్శన చేసిన విషయం ఆయన మరిచిపోయారా?" (ది నేషన్స్ వాయిస్, వాల్యూమ్ 4, 1947..ఎడిటర్ వహీద్ అహ్మద్)

జవహర్‌లాల్ నెహ్రూ గానీ, సి. రాజగోపాలాచారి (రాజాజీ) గానీ అయ్యుంటే ఇంత దిగజారిన పని చేసి వుండేవారు కాదు. ఇలాంటి వాళ్లనుద్దేశించే అనుకుంటా నెహ్రూ తన ఆత్మకథలో "కాంగ్రెస్ వాళ్లలో చాలా మంది జాతీయవాదం ముసుగు వేసుకున్న మతతత్వ వాదులున్నారు" అని పేర్కొన్నారు. (పేజీ 136)

పటేల్ తత్వమేంటో మనం తెలుసుకోవాలంటే నేడు ఆయనను ఆకాశానికెత్తి ఆదర్శంగా చూపిస్తున్న వారి గురించి తెలుసుకోవాలి. వారిలో ఒకరు ఎల్.కె. ఆద్వానీ, 1990 నవంబర్ 19న అయోధ్యలో చెప్పిన మాటలివి: "ఇకపై హిందూ ప్రయోజనాలు కాపాడేవారే భారత దేశాన్ని పాలిస్తారు". 1990 అక్టోబర్ 2న ఆయన ఇలా అన్నారు: "హిందూ ఆశలపై లౌకిక విధానం అహేతుకమైన అనేక పరిమితులు విధిస్తోంది". ఇంకా బిబిసి తో ఆయన ఇలా చెప్పారు: "బిజెపీని హిందూ పార్టీ అంటే తప్పేమీ కాదు" (ఆర్గనైజర్, 1989 ఆగస్టు 5). 1989 అక్టోబర్ 17న టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక సంపాదకీయంలో అద్వానీని కింది విధంగా విమర్శించింది: "'భారత్‌మాత' గురించి నిత్యం చెప్పే అద్వానీ ధోరణి మహాత్మా గాంధీని జాతిపితగా అంగీకరించని స్థాయికి వెళ్లింది" (మరిన్ని వివరాలకోసం నేను రాసిన "ఆర్ఎస్ఎస్–బిజెపి" పుస్తకం 4వ అధ్యాయం చూడండి.



**రచయిత 1930 సెప్టెంబర్ 16 జన్మించారు. న్యాయవాదిగా, చరిత్రకారునిగా, రచయితగా గుర్తింపు పొందారు. బొంబాయి హైకోర్టు న్యాయవాదిగా, సుప్రీం కోర్టు న్యాయవాదిగా పనిచేశారు. భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన రాజ్యాంగ నిపుణుల్లో ఆయన ఒకరు.**

> **“ ఒకసారి కేంద్రంలో అధికారాన్ని రుచి చూసిన హిందూత్వ శక్తులు ఇప్పుడు మరోసారి ఎలాగైనా, అవసరమైతే మోడీ వాచాలతనుఉపయోగించుకునైనా, లేక గుజరాత్ అల్లర్లలో అతని పాత్రను చూపించైనా, లేక ఆర్ఎస్ఎస్- హిందూత్వకు ఆయన తిరుగులేని మద్దతును చూపించైనా అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారు. వారి ఈ స్కీములో వల్లభ్‌భాయ్ పటేల్ వ్యక్తిత్వం వారికి సరిగ్గా పరిపోతుంది. ”**

లెఫ్ట్ వరల్డ్ (ప్రచురణ). మరి గాంధీ మీద బిజెపీకి ప్రేమ పుట్టుకు రావడం అనేది ఇటీవలి పరిణామం. దాని వెనుక ఒక పథకం దాగి ఉంది.


నెహ్రూ, గాంధీ, పటేల్

నరేంద్ర మోడీ ఒకప్పుడు అద్వానీ శిష్యుడు. ప్రధాని అభ్యర్థి పదవికి జరిగిన పోటీలో ఆయనను గద్దెనుండి దించేసినప్పటికీ ఆయన పంథాను మాత్రం ఇంకా తీవ్రంగా అనుసరిస్తున్నారు. ఆయన మాటలు చదవండి: “దేశమూ, హిందువులూ ఒక్కటే. హిందువుల అభివృద్ధి జరిగితేనే దేశాభివృద్ధి జరిగినట్లు. హిందువుల ఐక్యత దేశాన్ని బలోపేతం చేస్తుంది”. మంగుళూరులో జరిగిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో దాని అధినేత మోహన్ భగవత్ సమక్షంలో నరేంద్ర మోడీ ఈ మాటలు చెప్పారు. “గుజరాత్‌లో ఆర్ఎస్ఎస్‌కు చెందిన సామాన్య స్వయం సేవక్ (అందులో మోడీకూడా ఒకరు) దేశంలో గుజరాత్‌ను నెంబర్ వన్ రాష్ట్రంగా మార్చడానికి అహర్నిశలూ కృషి చేస్తున్నారు” అని చెబుతూ తను “తన జీవితం మొత్తాన్నీ హిందూ సమాజం కోసం పనిచేశాను” అని మోడీ అన్నారు. (ఆర్గనైజర్, ఫిబ్రవరి 11, 2007)

అంతే కాదు 2008 జూన్ 2న బిజెపి విదేశాంగ విధాన పత్రాన్ని విడుదల చేసిన జస్వంత్ సింగ్‌ను ‘నేపాల్ లౌకిక రాజ్యంగా మారితే బిజెపీ సంతోషిస్తుందా’ అని అడిగితే అలా జరిగితే హిందూ “సనాతన ధర్మాన్ని నమ్మేవాడిగా తాను కృంగిపోతానని” అన్నారు. నేపాల్ లౌకిక రాజ్యంగా మారితేనే బాధతో కృంగిపోయే వీళ్లుమన రాజ్యాంగంలోని లౌకికతత్వాన్ని నిజంగా ఆమోదిస్తారా అన్నది ప్రశ్న. వీళ్ల బుర్రల్లో భారత జాతీయ వాదం, హిందూ మతతత్వ వాదం లేక మోడీ చెప్పినట్లు హిందూ జాతీయ వాదం అనే రెండు లేవు. ఉన్నదంతా ఒకటే హిందూ మతతత్వ వాదం. అందుకే వీరు నెహ్రూను ద్వేషిస్తారు. పటేల్‌ను ఆరాధిస్తారు.

భారత జాతీయవాదులకు భిన్నంగా.. తమను తాము హిందూ జాతీయ వాదులమని చెప్పుకుంటున్న ఈ ముసుగువీరులు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను పొగడ్తలతో ముంచెత్తడానికి కారణం, ఆయన వారి సిద్ధాంతాలకు దగ్గరగా ఉండడమే. విశేషమేమంటే వీరు పటేల్‌లో ఉన్న సుగుణాలేమిటో చెప్పి పొగడ్డం లేదు. ఆయనను నెహ్రూకు వ్యతిరేకంగా నిలబెట్టి పొగుడుతున్నారు. దీనివెనుక లక్ష్యం ఒకటే. హిందూ జాతీయవాదం పేరుతో భారత జాతీయవాదాన్ని రూపుమాపడం. అప్పుడు భారత జాతీయవాదంతో పాటు లౌకికవాదం కూడా రూపుమాసిపోతుంది.

నెహ్రూ ఈ రెంటి కోసం అంటే, భారత జాతీయవాదం, లౌకికతత్వం కోసం నిలబడ్డారు. ఆయన స్థాపించిన విలువలను నిర్మూలించడమే ఈ మతతత్వ వాదుల లక్ష్యం. నెహ్రూ ఇటువంటి ఉపద్రవాన్ని చాలా కాలం క్రితమే గుర్తించారని నాటి మన విదేశాంగ శాఖ కార్యదర్శి వై.డి. గుండేవియా తన ఆత్మ కథలో రాశారు. తన శాఖలో వారానికొకసారి జరిగే సమావేశంలో అధికారులనుద్దేశించి ప్రసంగించమని ప్రధాని నెహ్రూను గుండేవియా కోరారు. నాడు కేరళలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చి ఉంది. “రేపు కేంద్రంలో కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తే తమ సర్వీసులకు ఏమవుతుంది?” అని గుండేవియా అడిగారు. దానికి నెహ్రూ సమాధానమిస్తూ మీరంతా కమ్యూనిస్టులు, కమ్యూనిజం అంటే ఎందుకంత భయపడిపోతున్నారు? మనం చేయలేంది కమ్యూనిస్టులు చేసేస్తారా? అసలు కమ్యూనిస్టులు ఓట్లద్వారా అధికారంలోకి వస్తారని ఎందుకనుకుంటున్నారు? అని అంటూ “గుర్తుంచుకోండి, భారత దేశానికి కమ్యూనిజం వల్ల ప్రమాదం లేదు, ప్రమాదమంతా హిందూ మితవాద మతతత్వ వాదులనుండే” అని నెహ్రూ చెప్పారు.

ఒకసారి కేంద్రంలో అధికారాన్ని రుచి చూసిన హిందూత్వ శక్తులు ఇప్పుడు మరోసారి ఎలాగైనా, అవసరమైతే మోడీ వాచాలతను ఉపయోగించుకునైనా, లేక గుజరాత్ అల్లర్లలో అతని పాత్రను చూపించైనా, లేక ఆర్ఎస్ఎస్–హిందుత్వకు ఆయన తిరుగులేని మద్దతును చూపించైనా అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారు. వారి ఈ స్కీములో వల్లభ్‌భాయ్ పటేల్ వ్యక్తిత్వం వారికి సరిగ్గా పరిపోతుంది.

### నెహ్రూ – పటేల్

తన వారసునిగా పటేల్‌ను కాకుండా నెహ్రూను నిర్ణయించడంలో గాంధీ తెలివిగా వ్యవహరించారు. నాడు నెహ్రూ ప్రజలకు తిరుగులేని నాయకుడు. ప్రపంచమంతటికీ భారత దేశ జాతీయవాదానికి ప్రతిబింబం ఆయన. పటేల్‌ది సంకుచిత మనస్తత్వం. ఆయనకు పార్టీ యంత్రాంగం మీద మంచి పట్టు ఉండేది. నిధులు బాగా వసూలు చేసేవారు. ఇద్దరిలో ఒకరికి మరొకరి అవసరం ఉండేది. కాంగ్రెస్ అభ్యర్థికి నిధులు కావాలి, అదే సమయంలో ప్రజా మద్దతు కూడా కావాలి. నెహ్రూ వారికి దేశమంతటా ప్రజా మద్దతు సమకూర్చేవారు.

నెహ్రూ సంస్కారం కలిగి, సున్నితంగా ఉండేవారు. పటేల్ కొంతవరకు ముతకగా ఉండేవారు. నెహ్రూకు ప్రాపంచిక దృక్పథం ఉండేది. పటేల్‌కు అంతర్జాతీయ వ్యవహారాలు తెలిసేవి కావు. నెహ్రూ అనేక తీవ్రమైన తప్పిదాలు చేసినా, వైఫల్యాలున్నా ఆయన గొప్పవ్యక్తి. పటేల్‌కు అనేక మంచి లక్షణాలున్నా అల్పమైన వాడు.

మద్రాసు రాష్ట్రానికి బ్రిటిష్ ప్రభుత్వ చివరి గవర్నర్ అయిన సర్ ఆర్చిబాల్డ్ న్యే పటేల్ చనిపోయిన రెండు మాసాలకు 1951 ఫిబ్రబరి 15న ఆయన గురించి బ్రిటిష్ ప్రభుత్వానికి ఒక రహస్య నివేదిక పంపారు. ఎంతో సమతుల్యంగా ఉన్న ఈ నివేదికలో ఆయన ఇలా పేర్కొన్నాడు: “కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కోశాధికారి అయిన

**"హిందూ జాతీయవాదిగా పేరుపొందిన పటేల్‌కు ఆర్‌ఎస్‌ఎస్‌తో రహస్య, వ్యక్తిగత సంబంధాలూ, ఏర్పాట్లూ ఉండేవి. భారత్, బ్రిటిష్ వ్యాపార ప్రపంచంతో మంచి సంబంధా లుండేవి. అందువల్లనే కాంగ్రెస్ నాయకులు ప్రధానికి కాకుండా ఆయనకు విజ్ఞాపనలు చేసుకుంటుండే వారు..... సనాతన హిందువుగా ఆయన తన మతతత్వ సానుభూతులను కప్పి పుచ్చుకునేవారు కాదు."**

పటేల్ పార్టీ యంత్రాంగ మీద చివరి వరకు గట్టి పట్టు కొనసాగించారు. పార్టీపై ఆయన పట్టు ఎంతగా ఉండేదంటే, 1950 సెప్టెంబర్ లో జరిగిన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో ప్రధాని (నెహ్రూ) ఇష్టానికి వ్యతిరేకంగా ఆయన పురుషోత్తమదాస్ టాండన్‌ను పోటీకి నిలిపాడు.... సర్దార్ పటేల్ ప్రపంచంలో అందరి కన్నా గొప్ప పార్టీ నాయకుడనడంలో సందేహం లేదు. వ్యక్తిగతంగా నిజాయితీపరుడే అయినా ఆయన పద్ధతులు అనుమానించదగ్గవి. మార్వాడీ వ్యాపారులనుండి నిధులు వసూలు చేయడంలో ఆయన వారసత్వం అవినీతికి దారితీసిందనీ, పార్టీని ఇప్పటికీ అది పట్టి పీడిస్తున్నదనీ విమర్శలున్నాయి. చాలా వరకు మానవతావాది, మంచి ఆకర్షణ గల నాయకుడైనప్పటికీ ఆయన ప్రతిపక్షాలను మాత్రం సహించలేకపోయేవారు. హిందూ జాతీయవాదిగా పేరుపొందిన ఆయనకు ఆర్‌ఎస్‌ఎస్‌తో రహస్య, వ్యక్తిగత సంబంధాలు, ఏర్పాట్లు ఉండేవి. భారత్, బ్రిటిష్ వ్యాపార ప్రపంచంతో మంచి సంబంధాలుండేవి. అందువల్లనే కాంగ్రెస్ నాయకులు ప్రధానికి కాకుండా ఆయనకు విజ్ఞాపనలు చేసుకుంటుండేవారు..... సనాతన హిందువుగా ఆయన తన మతతత్వ సానుభూతులను కప్పి పుచ్చుకునేవారు కాదు." 1946 అక్టోబర్ 22న నాటి వైస్‌రాయ్ బ్రిటిష్ రాజుకు పటేల్ గురించి రిపోర్ట్ చేస్తూ, ఆయన "ఖచ్చితమైన మతతత్వ వాది" అని చెప్పారు. ('అధికార బదిలీ' వాల్యూమ్8, పేజీ 772)

ఇటువంటి మనిషి నూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశానికి ఎటువంటి ప్రతిష్ట తెస్తారో ఆలోచించుకోవచ్చు. ఇటువంటి వ్యక్తి ఉన్నతమైన సంప్రదాయాలు గల మన బహుళ సంస్కృతుల దేశానికి స్ఫూర్తిని ఎలా ఇవ్వగలుగుతారు? పటేల్ పారిశ్రామిక వేత్తలకు దగ్గరి బంధువు, కార్మికులంటే సానుభూతిలేని వ్యక్తి. న్యే చెప్పినట్లు ఆయన అసమ్మతిని ఏమాత్రం సహించలేరు. కమ్యూనిస్టులనే కాదు, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని కూడా ఆయన చిన్నచూపు చూసేవారు.

వల్లభ్‌భాయ్ పటేల్ మాదిరిగానే రాజేంద్ర ప్రసాద్, పురుషోత్తమదాస్ టాండన్, కె.ఎం. మున్షి, గోవింద వల్లబ్ పంత్, ఇంకా చాలా మంది కాంగ్రెస్ నాయకులు హిందూ జాతీయ వాదులుగానే ఉండేవారు అని ప్రొఫెసర్ యోగేంద్ర మాలిక్, వి.బి. సింగ్‌లు రాశారు. ("భారత దేశంలో హిందూ జాతీయవాదులు: భారతీయ జనతాపార్టీ ఎదుగుదల" విస్తార్ పబ్లిషర్స్, 1994, పేజీ 219) వీరెవరూ కూడా




*హిందువులకు మాత్రమే ప్రవేశం కల్పించే 'పాన్‌సుఖ్‌లాల్ మఫత్‌లాల్ ఈత కొలను.' ముంబయిలోని మెరెన్‌డ్రైవ్ వద్ద ఇప్పటికీ ఉంది. సర్దార్ పటేల్ దీన్ని ప్రారంభించారు.*

కాంగ్రెస్‌లో గొప్ప భక్తుడూ, హిందూ మతగ్రంథాలైన భగవద్గీత, ఉపనిషత్తులను ఔపోసన బట్టిన రాజగోపాలాచారి (రాజాజీ)కి ఏమాత్రం సరిపోలరు. రాజాజీ ఎంత భక్తుడో అంత లౌకికవాది. అందుకే ఈ హిందూ జాతీయవాదులకు రాజాజీ అన్నా, నెహ్రూ అన్నా పడదు. నెహ్రూను తొలి ప్రధానిని చేసినందుకు సంఘ్ పరివారం గాంధీని విమర్శిస్తారు. కానీ 1949–50లో తొలి గవర్నర్ జనరల్‌గా ఉన్న రాజాజీని తొలి రాష్ట్రపతి కాకుండా కుట్రపన్నిన పటేల్‌ను మాత్రం విమర్శించరు. గవర్నర్ జనరల్ గృహం నుండి రాజాజీని తొలగించి రాజేంద్ర ప్రసాద్‌ను పటేల్ తొలి రాష్ట్రపతిగా చేసినందు వల్ల ఆయన 1947–50 మంత్రి వర్గాన్ని మతపరంగా నిర్మించడానికి తోడ్పడ్డాడు.

**రాష్ట్రాలపై శ్వేతపత్రాలు**


కాషాయ పరివారం పటేల్ విజయాలను బూతద్దంలో చూపిస్తూ ఆయన వైఫల్యాలను విస్మరిస్తున్నారు. వివిధ సంస్థానాలు భారత యూనియన్‌లో కలవడం రెండు దశల్లో సాగింది. మొదటిది, వివిధ సంస్థానాలు యూనియన్‌లో విలీనం కావడం, రెండోది అవి పునర్వ్యవస్థీకరించబడి ఇతర రాష్ట్రాలలో కలిసిపోవడం. ఈ రెండో దశలో పటేల్ చాకచక్యంగా పనిచేశారని ఆయన రాసిన 'భారత సంస్థానాలపై రెండు శ్వేతపత్రాలు' పుస్తకం చదివితే తెలుస్తుంది. కానీ సంస్థానాల విలీనం అనేది మొదటి దశలో జరిగింది. ఇదే కీలకమైన దశ. ఒకసారి సంస్థానాధిపతులు ఆత్మస్థైర్యం కోల్పోయిన తరువాత వారి సంస్థానాలు విలీనం చేయడం సులువయింది. 1947 ఆగస్టు 15 నాటికే జునాగఢ్, కాశ్మీర్, హైదరాబాద్ మినహా మిగిలిన సంస్థానాలన్నీ విలీనం ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ విషయంలో చివరి బ్రిటిష్ వైస్‌రాయ్ లార్డ్ మౌంట్ బాటన్ మెళకువలూ, ఆనాటి సంస్థానాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి.పి. మీనన్ యొక్క న్యాయ శాస్త్ర పారంగత్యం ఎంతగానో పనిచేశాయని మీనన్, అప్పటి సంస్కరణల కమిషనర్ హెచ్.వి. హడ్సన్‌లు రాసిన పుస్తకాలు తెలియజేస్తున్నాయి. వైస్రాయ్ సంస్థానాల విలీనానికి తను చేసిన కృషిని పటేల్‌కు ఎప్పటికప్పుడు చెబుతుండేవారు. సంస్థానాధిపతుల ఛాంబర్‌లో జిన్నా అనుకూలుడైన భోపాల్ నవాబ్ ప్లేటు ఫిరాయించిన తరువాత విలీనాల విషయంలో భారత్ పని సులువైపోయింది.

రాష్ట్రాల విలీనంపై సర్దార్ పటేల్ అభిప్రాయాలను హడ్సన్ 'మహా విభజన' (1969) పుస్తకంలో చక్కగా రికార్డు చేశారు. ఆయన ఇలా రాశారు: "మీరు రాష్ట్రాల గురించి ఆందోళన చెందవద్దు అని సర్దార్ తనతో (మౌంట్

> **“ మహాత్మాగాంధీ హత్యకు జరిగిన కుట్రపై “విచారణ కమిటీ నివేదిక” సమర్పించిన జస్టిస్ జె.ఎల్. కపూర్.... మహాత్ముని ప్రాణం తీసిన ఈ హత్యపై విచారణ జరగాల్సిన రీతిలో జరగలేదనీ, అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం కనిపించిందని చెబుతూ, “విచారణకు ఇంఛార్జి మంత్రిగా వున్న హొమ్ మంత్రి వల్లభ్ భాయ్ పటేల్‌కూడా దీనిపై ఆసక్తి చూపించినట్లు కనిపించలేదు” అని చెప్పారు. ”**

బాటన్) అన్నారు. ఎందుకంటే (బ్రిటిష్ నుండి) అధికారం చేతులు మారినవెంటనే సంస్థానాల్లోని ప్రజలు తిరగబడతారు. వారు తమ పాలకులను గద్దెదించి కాంగ్రెస్‌తో చేతులు కలుపుతారు. అయితే సంస్థానాల వద్ద సొంత సైన్యం వుందని వైస్రాయ్ పటేల్‌కు గుర్తు చేశారు. ఈ సైన్యానికి బ్రిటిష్ వాళ్ల శిక్షణ ఇచ్చారు. ఆయుధాలు సమకూర్చారు. హైదరాబాద్ సంస్థానం లాంటి కొందరి దగ్గర సొంత రెగ్యులర్ సైన్యం వుంటే, మరికొన్ని సంస్థానాల్లో స్వంత అంగరక్షక దళాలున్నాయి. ప్రజలనుండి తిరుగుబాటు వస్తే కాల్చేయడానికి వారి సొంత దళాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇదే జరిగితే భారత్‌కు నష్టం జరుగుతుంది అని వైస్రాయ్ చెప్పారు. దానికి పటేల్ ‘ఏమిటి మీ వుద్దేశం’ అని అడిగారు. దానికి వైస్రాయ్ సమాధాన మిస్తూ, సంస్థానాధిపతుల పదవులనూ, భూమియేతర హక్కులనూ, వ్యక్తిగత సంసదనూ వారికే అట్టిపెడితే దానికి ప్రతిఫలంగా వారు భారత డొమినియన్‌లో చేరతారు. రక్షణ, విదేశీవ్యవహారాలు, సమాచార సంబంధాలు వంటి వాటిని కేంద్రానికి అప్పగించి మిగిలిన హక్కులన్నీ వారికే వుంచేయాలి అని చెప్పారు. దీని గురించి ఆలోచిస్తాను అని పటేల్ అన్నారు.

“తరువాత పటేల్ వి.పి మీనన్‌ను కలిసి, సంభాషించి వైస్‌రాయ్‌ని చూడ్డానికి వచ్చారు. మౌంట్ బాటన్‌తో ఆయన ఇలా చెప్పారు: “మీరు చెప్పింది అంగీకరించడానికి నేను సిద్ధమే. అయితే మీరు నాకు ‘ఒక గంపనిండా ఆపిల్ పళ్లు ఇవ్వాలి” అన్నారు. అంటే ఏమిటి అర్థం? అని లార్డ్ మౌంట్ బాటన్ అడిగారు. “నేను 565 పళ్లు – మొత్తం సంస్థానాల సంఖ్య– వున్న ఆపిల్ బుట్టకొంటాను. కానీ అందులో రెండు లేక మూడు పళ్లు తగ్గినా కొనను అని పటేల్ అన్నారు. “దీన్ని నేను పూర్తిగా ఒప్పుకోను. కానీ నా శాయశక్తులా ప్రయత్నిస్తాను” అని మౌంట్ బాటన్ అన్నారు. ఒకవేళ బుట్టలో 560 వుంటే మీరు కొంటారా? అని మౌంట్ బాటన్ అంటే, ‘కొనొచ్చు’ అని పటేల్ సమాధానం



*1955లో రాజాజీకి భారత రత్న అవార్డు అందజేస్తున్న తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్: భారత తొలి గవర్నర్ జనరల్ రాజాజీ లౌకిక వాది కనుక ఆయన భారత తొలి రాష్ట్రపతి కాకుండా పటేల్ అడ్డుకున్నారు.*

చెప్పారు. (హడ్సన్ పుస్తకం 367–8 పేజీలు). ఆ విధంగా సంస్థానాలు –బుట్టలో ఆపిల్ పళ్లు– సమీకరించే పనిని పటేల్ అటు మౌంట్ బాటన్‌కూ, ఇటు మీనన్‌కూ అప్పగించారన్న మాట. అందువల్ల భారత దేశాన్ని ఐక్యపరిచే ప్రతిష్ట ఈ వ్యక్తులిద్దరికీ దక్కుతుంది.

**గాంధీ హత్య**

పటేల్ ‘సాధించిన’ ఈ విజయాలను ఒకవైపు బూతద్దంలో చూపిస్తూ మరోవైపు గాంధీని హత్య చేయడంలో వీరసావర్కర్ పన్నిన కుట్రను మొగ్గలోనే తుంచివేయడంలో పటేల్ వైఫల్యాన్ని విస్మరిస్తున్నారు. ఈ విషయంలో ఆయనను తీవ్రంగా విమర్శించిన వారిలో జయప్రకాష్ నారాయణ్ కూడా వున్నారు. “హొమ్ శాఖలో మతతత్వానికి అతీతంగా వుండే వ్యక్తి వుండాలని నేను కోరుకుంటున్నాను” అని జయప్రకాష్ నారాయణ్ 1948 ఫిబ్రవరి 28న పేర్కొన్నారు. (బొంబే క్రానికల్, ఫిబ్రవరి 28, 1948)

1948 జనవరి 20న గాంధీ ప్రార్థనా సమావేశం వద్ద మదన్‌లాల్ పహ్వా ఒక బాంబు పేల్చాడు. దానికి వారం రోజుల క్రితమే ఆయన సావార్కర్‌ను కలుసుకున్నాడు. 1948 జనవరి 30 గాంధీని హత్యచేశారు. ఈ పదిరోజుల కాలంలో కుట్రను భగ్నం చేసి గాంధీ ప్రాణాలు కాపాడి వుండే వారు. కానీ అలా జరగలేదు. మహాత్ముడు అమరుడైనాడు. తను “హంతకుల ముఠాలో ఒకడినని” మదన్‌లాల్ పహ్వా పోలీసులతో చెప్పాడు. తను వ్యక్తిగతంగా సావర్కర్‌ను కలిశానని కూడా చెప్పాడు. “దీని వెనుక కుట్ర దాగి వుందని ఏడు గంటల్లోనే పోలీసులకు తెలిసిపోయింది. ఎంతమంది వ్యక్తులు దీనివెనుక దాగి వున్నది కూడా వారికి తెలిసింది... వారి వద్ద వున్న సమాచారంతో, కొంత ఓర్పుగా కృషి చేసుంటే వారు గాంధీ హత్యకు ముందే నాథూరామ్ గాడ్సేను పట్టుకుని వుండేవారు” (లార్రీ కోలిన్స్, డొమినిక్ లాపిర్రె, “ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్” 1976, పేజీ 412: వీరికి పోలీసు ఫైల్స్ వెదకడానికి అనుమతి లభించింది). ఢిల్లీలో సీనియర్ పోలీసు అధికారుల తీవ్ర నిర్లక్ష్యాన్ని అవి బట్టబయలు చేశాయి. సావర్కర్‌ను అరెస్టు చేయడానికి మొరార్జీ దేశాయ్ నిరాకరించారు. మదన్‌లాల్ తొలిరోజే సావర్కర్ పేరు చెప్పాడు కాబట్టి పటేల్ ఆయన అరెస్టుకు ఆదేశించాల్సి వుండాల్సింది. జనవరి 24వ తేదీన రాత్రి 9.30 నిమిషాలకు 54 పేజీల ఒప్పుకోలు పత్రంపై మదన్‌లాల్ సంతకం చేశాడు. (అదే పుస్తకం పేజీ 418). ఒక మహాత్ముని జీవితం కాపాడ్డానికి అప్పటికి కూడా ఇంకా సమయం వుంది. కానీ పటేల్ ఆ పని చేయలేదు. ఈ విషయం గురించి సంఘ్ పరివారం ఏనాడూ నోరెత్తదు. కానీ 1953 జూన్ 23న శ్రీనగర్‌లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గుండెపోటుతో మరణించడానికి మాత్రం నెహ్రూ, షేక్ అబ్దుల్లాలను బాధ్యులను చేసి విమర్శిస్తుంటారు.

మహాత్మాగాంధీ హత్యకు జరిగిన కుట్రపై “విచారణ కమిటీ నివేదిక” సమర్పించిన జస్టిస్ జె.ఎల్. కపూర్.... మహాత్ముని ప్రాణం తీసిన ఈ హత్యపై విచారణ జరగాల్సిన రీతిలో జరగలేదనీ, అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం కనిపించిందని చెబుతూ, “విచారణకు ఇంఛార్జి మంత్రిగా వున్న హొమ్ మంత్రి వల్లభ్ భాయ్ పటేల్‌కూడా దీనిపై ఆసక్తి చూపించినట్లు కనిపించలేదు” అని చెప్పారు.

**అజాద్‌కు వ్యతిరేకి**

స్వాతంత్ర్య భారత తొలి మంత్రివర్గంలో అబ్దుల్ కలామ్ అజాద్‌కు స్థానం వుండకూడదని

**❝1948 జనవరి 6న పటేల్ ఒకవైపు అజాద్ దేశభక్తిని ప్రశ్నిస్తూ, హిందూమహాసభ, ఆర్ఎస్ఎస్ వాళ్లను కాంగ్రెస్‌లో చేరాలని ఆహ్వానించారు. పచ్చి మతతత్వ వాదులు మాత్రమే ఆ పని చేయ గలరు. ఆయన ఇలా అన్నారు: "నేను భారతీయ ముస్లింలను ఒకే ప్రశ్న వేస్తున్నాను. ఇటీవల జరిగిన అఖిలభారత ముస్లిం కాన్ఫరెన్స్‌లో మీరు కాశ్మీర్‌పై ఎందుకు నోరు మెదప లేదు? పాకిస్థాన్ చర్యలను ఎందుకు ఖండించలేదు? ఇవన్నీ ప్రజల మనసుల్లో సందేహాలు లేవనెత్తుతున్నాయి.❞**



*మతతత్వ వాదిగా ఉండకపోవడమే మహాత్ముని నేరం : ఆర్ఎస్ఎస్ శక్తుల తూటాలకు బలైన గాంధీ మృతదేహం*

నెహ్రూను గాంధీ కోరారు. కారణం "క్యాబినెట్‌లో ఆయన ఉండకూడదని సర్దార్ గట్టిగా పట్టుబడు తున్నారు... ఆయన కాకుండా ఇంకో ముస్లిం మంత్రి పేరు ప్రతిపాదించడం కష్ట సాధ్యం" అని గాంధీ చెప్పారు. (మహాత్మాగాంధీ ఏరిన రచనలు వాల్యూమ్9, పేజీ 408). తరువాత మరింత ఘోరమైన విషయం జరిగింది. మహమ్మద్ ఆలీ జిన్నా చేసిన అవమానాలూ, తన స్వంత మతస్తుల ఛీత్కారాలు సహించి నిలబడిన అజాద్ దేశభక్తిని పటేల్ బహిరం గంగానే ప్రశ్నించడం ప్రారంభించారు. 1947 డిసెంబర్ 27న లక్నోలో అజాద్ ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ మహాసభ నిర్వహించి కాంగ్రెస్‌లో చేరాలని ముస్లింలను అభ్యర్థించారు. ఆ మరునాడు ఇదే విధమైన తీర్మానం మహాసభలో ఆమోదించారు. (నేను రాసిన "భారతీయ ముస్లింలు: చారిత్రక పత్రాలు", ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, 2003, పేజీ 65లో చూడండి).

అయితే అదే నగరంలో కొద్ది రోజుల తరువాత 1948 జనవరి 6న పటేల్ ఒకవైపు అజాద్ దేశభక్తిని ప్రశ్నిస్తూ, అదే ప్రసంగంలో హిందూమహాసభ, ఆర్ఎస్ఎస్ వాళ్లను కాంగ్రెస్‌లో చేరాలని ఆహ్వానించారు. పచ్చి మతతత్వ వాదులు మాత్రమే ఆ పని చేయ గలరు. ఆయన ఇలా అన్నారు: "నేను భారతీయ ముస్లింలను ఒకే ప్రశ్న వేస్తున్నాను. ఇటీవల జరిగిన అఖిలభారత ముస్లిం కాన్ఫరెన్స్‌లో మీరు కాశ్మీర్‌పై ఎందుకు నోరు మెదపలేదు? పాకిస్థాన్ చర్యలను ఎందుకు ఖండించలేదు? ఇవన్నీ ప్రజల మనసుల్లో సందేహాలు లేవనెత్తుతున్నాయి. దేశభక్తి లేనివారు పాకిస్థాన్ వెళ్లిపోవచ్చు." అప్పటినుండి కాశ్మీర్ అనేది ముస్లింల దేశభక్తికి పరీక్షగా మారిపోయింది.

**ఆర్ఎస్ఎస్‌కు ఆహ్వానం**

పటేల్ ఒకవైపు ముస్లింలపై కత్తిదూస్తూనే ఆర్ఎస్ఎస్‌కు స్నేహ హస్తం అందించారు. "నేను ఆర్ఎస్ఎస్ వారిని ఒకటే కోరుతున్నాను. దేశంలో అల్లర్లు సృష్టించి ప్రభుత్వాన్ని బలహీనపరచవద్దు, మీరంతా వచ్చి కాంగ్రెస్‌లో చేరండి.... అధికారంతో ఆర్ఎస్ఎస్‌ను అణచి వేయవచ్చునని కాంగ్రెస్‌లో కొందరు భావి స్తున్నారు. ఒక సంస్థను మీరు "దండం"తో అణచివేయలేరు. 'దండం' దొంగలు, బందిపోట్ల కోసం ఉద్దేశింపబడింది. కానీ ఆర్ఎస్ఎస్ వాళ్లు దొంగలూ, బందిపోట్లూ కారు. వాళ్లు దేశభక్తులు. వాళ్లు దేశాన్ని ప్రేమిస్తారు. అయితే వాళ్ల ఆలోచనలే దారిమళ్లాయి. కాంగ్రెస్ వాళ్లు ప్రేమతో వాళ్ల హృదయాలను గెలుచుకోవాలి". ('ఐక్య భారత దేశం కోసం: సర్దార్ పటేల్ ప్రసంగాలు', పబ్లికేషన్ విభాగం, పేజీలు 64-65). నెహ్రూ లేని సమయంలో ఆయన చాలా మంది ఆర్ఎస్ఎస్ వాళ్లను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోకి తీసుకున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీలో నెహ్రూ చేతులు కట్టిపడేయడానికి దారితీసింది. ఢిల్లీలో ముస్లిం శరణార్థులకోసం కొన్ని ప్రాంతాలను రిజర్వు చేయాలనీ, ముస్లిం శరణార్థుల సమస్యలు పరిష్కరించడానికి ముస్లిం అధికారులను నియమించాలనీ నెహ్రూ చేసిన ప్రతిపాదనలను పటేల్ ప్రతిఘటించారు. దీంతో నెహ్రూ చాలా విసిగిపోయారు. ఢిల్లీలోనూ, యునైటెడ్ ప్రావిన్సులలోనూ ముస్లిం షాపులను సీల్ చేయాలని శరణార్థి శాఖ మంత్రి మోహన్ లాల్ సక్సేనా ఆదేశించినప్పుడు నెహ్రూ మాట్లా డుతూ "మనందరం శరణార్థి మనస్తత్వానికి, ఇంకా చెప్పాలంటే ఆర్ఎస్ఎస్ మనస్తత్వానికి బందీలమైపోయాము'' అని ఆగ్రహంతో వ్యాఖ్యానించారు.

**మతఘర్షణల్లో పటేల్ పక్షపాత ధోరణి**

కలకత్తా (ఆగస్టు 1946), నోవాకలీ (అక్టోబర్ 1946), బీహార్ (అక్టోబర్ 1946) లలో జరిగిన మతఘర్షణల్లో పటేల్ వ్యవహ రించిన తీరు ఘోరంగా ఉంది. 1946 ఆగస్టు 21న పటేల్ రాజాజీకి ఉత్తరం రాస్తూ "మొత్తం శాంతి భద్రతలు కుప్పకూలిపోయాయి. కానీ పరిస్థితి చక్కదిద్ద గలిగే వారెవరూ లేరు. అయితే ఈ ఘర్షణల్లో ఎక్కువ మంది ముస్లింలు చని పోయినందున ఇది ముస్లిం లీగ్‌కు ఒక గుణపాఠం అవుతుంది''. (సర్దార్ పటేల్ లేఖలు: పేజీ 49). మానవ మారణకాండ పట్ల ఎంతటి నాగరిక మైన, ఓదార్పుతో కూడిన ప్రతిస్పంధన ఇది?! బీహార్ మత ఘర్షణలతో నెహ్రూ చలించిపోయాడు, కానీ పటేల్‌కు చీమ కుట్టినట్లు కూడా లేదు. ప్రొఫెసర్ బి.బి. మిశ్రా ఇలా రాశారు: "బీహార్ మత ఘర్షణలు జాతీయవాద ముస్లింలలో కూడా కాగ్రెస్ తమ ప్రాణాలకూ, ఆస్తులకూ రక్షణ కల్పిస్తుందన్న ఆత్మస్థైర్యం లేకుండా చేశాయి. దానివల్ల జిన్నాకు చాలా లాభం చేకూరింది." (భారతీయ రాజకీయ పార్టీలు, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, 1976, పేజీ 603)

**శరణార్థులు సమస్య**

దేశ విభజన తరువాత ఈ భావోద్వేగాలు మరింత పెరిగాయి. ఈ సందర్భంగా పటేల్ ఢిల్లీ నుండి ముస్లింలను పంపించేయాలని కోరుకున్నారన్న విషయం, భయంతో పాకిస్థాన్ పారిపోయిన ముస్లింలు తిరిగి స్వగృహాలకు రావడాన్ని అడ్డుకున్నారన్న విషయం నేడు చాలా తక్కువగా తెలుసు. ఆ రోజుల్లో పాకిస్థాన్, భారత్ ల మధ్య ప్రయాణాలపై నిషేధం లేదు. మంత్రివర్గ అత్యవసర కమిటీ సమావేశంలో పటేల్ ఈ విధంగా అన్నారు: "ఈ ముస్లింలు ఇక్కడి నుండి వెళ్లకపోతే మనం ఇబ్బందుల్లో పడతాం. ఎందుకంటే అప్పుడు పశ్చిమం నుండి

**❝ పటేల్ కాంగ్రెస్ పార్టీలోని తన సహచరు లైన రఫి అహ్మద్ కిద్వాయ్ వంటివారిపైనా, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీపైనా నిఘా వేసేందుకు గూఢచారి సమాచారాన్ని బాగా ఉపయోగించుకునేవారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీమీద గూఢచారి శాఖ ఇచ్చిన 'రహస్య నివేదిక కాపీ'ని 1948 ఫిబ్రవరి 6న నెహ్రూకు పటేల్ పంపారు. తనను మంత్రివర్గం నుండి తొలగించడానికి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కుట్రపన్నినట్లు సృష్టించిన నివేదిక అది. ❞**

వస్తున్న ముస్లిమేతర శరణార్థులకు ఆశ్రయం కల్పించడం కష్టమవుతుంది."(వజీరా ఫజిలా – యాకూబ్అలి జమీందార్ రాసిన "సుదీర్ఘ విభజన" గ్రంథం. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, కరాచీ,2008, పేజీ 39. పురాతన పత్ర భాండాగారాల ఆధారంగా రాసిన గ్రంథం). ప్రతిదాన్నీ పటేల్ "ప్రజాభిప్రాయం" పేరుతో చెప్పేవారు. 1947 సెప్టెంబర్ 2న ఆయన ఇలా అన్నారు: "ఢిల్లీ వీధుల్లోనూ, ఇతర పట్టణాల్లోనూ ముస్లింలను శాంతియుతంగా ఎందుకు తిరగనిస్తున్నారని ప్రజలు బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు" అంటూ మరోమాట కూడా అన్నారు: "పోలీసుల్లోనూ, పౌర పరిపాలనా రంగంలోనూ ముస్లింలకు స్థానం ఎందుకివ్వాలని" కూడా ప్రజలు ప్రశ్నిస్తున్నారు అని అన్నారు. (సర్దార్ పటేల్ లేఖలు, వాల్యూమ్ 4, పేజీ 318). అంటే ముస్లింలకు కనీస మానవ హక్కులు కూడా ఉండకుండా చేయాలని పటేల్ అనుకున్నారన్న మాట.

1948 మార్చి 4న మంత్రివర్గ నిర్ణయాలపై పటేల్‌కు నెహ్రూ ఒక లేఖ రాస్తూ, "ఢిల్లీలో ప్రస్తుతం ముస్లింలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతాలను ముస్లిం శరణార్థుల కోసం రిజర్వు చేయాలని రెండు మూడు నెలల క్రితం మనం నిర్ణయానికి వచ్చిన విషయం మీకు గుర్తుండే ఉంటుంది" అని చెప్పారు. (పై పుస్తకం



పటేల్, అబ్దుల్ కలామ్ అజాద్

పేజీ 261). దానికి సమాధానంగానా అన్నట్లు 1948 మే 4న పటేల్ నెహ్రూకు ఇలా లేఖ రాశారు: "పాకిస్థాన్ నుండి ముస్లిం శరణార్థుల రాకను అడ్డుకోలేకపోతున్నామని ప్రజలు, మరీ ముఖ్యంగా శరణార్థులు మనపై గుర్రుగా ఉన్నారు" అని పేర్కొన్నారు. (అదే పుస్తకం పేజీ 319). 1948 డిసెంబర్‌లో పటేల్, "శరణార్థులకు పునరావాసం కల్పించడం కోసం తూర్పు పాకిస్థాన్‌లో కొంతభాగం లాక్కుని భారత్ స్వాధీనం చేయాలి" అని నెహ్రూను డిమాండ్ చేశారు.(చోప్రా ఎడిట్ చేసిన 'సర్దార్ పటేల్: ముస్లింలు, శరణార్థులు' పేజీ 271). 1950 అక్టోబర్ 27న నెహ్రూ సహనం నశించి పటేల్‌కు ఇలా సమాధానమిచ్చారు: "శరణార్థుల రాక ఇలాగే కొనసాగితే పశ్చిమ బెంగాల్ నుండి అంతే సంఖ్యలో ముస్లింలను పంపడం మినహా మాకు మరోమార్గం లేదని పాకిస్థాన్ ప్రభుత్వానికి చెప్పమని మీరు సలహా ఇస్తున్నారు, అంతేనా!

"శరణార్థుల రాక మనకు పెద్ద సమస్యగా ఉండదన్న విషయం నూటికి నూరుపాళ్లూ నిజం. అయితే మీరు కోరిన మందును నేను ప్రతిపాదించను. శరణార్థులు రావడానికి ప్రధాన కారణం పాకిస్థాన్‌లో దిగజారిపోతున్న ఆర్థిక పరిస్థితులు. పాకిస్థాన్ ప్రభుత్వం ఈ పరిస్థితులు మెరుగుపరిచే స్థితిలో లేదు. అయితే దీనికి విరుగుడుగా పశ్చిమ బెంగాల్‌నుండి ముస్లింలను తూర్పు బెంగాల్‌కు పంపించేయాలన్న మందు వికటించి మనకు పెద్ద విపత్తు తెస్తుంది. ఇలాంటి ఆలోచనే మనకు తీవ్ర నష్టం తెస్తుంది." (సర్దార్ పటేల్ లేఖలు. పేజీ 670–71)

పటేల్ కాంగ్రెస్ పార్టీలోని తన సహచరులైన రఫి అహ్మద్ కిద్వాయ్ వంటివారిపైనా, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీపైనా నిఘా వేసేందుకు గూఢచారి సమాచారాన్ని బాగా ఉపయోగించుకునేవారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీమీద గూఢచారి శాఖ ఇచ్చిన 'రహస్య నివేదిక కాపీ'ని 1948 ఫిబ్రవరి 6న నెహ్రూకు పటేల్ పంపారు. తనను మంత్రి వర్గం నుండి తొలగించడానికి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ కుట్రపన్నినట్లు సృష్టించిన నివేదిక అది. "కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఈ పరిస్థితి (గాంధీ హత్య)ని ఉపయోగించుకుని కాంగ్రెస్ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ అధికారం చేపట్టడానికి కుట్ర చేసింది" అని అందులో పేర్కొన్నారు. (సర్దార్ పటేల్ లేఖలు, వాల్యూమ్ 6, పేజీలు 33–34). పటేల్ నిర్లక్ష్యం వల్లనే గాంధీ ప్రాణాలు పోగొట్టుకోవలసి వచ్చిందని జయప్రకాష్ నారాయణ్ చేసిన విమర్శలను చల్లార్చడానికే పటేల్ ఇటువంటి తప్పుడు నివేదికలు సృష్టించారన్నది స్పష్టం. "ప్రభుత్వంలో కూడా కమ్యూనిస్టు సెల్స్ ఉన్నాయి" అని భారతీయ మెకార్థీ అయిన పటేల్, నెహ్రూను హెచ్చరించారు. (అదే పుస్తకం పేజీ 445). దీనిలో భాగంగానే పటేల్ ఆలిండియా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి)కి వ్యతిరేకంగా, ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే ఒక కార్మిక సంస్థ– ఐఎన్‌టియుసి–ని స్థాపించారు. ఇది ఎఐటియుసిని నాశనం చేయలేకపోయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికార విభాగంగా మాత్రం పనిచేస్తోంది. (సర్దార్ పటేల్ లేఖలు,వాల్యూమ్ 2)

**'మార్క్సిస్టు' పై**

**మీ అభిప్రాయాలు తెలపండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తు న్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించా ల్సిన అంశాలున్నా, అదనపు సమాచార మున్నా క్లుప్తంగా రాసి పంపండి మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

### పటేల్ – కాశ్మీర్

కాశ్మీర్, హైదరాబాద్ సంస్థానాల విషయంలో పటేల్ అనుసరించిన వైఖరులు ఆయన పచ్చి మతతత్వానికి నిదర్శనాలు. కాశ్మీర్ విషయంలో పటేల్ ఆర్ఎస్ఎస్ అధినేత ఎం.ఎస్. గోల్వాల్కర్‌ను ఒక సాధనంగా వాడుకున్నారు. అప్పటికే ముస్లింలను ఊచకోత కోయడానికి గోల్వాల్కర్ వేసిన పథకానికి సంబంధించిన పత్రాలు ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ దయాళ్‌కు పట్టుబడ్డాయి. అయితే గోల్వాల్కర్‌ను అరెస్టు చేయకుండా పంత్ అడ్డుపడ్డారు. అటువంటి గోల్వాల్కర్‌ను కాశ్మీర్ రాజువద్దకు రాయబారిగా పంపారు పటేల్. దీనికి సంబంధించి న్యూఢిల్లీలోని అమెరికా రాయబారి వాల్టర్ ఆండెర్సన్ రాసిన "కాషాయంలో సహోదరత్వం" (విస్తార్, 1987) పుస్తకంలో చాలా చక్కగా వివరించారు. ఆర్ఎస్ఎస్ వాళ్ల స్వంత పత్రాల ఆధారంగా ఆయన ఈ పుస్తకం రాశారు. అందులో ఇలా రాశాడు: "కాశ్మీర్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసే విషయమై సంస్థానానికి చెందిన హిందూ మహారాజును ఒప్పించేందుకు హోమ్ మంత్రి వల్లభ్ భాయ్ పటేల్, గోల్వాల్కర్ సహాయాన్ని అభ్యర్థించారు. గోల్వాల్కర్ 1947 అక్టోబర్‌లో మహారాజును కలిసి ఆయన సైన్యంలోకి పంజాబీ హిందువులనూ, సిక్కులనూ చేర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు." (పేజీ 49)

పటేల్ దృష్టిలో "కాశ్మీర్ అనేది ముస్లిం ప్రాంతంలో ఉన్న హిందూ సంస్థానం." మెజారిటీ ముస్లింలున్న ఈ సంస్థానాన్ని ఆవిధంగా ఆయన ఎలా నిర్వచిస్తారో ఎవరికీ అర్థం కాదు.(సర్దార్ పటేల్ లేఖలు, వాల్యూమ్ 1, పేజీ 4). నెహ్రూ మాత్రం "ఆయనను హిందువుగా, అయితే కాశ్మీరీ హిందువుగా పరిగణించేవారు." (అదే పుస్తకం, పేజీ 3). ఉప ప్రధాన మంత్రిగా, హోమ్ మంత్రిగా పటేల్ కాశ్మీర్ మహరాజును సమర్థించేవారు. మహరాజుకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజా నాయకుడైన షేక్ అబ్దుల్లానూ, ప్రజా ట్రిబ్యునళ్లనూ వ్యతిరేకించేవారు. భారత యూనియన్‌లో కలిసిపోడానికి కాశ్మీర్ మహ రాజును ఒప్పించేందుకు ప్రయత్నించేవారు. చివరికి 1948 జనవరి 31వ తేదీన కాశ్మీర్ రాజు తను స్వతంత్ర దేశంగా విడిపోతానని బెదిరించినప్పటికీ పటేల్ ఆయన పట్ల సానుకూలంగానే ఉండేవారు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల పట్ల నెహ్రూ ఫిర్యాదు చేస్తే పటేల్ దాన్ని సమర్థించేవారు. పటేల్‌కు నలుగురిమీద గురిఉండేది. వారు...కాశ్మీర్ రాజు హరిసింగ్, ఆయన

"ఉప ప్రధాన మంత్రిగా, హోమ్ మంత్రిగా పటేల్ కాశ్మీర్ మహరాజును సమర్థించేవారు. మహారాజుకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజా నాయకుడైన షేక్ అబ్దుల్లానూ, ప్రజా ట్రిబ్యునళ్లనూ వ్యతిరేకించేవారు. భారత యూనియన్‌లో కలిసిపోడానికి కాశ్మీర్ మహారాజును ఒప్పించేందుకు ప్రయత్నించేవారు. చివరికి 1948 జనవరి 31వ తేదీన కాశ్మీర్ రాజు తను స్వతంత్ర దేశంగా విడిపోతానని బెదిరించినప్పటికీ పటేల్ ఆయన పట్ల సానుకూలంగానే ఉండేవారు."



మహాత్మాగాంధీ హత్య విచారణ సందర్భంగా కోర్టులో (ఎడమనుండి కుడికి వరుసగా) నాథూరామ్ వినాయక్ గాడ్సే, నారాయణ దత్తాత్రేయ ఆప్టే, విష్ణు రామకృష్ణ కర్కరే.

దీవాన్, మతతత్వవాది అయిన మెహెర్‌చంద్ మహజన్, ఇన్‌ఫర్మేషన్ బ్యూరో అధినేత బి.ఎన్. ముల్లిక్. ముల్లిక్‌ను పటేల్ ఎంతగా చేరదీశారంటే తన రిపోర్టులను ఆయనచేత రాయించేవారు. ('లంచాలు, గూఢ చారులు' వ్యాసం, ఫ్రంట్‌లైన్, నవంబర్ 29, 2003).

1952లో కలకత్తాలో జరిగిన ఒక ప్రదర్శనలో నెహ్రూ ప్రసంగిస్తూ, "ఈనాడు జనసంఘ్, లేక ఇంకేదైనా మతతత్వ పార్టీ అధికారంలో ఉండి ఉంటే కాశ్మీర్ విషయంలో ఏం జరిగేదో చూడండి. జనసంఘ్, ఆర్ఎస్ఎస్ లు నిరంతరం దాడులు చేస్తూ ఉంటే వాళ్లు (కాశ్మీరీ ప్రజలు) మనతో ఎందుకు ఉండేవారు, ఇంకెక్కడికైనా వెళ్లిపోయేవారు."(జవహర్‌లాల్ నెహ్రూ 'ఎంపిక చేసిన రచనలు' వాల్యూమ్ 17, పేజీలు 77–78)

నెహ్రూ కాకుండా నాడు వల్లభభాయ్ పటేల్ ప్రధాన మంత్రి అయ్యుంటే వాళ్లు ఖచ్చితంగా భారత్‌తో ఉండకుండా వెళ్లిపోయేవారు. షేక్ అబ్దులాను భారత్‌కు చేరువ చేసింది గాంధీ, నెహ్రూల లౌకిక తత్వమే గాని, పటేల్ హిందూ అనుకూల దృక్పథం కాదు.

కాశ్మీర్‌లో మాదిరిగానే హైదరాబాద్‌లో జరిగింది. పండిట్ సుందర్‌లాల్ ఆయన సహచరులు సమర్పించిన నివేదికలో హైదరా బాద్ సంస్థానంలో ముస్లింలపై మారణకాండ సాగిందని రాశారు. నివేదిక పట్ల ఆయన పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దాన్ని పట్టించుకోలేదు. ఆయన హైదరాబాద్‌లో భారత ఏజెంట్ జనరల్‌గా కె.ఎం. మున్షీనీ నియమించారు. పోలీసు చర్య పేరుతో తెలంగాణాలో ప్రజలపై యుద్ధం చేశారు.

ఈ మొత్తం రికార్డులను బట్టి సర్దార్ వల్లభభాయ్ పటేల్ పచ్చి మతతత్వవాది అని తేలడం లేదా? ముస్లింలంటే ఆయనలో ఉండే ప్రతికూలత రానురాను పచ్చి వ్యతిరేకతగా మారింది. ఈ వ్యతిరేకత ఆయనను ముస్లిం వ్యతిరేక నాయకునిగా మార్చేసింది. ముస్లింల రక్తం తాగడానికి సిద్ధపడ్డ ఆర్ఎస్ఎస్, మహాసభలకు ఆయనను సన్నిహితుని చేసింది. ఇదంతా విస్మరించి నేడు పటేల్‌ను ఉక్కు మనిషి అని పొగడడం, అదే సమయంలో నెహ్రూను తెగనాడడం జరుగుతోంది. నెహ్రూ ఈ ప్రమాదాన్ని చాలా ముందుగానే కనిపెట్టారు. "కొంత మంది కాంగ్రెస్ హిందువులు ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్నారు. ఇందులో మానసికమైన అంశాలే ముఖ్యమైనవి" అని 1945 జులై 14న నెహ్రూ వావెల్‌కు చెప్పారు. ఇది పటేల్‌కు బాగా వర్తిస్తుంది. అందుకే పటేల్‌లోని మతతత్వ వాది దాచేద్దామన్నా దాగడు

నిర్మాణం

# అవినీతి, పెట్టుబడిదారీ సమాజం- కమ్యూనిస్టు పార్టీ

**నిప్పు నిప్పుగా ఉన్నంత వరకూ దాని మీద చెత్తపడితే తగలబడిపోతుంది. నిప్పు చల్లారితే దానిమీద చెత్తపోగుపడుతుంది. కమ్యూనిస్టు శ్రేణులెప్పుడూ తమ సహజలక్షణమైన నిప్పుకణికల్లాగే ఉండాలి. ఆర్థిక, సామాజిక సమస్యలపై వర్గపోరాటాన్ని ఉధృతం చేయాలి. అప్పుడే కమ్యూనిస్టు పార్టీ తన ప్రత్యేకతను నిలుపుకోగల్గుతుంది.**

**ఎస్. వీరయ్య**

"హైదరాబాదు రింగు రోడ్డు సమస్యను మీ పార్టీ గట్టిగానే లేవనెత్తింది. మీ నాయకులు బాగానే సంపాదించుకుంటున్నట్టున్నారే"? అన్నారొకాయన. అన్యాయాన్ని వ్యతిరేకించినందుకు అభినందించవలసింది పోయి నిందలు వేస్తున్నారేమిటని అడిగాను. "రాజకీయ నాయకులు చేసే పని అదేకదా" అన్నాడాయన. బ్లాక్‌మెయిల్ చేసే బూర్జువా పార్టీలకూ, న్యాయం కోసం పోరాడే కమ్యూనిస్టు పార్టీకీ మధ్య ఆయన తేడా చూడటంలేదు. అన్ని పార్టీలనూ ఒకేగాటన కడుతున్నాడని అర్థమయ్యింది. నిజమే, అత్యధిక ప్రజానీకం ఈ తేడా గమనించడంలేదు. పైగా అవినీతిలేనిదెక్కడ? అనుకునే స్థితి వచ్చింది.

రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీకి విశిష్టత ఉన్నది. భూస్వామ్య, పెట్టుబడిదారీ దోపిడీ అంతం కోసం పోరాడేదే కమ్యూనిస్టు పార్టీ. పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణమైన అవినీతికి సహజంగానే కమ్యూనిస్టులు వ్యతిరేకం. దేశంలో కమ్యూనిస్టేతర ప్రభుత్వాలన్నీ అవినీతికి ఆలవాలమైనాయి. బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో ఏర్పడిన వామపక్ష ప్రభుత్వాలు మాత్రం భిన్నమైన పాలనను చూపించగలిగాయి. మూడున్నర దశాబ్దాల బెంగాల్ వామపక్ష పాలనలో మంత్రుల మీద అవినీతి మచ్చలేదు. వరుసగా నాలుగవసారి ఎన్నికైన త్రిపుర వామపక్ష ప్రభుత్వం, దాని ముఖ్యమంత్రి ప్రత్యేకత గురించి గత నెల రోజులుగా మీడియాలో చూస్తూనే ఉన్నాం. పార్లమెంటుకు సైకిల్‌పై వెళ్ళిన పుచ్చలపల్లి సుందరయ్య, ప్రజల హృదయాల్లో స్థిరమైన స్థానం సంపాదించిన ఏ.కె. గోపాలన్ వంటి నాయకుల వారసత్వం పుణికిపుచ్చుకున్నది కమ్యూనిస్టు ఉద్యమం. టాటా యాజమాన్యం పంపిన ఎన్నికల విరాళం తిప్పి పంపిన చరిత్ర మార్క్సిస్టులది. బూర్జువా పార్టీలలో నాయకుల ఆస్తులు పెరుగుతున్నాయి. కమ్యూనిస్టు ఉద్యమంలో పోరాట కేంద్రాలైన పార్టీ కార్యాలయాలు పెరుగుతున్నాయి. పైరవీకారుల నిలయాలు బూర్జువా పార్టీలు. తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలను కదిలించేది కమ్యూనిస్టు పార్టీ.

సమాజంలోని అన్ని వ్యవస్థలూ అవినీతి మయం. అధికారాన్ని అడ్డంపెట్టుకొని ప్రజాసంపదను కొల్లగొడుతున్నారు. పెట్టుబడిదారులు, ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు కలిసే ఈ పని చేస్తున్నారు. అధికారపక్షం, ప్రతిపక్షం అనే తేడా లేదు. బూర్జువా పార్టీలన్నీ ఇందులో భాగమే. 2జి స్పెక్ట్రం, బొగ్గు కుంభకోణం మొదలు ఈ మధ్యకాలంలో బయటపడుతున్న కుంభకోణాలన్నింటిలోనూ కాంగ్రెస్, బిజెపిలే ప్రధాన భాగస్వాములు. టాటా, బిర్లా, అంబానీ వంటి పెద్ద పెట్టుబడిదారులే లంచాలు పెట్టారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సహజ లక్షణం అవినీతి. పెట్టుబడిదారులెప్పుడూ తమ కార్మికులకు చెప్పే నీతి సూత్రాలకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తారు. వారికి లాభమే పరమావధి. లాభం తెచ్చేదేదైనా వారి దృష్టిలో సరైందే. కార్మికులకు సంబంధించినంత వరకు స్టాండింగ్ ఆర్డర్స్ (క్రమశిక్షణా నియమావళి)లో లంచం ఇవ్వడం, తీసుకోవటం, వ్యభిచారం, మోసం వంటివన్నీ నేరాలుగా నిర్వచిస్తారు. ప్రభుత్వం దగ్గర లైసెన్సుల కోసం, తమ ప్రయోజనాలకనుగుణమైన చట్టాల కోసం పెట్టుబడిదారులు నిత్యం లంచాలు పెడుతూనే ఉంటారు. కార్మిక చట్టాలు అమలు చేయకుండా ఉండడం కోసం అధికారులకు లంచాలిస్తారు. తోటి పెట్టుబడిదారులను, తన దగ్గర పని చేస్తున్న కార్మికులను మోసం చేస్తూ ఉంటారు. ప్రభుత్వం నుండి మేలు పొందడానికి వ్యభిచారం కూడా ప్రోత్సహిస్తారు. ప్రజాస్వామ్యం బాగా అభివృద్ధి చెందిందని, అవినీతిని నిరోధించటం సులభమనే అభిప్రాయం కూడా కొందరిలో ఉన్నది. కానీ ప్రజాస్వామ్యంతోపాటే అవినీతి మోతాదు కూడా పెరుగుతున్నది. ఇక్కడ లెనిన్ చెప్పిన మాటలు గుర్తు చేసుకోవచ్చు: "ప్రజాస్వామ్యం ఎంతగా అభివృద్ధి చెందితే అంతగా బూర్జువా పార్లమెంటులు స్టాక్ మార్కెట్‌తోనూ, అత్యాశాపరులతోనూ సంబంధం కలిగి ఉంటాయి"(లెనిన్-ది ప్రొలెటేరియన్ రివల్యూషన్ అండ్ రినగేడ్ కాట్స్‌కి). ఈ మధ్య అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున స్పందించారు. అయినప్పటికీ లోక్‌పాల్ పరిధిలోకి పెట్టుబడిదారులను తేవడానికి పాలకులు అంగీకరించలేదు. రాజకీయ నాయకులకు, ఉన్నతాధికారులకు లంచాలు



**రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ సభ్యులు, సిఐటియు నాయకులు.**

పెడుతున్నదీ, అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నదీ పెట్టుబడిదారులేకదా! అయినా వీరిని చట్టం పరిధిలోకి తేవాలన్న సిపిఐ(ఎం) ప్రతిపాదనను వ్యతిరేకించడంలో బూర్జువా పార్టీలన్నీ ఒక్కటై నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధితోపాటు లంచానికి "లాబీయింగ్" అనే ముద్దుపేరు కూడా పుట్టింది. "లాబీయింగ్"పేరుతో అమెరికాలో పెట్టుబడిదారులెంత ఖర్చుపెట్టినా అది చట్టబద్ధమే. సెనేట్(అమెరికన్ పార్లమెంట్)కు వివరాలిస్తే చాలు. లంచంలో ఇచ్చేవారూ పుచ్చు కునేవారూ ఉంటారనీ, ఇచ్చేవారెపుడూ ధనిక దేశాల నుండే ఉంటారని ప్రపంచబ్యాంకు అధ్యక్షుడు వోల్ఫ్‌విట్జ్ అన్నారు. ప్రపంచ బ్యాంకు విధానాల ప్రవేశంతో ఇది పరాకాష్టకు చేరింది. అవినీతిని ప్రశ్నించినందుకే తనను తొలగిం చారని ప్రపంచబ్యాంకు మాజీ అధికారిణి కరెన్ హ్యూడ్స్ చెప్పారు.

కమ్యూనిస్టు పార్టీలు విలువలకు పెట్టిం దిపేరు. కార్మికవర్గ ప్రయోజనాల కోసమే కట్టుబడి పని చేస్తాయి. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, కుల, మత, ప్రాంతీయ తత్వాలకు దూరంగా ఉంటాయి. కమ్యూనిస్టులు విలువలకు కట్టుబడటం, కార్మికవర్గ ప్రయోజనం కోసం పని చేయటం పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రమాదమే. అందుకే పెట్టుబడిదారులు కమ్యూనిస్టులను కూడా వదలరు. ఏ చిన్న అవకాశం దొరికినా చెడగొడ తారు. ప్రపంచ బ్యాంకు నేర్పుతున్నదీ అదే. అధికార పక్షం మాత్రమే అందినంత దండు కుంటే ప్రతిపక్షాలు నిలదీయవచ్చు. వామ పక్షాలను పవిత్రంగా ఉండనిస్తే, వారే ప్రత్యామ్నాయంగా ప్రజలకు కనిపించవచ్చు. బలాబలాల నిష్పత్తిని బట్టి అధికార, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా ఎవరి వాటా వారికి ఇవ్వాలని ప్రపంచ బ్యాంకు నేర్పిన పాఠం. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు చేస్తున్నదీ అదే. కమ్యూనిస్టు పార్టీలో కూడా బలహీనుల కోసం వెతుకుతూనే ఉంటారు. ఎర వేస్తూనే ఉంటారు. అందుకే కమ్యూనిస్టులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి.

కమ్యూనిస్టు పార్టీలో పార్లమెంటరీ ధోర ణులు పెరుగుతున్నాయి. ఇందుకు అనేక కారణాలున్నాయి. పార్లమెంటరీ ఎన్నికల ద్వారా సమాజాన్ని మార్చవచ్చుననే భ్రమలు ఒక కారణం. సమాజంలో ప్రత్యేక గుర్తింపు కోసం ఆరాటం కూడా పని చేయవచ్చు. సుదీర్ఘకాలం పార్లమెంటరీ వ్యవస్థ కొనసాగుతున్న మనదేశం లో, ఇందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సరళీకృత ఆర్థిక విధానాలతో ఎన్నికల వ్యవస్థ

**"కమ్యూనిస్టు పార్టీలు విలువలకు పెట్టిందిపేరు. కార్మికవర్గ ప్రయోజనాల కోసమే కట్టుబడి పని చేస్తాయి. అవినీతి, ఆశ్రిత పక్షపాతం, కుల, మత, ప్రాంతీయ తత్వాలకు దూరంగా ఉంటాయి. కమ్యూనిస్టులు విలువలకు కట్టుబడటం, కార్మికవర్గ ప్రయోజనం కోసం పని చేయటం పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రమాదమే. అందుకే పెట్టుబడిదారులు కమ్యూనిస్టులను కూడా వదలరు. ఏ చిన్న అవకాశం దొరికినా చెడగొడతారు."**

సంపాదనా మార్గంగా కూడా తయారయింది. ప్రతిదీ సరుకుగా మారటమే పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణం. ఓటు, టిక్కెట్టు, మంత్రిపదవి, ఎన్నికల పొత్తు, పార్లమెంటు లేదా శాసనసభలో ప్రశ్నలు అన్నీ సరుకుగా మారాయి. ఓటుకు నోటు, స్వంత పార్టీలో టిక్కెట్టుకు, ప్రభుత్వంలో పదవులకు ముడుపులు బూర్జువా పార్టీలకు సర్వసాధారణమైనాయి. పొత్తుల సందర్భంగా కూడా పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారుతు న్నట్లు వార్తలు వస్తున్నాయి. పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా లంచం ఇచ్చి చట్టసభల్లో ప్రశ్నలు వేయించుకోవడం కూడా చూశాం. ఎన్నికల సందర్భంగా డబ్బు వరదలా ప్రవహిస్తున్నది. తాను ఎంపీగా గెలవడానికి అనేక కోట్లు ఖర్చు చేశానని ఒక బిజెపి ఎంపి ముంబయిలో బహిరంగంగానే ప్రకటించారు. అధికారం ఉంటే ఎంతైనా సంపాదించవచ్చుననే ధోరణి పెరిగింది. ప్రజాప్రతినిధులుగానూ పెద్ద మొత్తంలోనే సంపాదిస్తున్నారు. కనీసం పార్టీలో నాయకత్వ స్థానంలో ఉన్నా ఎంతో కొంత సంపాదించవచ్చుననే దుస్థితి ఏర్పడింది. వీటన్నింటి ప్రభావం కమ్యూనిస్టు శ్రేణుల మీద పడకుండా చూసుకోవడం అవసరం.

బూర్జువా పార్టీలతో సుదీర్ఘకాలం ఎన్నికల పొత్తు ప్రభావం కూడా ఉన్నది. ప్రధాన శత్రు వును ఓడించడంతోపాటు బూర్జువా పార్టీల వెనుకనున్న పేద ప్రజలను కమ్యూనిస్టు పార్టీవైపు ఆకర్షించాలి. ఇందుకే ఆ పొత్తు ఉపయోగ పడాలి. దీనికి భిన్నంగా అనేక సందర్భాల్లో కమ్యూనిస్టు శ్రేణుల మీద బూర్జువా పార్టీల అవలక్షణాల ప్రభావం పడుతున్నది. ప్రజాప్రతినిధిగా పోటీ చేసే అవకాశం కోసం తనను తాను ప్రతిపాదించుకోవటం, పట్టుబట్ట టం, ఇతరులతో అడిగించటం, అలగటం, బెదిరించటం వంటి కొన్ని ఘటనలు ఇందులో భాగమే. ప్రజలకు సేవ చేసేందుకు ప్రజాప్రతి నిధిగా ఒక్క అవకాశం ఇవ్వమం టారు. (ప్రజాసేవకు మరో మార్గమే లేనట్టు!) ఇందుకోసం తన చరిత్రనంతా ఏకరువు పెడుతుంటారు. త్యాగాలు చేసినట్టు

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రచురణ

**భాషా ప్రయుక్త సమైక్య రాష్ట్రాలు**

**సిపియం వైఖరి వివరించే పత్రాలు**

వెల : రు 3/-   పేజీలు : 32

ప్రతులకు :

**ప్రజాశక్తి బుక్‌హౌస్**
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20
ఫోన్: 27608107, 9490098009, 9490099057,

బ్రాంచీలు :
హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం,

**" నాయకులకు స్వాగతం తెలపటం, పండుగల సందర్భంగా అభినందనల పేరుతో పెద్దఎత్తున ఫ్లెక్సీ బోర్డులు పెట్టే సంస్కృతి పెరిగింది. బూర్జువా పార్టీల నుండి కొన్ని చోట్ల కమ్యూనిస్టు కార్యకర్తల్లో కూడా ఈ ధోరణి ప్రవేశిస్తున్నది. ఎదుటి పార్టీ వారు పెద్దఎత్తున బోర్డులు పెడుతున్నపుడు మనం కొన్నైనా పెట్టకపోతే ఎలా అనే వాదనలు విన్పిస్తున్నాయి. "**

చెప్పుకుంటారు. ఇంతకాలం పార్టీ కోసం పని చేస్తే తనకిచ్చే గుర్తింపు ఇదేనా అని ప్రశ్నిస్తారు. గతంలో ప్రజాప్రతినిధిగా పని చేసిన అనుభవాన్ని కూడా ఒక అర్హతగా పేర్కొంటారు. అది పార్టీ ఇచ్చిన అవకాశంగా కాకుండా, అది కూడా తన గొప్పతనంగానే చెప్పుకుంటారు. పార్టీ అభివృద్ధి కోసమే తన అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తున్నట్టు సమర్థించుకుంటారు. మరీ దిగజారితే ఏదో ఒక రూపంలో కులాన్ని కూడా ప్రయోగిస్తారు. ఇవన్నీ బూర్జువా పద్ధతులే. ముఠాలు కట్టటం, పత్రికలకు లీకు చేయటం, నాయకత్వంపై తిరుగుబాటును ప్రోత్సహించటం, ఈ ధోరణులకు పరాకాష్ట.

ప్రజాప్రతినిధులే ఓటు వేయవలసిన ఎన్నికల్లో, వీరిని కొనుగోలు చేయటం కోసం బూర్జువా పార్టీలు పెద్దఎత్తున ఖర్చుపెడుతున్నాయి. తమ పార్టీ ప్రజాప్రతినిధులను ఇలాంటి కొనుగోళ్ళ నుండి, కిడ్నాపుల నుండి కాపాడుకునేందుకు క్యాంపులు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. కమ్యూనిస్టు పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు నిజాయితీకీ, నిబద్ధతకూ ఇలాంటి సందర్భాలు పరీక్షగా నిలుస్తున్నాయి.

కాంట్రాక్టర్ల, పెట్టుబడిదారుల మోసాలపై ప్రకటనలు, అధికారులకు ఫిర్యాదులు చేసి, తెరవెనుక బేరసారాలకు వాడుకోవటం బూర్జువా పార్టీ నాయకుల పద్ధతి. ప్రజల సంసిద్ధతను బట్టి, సమస్య అటోఇటో తేలేవరకూ పోరాడటం కమ్యూనిస్టుల పద్ధతి. కమ్యూనిస్టులను సైతం లోబర్చుకునేందుకు వారు ప్రయత్నిస్తూనే ఉంటారు. ప్రజల అప్రమత్తత, కమ్యూనిస్టు కార్యకర్తల నిబద్ధతే పార్టీని కాపాడుతుంది. నిరంతరం సమస్యలపై స్పందించడం ద్వారా పార్టీ ప్రతిష్ట పెరుగుతుంది. కార్యకర్తలకు గుర్తింపు పెరుగుతుంది. కానీ ప్రజాపునాది పెరగదు. ఆ సమస్యలపై నిరంతరం ప్రజలతో మమేకమై పని చేసినపుడే పునాది బలపడుతుంది. అనేక సందర్భాలలో ప్రతిష్టతోనే సంతృప్తిపడటం, కొనసాగింపు కృషిని అశ్రద్ధ చేయటం చూస్తున్నాం. ఎవరైనా బలహీనతను ప్రదర్శించినా, అనుమానాలకు అవకాశం ఇచ్చినా కొత్తపునాది రాకపోగా ఉన్న పునాది బలహీనపడవచ్చు. అవినీతికి అలవాటుపడిన వారు కమ్యూనిస్టుగా నిలవలేరు. కార్మికవర్గ ప్రయోజనం కోసం నికరంగా పోరాడలేరు. కార్మికవర్గ ప్రయోజనాలను బూర్జువా వర్గానికి తాకట్టుపెడతారు. పార్టీకీ, ప్రజలకూ ద్రోహం చేస్తారు.


ఎన్నికల ఖర్చు పెద్ద సమస్యగా మారింది. బూర్జువా పార్టీలు పెడుతున్నంత కాకపోయినా, కొంతైనా ఖర్చు చేయాలి కదా అన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఖర్చుచేయటం అంటే ఏమిటి? ప్రజల విశ్వాసం పొందడానికి ప్రత్యామ్నాయంగా డబ్బును దగ్గరి మార్గంగా ఎంచుకోవటమే. ఇది ప్రజల పాత్రను నిర్వీర్యం చేస్తుంది. బూర్జువా ధోరణలు బలపడటానికి తోడ్పడుతుంది. డబ్బును మార్గంగా ఎంచుకున్న తరువాత ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టగలిగిన వారికే ఎక్కువ అవకాశాలుంటాయి. ఖర్చు పెట్టడమే మార్గంగా ఎంచుకున్న తరువాత ఖర్చుపెట్టగలవారినే అభ్యర్థులుగా పెట్టాలనే వాదనలూ వస్తాయి. ఖర్చు పెట్టినవారు గెలిచిన తరువాత సంపాదించుకోవాలనుకుంటారు. ఇక కమ్యూనిస్టు పార్టీకి విలువేముంటుంది. ఆర్థిక స్థోమత కలిగిన అభ్యర్థులు ఆ మేరకు వారు పార్టీకే విరాళంగా ఇవ్వవచ్చు. ఎలా ఖర్చుపెట్టాలో పార్టీ నిర్ణయిస్తుంది. ఇది కమ్యూనిస్టు స్ఫూర్తిని ప్రదర్శించటం. ఒక అభ్యర్థి గెలుపు కోసం బంధువులు, హితులు, స్నేహితులు చేసే ఖర్చులు కూడా పార్టీకే ఇచ్చి పార్టీ ద్వారా ఖర్చుపెట్టవచ్చు కదా! ఈ గెలుపు నుండి తామేమీ పార్టీయేతర పద్ధతుల్లో ప్రయోజనం ఆశించనపుడు పార్టీ పద్ధతులలోనే ఖర్చుపెట్టవచ్చుకదా! బంధువులు, లేదా మిత్రులు స్వతంత్రంగా ఖర్చుపెట్టటమంటే ఏమిటో కూడా చూడాలి. అది పార్టీ ప్రతిష్టను పెంచుతుందా? దిగజార్చుతున్నదా పరిశీలించాలి.

నాయకులకు స్వాగతం తెలపటం, పండగల సందర్భంగా అభినందనల పేరుతో పెద్ద ఎత్తున ఫ్లెక్సీ బోర్డులు పెట్టే సంస్కృతి పెరిగింది. బూర్జువా పార్టీల నుండి కొన్ని చోట్ల కమ్యూనిస్టు కార్యకర్తల్లో కూడా ఈ ధోరణి ప్రవేశిస్తున్నది. ఎదుటి పార్టీ వారు పెద్దఎత్తున బోర్డులు పెడుతున్నపుడు మనం కొన్నైనా పెట్టకపోతే ఎలా అనే వాదనలు విన్పిస్తున్నాయి. ప్రతిఫలాన్ని ఆశించకుండా ఇలాంటి బోర్డులు పెడుతున్నారని చెప్పలేం. అందుకే ఫ్లెక్సీ బోర్డులు పెట్టేవారిని వారించాలి. ఫ్లెక్సీ బోర్డులు పెట్టడం ద్వారా నాయకుల దృష్టిలోపడాలనీ, చిన్నచిన్న కాంట్రాక్టులు లేదా ప్రజాప్రతినిధిగా పోటీ చేసే అవకాశాలు లేదా ఇతర ప్రయోజనాలు పొందాలనీ ఆలోచనలుండవచ్చు. కొన్ని సందర్భాలలో కుల ధోరణి కూడా ప్రదర్శించవచ్చు. ఇలాంటి ధోరణులేమీ లేకుండా కేవలం పార్టీ కోసమే తాపత్రయంతో ఈపని చేసేవారూ ఉండవచ్చు. నిజంగా ఏ స్వప్రయోజనం ఆశించని వారు ఫ్లెక్సీ బోర్డులకు ఖర్చు పెట్టే బదులు ఆ డబ్బు పార్టీకి విరాళంగా ఇవ్వవచ్చు. ఆ కార్యక్రమం ప్రచారానికి ఆ డబ్బునెలా వినియోగించాలో పార్టీ నిర్ణయిస్తుంది. వీటిపట్ల నాయకులు చూసీచూడనట్లున్నా, ప్రోత్సహించినా, వ్యక్తి ఆరాధనకు లోనైనా పార్టీకి మరింత నష్టం.

ప్రపంచీకరణ విధానాలతో సమాజంలో వ్యాపారధోరణి పెరిగింది. వినిమయదారీ సంస్కృతి విస్తరిస్తున్నది. సంపాదించడం, అనుభవించడం, ఆనందించడమే జీవిత పరమావధిగా మారింది. ఎలా సంపాదించావనేది ముఖ్యం కాదు. ఎంత సంపాదించావన్నదే ప్రధానంగా పరిగణిస్తున్నారు. ఈ ధోరణుల ప్రభావం సమాజంలోని అన్ని రంగాలపై పడుతున్నది. రాజకీయ పార్టీల వనరులు పారదర్శకత గురించి ప్రశ్నించిన స్వచ్ఛంద సంస్థలు, మేధావులుసైతం కార్పొరేట్ విరాళాలను వ్యతిరేకించకపోవటం గమనార్హం. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో సమాజ మార్పు కోసం పని చేసే కమ్యూనిస్టు శ్రేణులు మరింత అప్రమత్తంగా ఉండాలి. నిప్పు నిప్పుగా ఉన్నంత వరకూ దాని మీద చెత్తపడితే తగలబడిపోతుంది. నిప్పు చల్లారితే దానిమీద చెత్తపోగుపడుతుంది. కమ్యూనిస్టు శ్రేణులెప్పుడూ తమ సహజలక్షణమైన నిప్పుకణికల్లాగే ఉండాలి. ఆర్థిక, సామాజిక సమస్యలపై వర్గపోరాటాన్ని ఉధృతం చేయాలి. అప్పుడే కమ్యూనిస్టు పార్టీ తన ప్రత్యేకతను నిలుపుకోగల్గుతుంది. •

నిర్మాణం

# కౌలు రైతు సమస్య: గ్రామీణ ప్రాంతాల్లో నేటి తక్షణ వర్గ సమస్య



నాగబోయిన రంగారావు

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో కౌలు రైతుల సమస్య నేడు తీవ్ర సమస్యగా ముందు కొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల కుటుంబాలు నేడు కౌలుసాగు చేస్తున్నారు. ఏటా కౌలుదార్ల సంఖ్య పెరుగుతోన్నది. వీరిలో సొంత భూమి లేని దళితులు, వెనుకబడిన తరగతులకు చెందిన వారు ఎక్కువగా వున్నారు. నీటి వనరులున్న ప్రాంతాలలోనే గాక మెట్ట ప్రాంతాలలో కూడా కౌలుదార్ల సంఖ్య పెరుగుతున్నది.

భూ యజమానులకు ఇతర ఆదాయ వనరులు పెరగటం వల్లా, తమ భూములకు కౌలు ధరలు బాగా వున్నందున వాళ్లు వ్యవసాయం చేయకుండా భూములను కౌలుకు ఇస్తున్నారు.

కౌలుదార్లు ఒకవైపు భూమి కౌలుధర చెల్లించటానికీ, మరోవైపు పంట పండించటానికీ రెండు విధాలా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. మొత్తంగా వారు అధికవడ్డీలకు ప్రయివేటు అప్పు తెచ్చి పెట్టుబడిపెట్టాల్సి వస్తోంది. ఆ విధంగా వారు 1. వడ్డీ దోపిడీకి గురవుతున్నారు. 2. వీరు రాత్రింబవళ్ళు శ్రమ చేస్తారుకాబట్టి శ్రమ దోపిడికీ గురౌతున్నారు. సబ్సిడీల కోత, డీజిల్ ధరలు నిరంతరం పెరగడం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరల పెరగడం వల్ల వీరిపై అదనపు భారం పడుతున్నది. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు కోల్పోతే నష్ట పరిహారం వీరికి అందడం లేదు. మరోవైపు పంటలు తక్కువ ధరలకు అమ్ముకొని మార్కెట్ దోపిడీకి బలయ్యేదీ వీరే. ఇన్ని విధాలుగా దోపిడీకి గురయ్యే వర్గం గ్రామాల్లో మరొకటి ఉండదు. అందుకే నేడు గ్రామీణ ప్రాంతాల్లో వర్గపోరాటానికి కౌలుదార్ల సమస్య అత్యంత కీలకమైన సమస్యగా మారింది.

కౌలుదార్లకు హక్కులు కల్పిస్తూ చట్టం వచ్చినా అది అమలు కావటం లేదు. భూ యజమానులందరూ పార్టీలను పక్కనబెట్టి ఏకమై కౌలుదార్లకు ఏ సౌకర్యమూ అందకుండా అడ్డుకొంటున్నారు. కౌలుదార్లు రుణ అర్హత కార్డులకు దరఖాస్తులు పెట్టుకుంటే భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు. అయినా వారు కార్డులకోసం దరఖాస్తులు పెట్టుకుంటే కౌలు రైతులకు భూమి ఇవ్వబోమని బెదిరిస్తున్నారు. కార్డులివ్వకుండా రెవెన్యూ, బ్యాంకు అధికార్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ విధంగా కౌలుదార్లకు రుణంగానీ, పంట నష్ట పరిహారంగానీ రాకుండా అడుగడుగునా అడ్డం పడుతున్నారు. గ్రామాలలో భూస్వాములు కౌలుదార్ల దగ్గర అధిక కౌలురేట్లు వసూలు చేయటం, అప్పులు ఇచ్చి వడ్డీలు రాబట్టడం, కొంతమంది షాపులు పెట్టి ఎరువులు, పురుగు మందులను అధిక ధరలు వసూలు చేయటం, కమీషన్ ఏజెంట్లుగా వుండి తక్కువ ధరలకు పంటలు కాజేయడం చేస్తున్నారు. వీరి దోపిడీ యథేచ్ఛగా సాగాలంటే కౌలుదార్లకు ఎలాంటి సౌకర్యాలు వుండకూడదు. అందుకే వారు కౌలురైతులకు ఎటువంటి సదుపాయాలూ అందకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు.

**కొన్ని ఉదాహరణలు**

ప్రకాశంజిల్లాలోని ఒక గ్రామంలో కాంగ్రెస్, టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్‌లకు చెందిన భూ యజమానులందరూ ఏకమై గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద కౌలు రైతులకు గుర్తింపు కార్డులకోసం అర్జీలు రాస్తున్న వి.ఆర్.ఒ.ను చెప్పులతో చితకబాదారు. అంతేగాక కాగితాలను తగులబెట్టారు. మరొక గ్రామంలో భూ యజమానులందరూ పార్టీలకు అతీతంగా ఏకమై పేదలకు తమ భూములు కౌలుకు ఇవ్వకూడదని తీర్మానం చేశారు. ఇంకొక గ్రామంలో ట్రాక్టర్లు, కార్లు, మోటార్ సైకిళ్ళతో భూ యజమానులందరూ తహశీల్దార్ కార్యాలయంపై దండెత్తి తమ భూములపై ఎవ్వరికైనా కౌలు గుర్తింపు కార్డులిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కృష్ణాజిల్లాలోని ఒక గ్రామానికి చెందిన భూ యజమానులు ఎక్కువగా విజయవాడ, ఢిల్లీ, హైదరాబాద్‌లలో నివసిస్తున్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులిస్తున్నారని



రచయిత ఆంధ్ర ప్రదేశ్ కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి

> **❝ చట్ట ప్రకారం రెవెన్యూ, వ్యవసాయ అధికారులు నేరుగా కౌలుదార్ల వద్దకు వెళ్ళి , వారిని గుర్తించి, రుణ అర్హత కార్డులు మంజూరు చేయాలి. భూ యజమానుల ప్రమే యం లేకుండా కార్డులు ఇవ్వాలి. కాని వీరు భూ యజమా నుల దగ్గర పాస్ పుస్తకాలు తేవాలనీ, వారి అనుమతి కావాలనీ కౌలు దారులకు చెబుతూ మోకా లడ్డుతున్నారు.❞**


2013 జులైలో విజయవాడలో కృష్ణాజిల్లా కౌలు రైతుల సదస్సు.

తెలియడంతోనే వారంతా ఆయా నగరాల నుండి ఒక్కసారిగా గ్రామంలోకి వచ్చేశారు. అమెరికా, ఇంగ్లాండ్‌ల నుండి ఫోన్‌కాల్స్ మోగాయి. మా భూములపై ఎవ్వరికీ కార్డులు ఇవ్వటానికి వీలులేదని తెగేసి చెప్పారు. ఇలా అనేక గ్రామాలలో అప్పటివరకు పార్టీల పేరుతో, ముఠాల పేరుతో కుమ్ములాడుకుంటున్న భూ యజమానులందరూ పేదలకు వ్యతిరేకంగా ఏకమైనారు. దాదాపు అన్నిగ్రామాలలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది.

చట్టాన్ని అమలుచేసి కౌలు రైతులకు హక్కులు కల్పించాల్సిన రెవెన్యూ, వ్యవసాయ శాఖ, బ్యాంక్ అధికారులు అనేక చోట్ల భూ యజమానుల కొమ్ముకాస్తున్నారు. చట్ట ప్రకారం రెవెన్యూ, వ్యవసాయ అధికారులు నేరుగా కౌలుదార్ల వద్దకు వెళ్ళి వారిని గుర్తించి రుణ అర్హత కార్డులు మంజూరు చేయాలి. భూ యజమానుల ప్రమేయం లేకుండా కార్డులు ఇవ్వాలి. కాని వీరు భూ యజమానుల దగ్గర పాస్ పుస్తకాలు తేవాలనీ, వారి అనుమతి కావాలనీ కౌలు దారులకు చెబుతూ మోకాలడ్డుతున్నారు. ఎక్కడన్నా కొంతమందికి కార్డులు వస్తే బ్యాంక్ అధికారులు రుణాలు ఇవ్వకుండా తిరస్కరిస్తున్నారు. భూ యజమానులు వచ్చి హామీ సంతకం చేయాలనీ, మీకు రుణం ఇస్తే తిరిగి కట్టరనీ, కొన్నిచోట్ల అయితే అసలు కౌలు రైతులకు రుణం ఇవ్వ బోమని చెబుతున్నారు. ఇన్ని జరుగుతున్నా పై అధికా రులు నిమ్మకు నీరెత్తినట్లు వున్నారు.

కాంట్రాక్టుల కోసమో, ఇతర పైరవీల కోసమో నిరంతరం అధికారులపై జులుం చేసే ప్రజా ప్రతినిధు లు కౌలు రైతుల రుణాల విషయానికి వచ్చేసరికి అసలు మాట్లాడారు. కొన్నిచోట్ల భూ యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. డి.ఆర్.సి., జిల్లా పరిషత్ తదితర సమావేశాలలో కౌలు రైతులు ఊసే ఎత్తరు.

వీటన్నింటి వల్ల కౌలు రైతులకు రుణాలు, ఇతర సదుపాయాలు దక్కటం లేదు. 40 లక్షల మందికి పైగా కౌలుదారులు వుండగా కేవలం 5 లక్షల మందికి రుణ అర్హత కార్డులు ఇచ్చారు. వీరిలో కూడా లక్షా యాభైవేల మందికి మాత్రమే రుణాలు వచ్చాయి. అదికూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కాకుండా ఒక్కొక్కరికి 10 వేలు మాత్రమే ఇవ్వటం జరిగింది.

రాష్ట్ర రుణ ప్రణాళికలో 45 వేల కోట్ల రూపాయలు పంట రుణాలకు కేటాయిస్తే అందులో 30 వేల కోట్లు పంటలు సాగు చేయని భూ యజమానులకు ఇచ్చారు. తుఫాన్‌లకూ, అధిక వర్షాలకూ, కరువులకూ కౌలు రైతులు పంటలు కోల్పోతే పరిహారం భూ యజమా నులకు ఇస్తున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీలూ, ఉత్పత్తి పరికరాలూ, యంత్రాలూ సాగుచేయని భూ యజమానులకు వెళుతున్నాయి.

రాష్ట్రంలో ఏటా కౌలు రైతుల సంఖ్య పెరుగుతున్నది. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు కోల్పోయినా, మార్కెట్ ధరలు లేక నష్టాలు వచ్చినా కౌలు సేద్యం పెరుగుతున్నది. వీరి మధ్య పోటీతత్వం పెంచి భూ యజమానులు కౌలు ధరలు పెంచుతున్నారు. రాష్ట్రంలోని కౌలు రైతుల్లో 80% పైగా దళితులు, వెనుకబడిన తరగతులకు చెందిన పేదలు వున్నారు. గ్రామాలలో పనిదినాలు తగ్గటం వలన వల సలు పోలేక, పొలం సాగుచేస్తే రైతుననే గౌరవం వుంటుందనే కారణాలతో పేదలు కౌలులోకి వస్తున్నారు.

### నిర్బంధాలలోనూ పోరాడుతున్న కౌలుదారులు

రైతుసంఘం ఆధ్వర్యంలో అనేక గ్రామా లలో కౌలు ఉద్యమాలు జరిగాయి. కార్డులు, రుణాలు, పంటనష్ట పరిహారాలు పొందారు. భూ యజమానుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలబడి కార్డులు సాధించారు. ప్రకాశంజిల్లాలోని నార్నేవారిపాలెంలో దళితులు తమ ఇళ్ళకు భూ యజమానులు వచ్చి భూములు యిస్తేనే సాగు చేద్దాం లేకపోతే వేరే పనులకు వెళదామని నిర్ణయించుకోవడంతో భూ యజమానులు కౌలు రైతుల ఇళ్ళకు వచ్చి భూములిచ్చారు. అంతకు ముందు వి.ఆర్.ఒ.ను భూ యజమానులు కొట్టగా ఆయనను కౌలు రైతులే పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు పెట్టించారు. అంతేగాక పక్క గ్రామం నుండి వచ్చి భూ యజమానుల దగ్గర టీ కొట్టు పెట్టుకొన్న వ్యక్తి కౌలు రైతులకు సహకరిస్తున్నాడనే కారణంతో భూ యజమానులు అతని టీ కొట్టు తొలగించారు. దాంతో కౌలు దార్లుగా వున్న దళితులు ఆ టీ కొట్టును వాళ్ళ ఇళ్ళ దగ్గర పెట్టించారు. అదే జిల్లాలో రుణాలు సరిగ్గా మంజూరు చేయనందుకు 27 బ్యాంకు బ్రాంచీలను ఒకటి నుండి మూడు రోజులు తాళాలు వేసి బ్యాంక్ మేనేజర్లను బయట నిలబెట్టారు. తమ పనులు చేయడానికి అలసత్వం చూపిన అనేకమంది వి.ఆర్.ఒ., ఎ.ఇ.లను ఆఫీసులో నిర్బంధించారు. ఇంకా రాష్ట్రంలో అనేకచోట్ల కౌలు రైతులు సంఘటితమై పోరాడి హక్కులు సాధించుకున్నారు.

### గ్రామాల్లో పార్టీ అభివృద్ధికి కౌలుదార్ల ఉద్యమం కీలకం

ఈ పరిస్థితులలో ప్రజాఉద్యమం బలపడా లంటే కౌలు రైతులపై కేంద్రీకరించి పనిచేయా లని పార్టీ నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో వర్గ బలాబలాలను మనకు అనుకూలంగా మార్చుకోవాలంటే నేటి పరిస్థితుల్లో కౌలుదార్లను సమీకరించి వర్గ ఉద్యమాన్ని పెంపొందించడం అనివార్యం. అందుకే ప్రత్యేకంగా కౌలు రైతుల సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇది వర్గ ఉద్యమం. కాబట్టి నిరంతరం కౌలుదార్లను అంటి పెట్టుకొనే విధంగా పక్కా ప్రణాళికతో

పనిచేయాలని పార్టీ నిర్ణయించింది. కౌలుదార్లలో ఎక్కువగా దళితులు, వెనుకబడిన తరగతులు వారు వుండటం, భూస్వాములతోనేరుగా తలపడటం జరుగుతోంది కాబట్టి ఎంతో పట్టుదలతో కౌలు ఉద్యమాన్ని నిర్మించాలి. పేదలను సమీకరించటానికి ఎంతో ఓపికతో, ఓర్పునేర్పులతో, పట్టుదలతో కృషి జరగాలి.

అయితే కౌలు దారుల్లో మన కృషి సమస్య తీవ్రతకు తగ్గట్టు లేదు. కృషి జరిగినచోట కొనసాగింపు లేదు. వచ్చిన సంబంధాలు బలపడటం లేదు. కారణం మనలో చాలా మంది ఇప్పటికీ కౌలు సమస్యను ఒక తీవ్రమైన వర్గ సమస్యగా చూడటం లేదు. అలా చూడ్డం లేదుకనుకనే క్షేత్రస్థాయిలోకృషి చేసేవిధంగా పక్కా ప్రణాళికలు తయారు చేయడం లేదు. కౌలుదార్లపై నిర్ధిష్ట అధ్యయనం చేసి వివరాలు సేకరించటం లేదు. వేసిన మండల, గ్రామ కమిటీలను పని చేయించడం లేదు. క్యాడర్ కేటాయింపు సక్రమంగా లేదు.

ఈ పరిస్థితులలోపార్టీ నిర్ణయించిన విధంగా గ్రామాలలో బలాబలాలలో మార్పు రావాలంటే మన పని పద్ధతులు, ప్రాధాన్యతలలో మార్పు రావాలి. లేకపోతే ప్రస్తుతం మనకు అనుకూలంగా ముందుకు వచ్చిన కౌలు సమస్యను చేపట్టి, కౌలుదార్లను సమీకరించి, వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళే అవకాశం కోల్పోతాం.

కౌలు రైతుల్లోకి వెళ్ళి వారిని సంఘటితం చేయటానికి ఒక మంచి సాధనం రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన కౌలు చట్టం. ఈ చట్టం అమలయితే కౌలుదార్లకు పూర్తిస్థాయిలో వడ్డీలేని రుణాలు వస్తాయి. ఉపకరణాలు అన్నీ సబ్సిడీ రేట్లకు అందుతాయి. పంటల నష్టపరిహారం వీరికే వస్తుంది. మార్కెట్‌లో తమ పంటలు అమ్ముకోడానికి సంవత్సరం పాటు అవకాశం వుంటుంది. ఈ విధంగా భూస్వాములపై ఆధారపడకుండా, కొంతవరకైనా దోపిడీనుండి రక్షణ పొందడానికి అవకాశం వుంది. అంతేగాక వీరు బాగా సంఘటితమైతే కౌలు ధరలు కూడా తగ్గించుకోవచ్చు. అప్పుడు తమ కష్టానికి తగ్గ ఫలితం పొందుతారు.

### ఓర్పు, పట్టుదలతో కౌలు రైతులను సమీకరించాలి

ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో బూర్జువా పార్టీలు ప్రజలపై పట్టు పెంచుకోడానికి శత విధాలా ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రతి వ్యక్తినీ తమవైపు తిప్పుకొనే విధంగా కేంద్రీకరించి పట్టు బిగిస్తున్నారు. ఇతర సమస్యలు ముందుకు తెచ్చి కౌలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారు.

> **"గ్రామాలలో బలాబలాలలో మార్పు రావాలంటే మన పని పద్ధతులు, ప్రాధాన్యతలలో మార్పు రావాలి. లేకపోతే ప్రస్తుతం మనకు అనుకూలంగా ముందుకు వచ్చిన కౌలు సమస్యను చేపట్టి, కౌలుదార్లను సమీకరించి, వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళే అవకాశం కోల్పోతాం."**



ఆంధ్ర ప్రదేశ్ కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి రంగారావు నాయకత్వంలో ప్రకాశం జిల్లా కారంచేడులో ఎంఎల్ఏ దగ్గుబాటి వెంకటేశ్వరరావును ఘెరావ్ చేస్తున్న కౌలు రైతులు.

మనం అంతకంటే పట్టుదలగా కేంద్రీకరిస్తేనే కౌలురైతులను సమీకరించగలం. గ్రామాలలో పెత్తందార్ల పట్టులో వున్న వీరిని సమీకరించాలంటే మనం ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి. గ్రామంలో కౌలుదార్లను గుర్తించాలి. వారిలో భూమిలేని కౌలుదార్లపైనా, కొద్దిగా భూమి వుండి కౌలు సాగుచేస్తున్నవారిపైనా మొదట దృష్టి పెట్టాలి. భూ యజమానులకు భయపడి వారు రావటం లేదని ఊరుకోకుండా ఇంటింటికీ వెళ్ళి వారిని చైతన్యపరచాలి. వారికి ఇతర సమస్యలు ఎన్ని వున్నా కౌలు రుణాలపై కదులుతున్నారు. దీన్ని అవకాశంగా తీసుకొని ఈ సమస్యపై పట్టుబట్టాలి. వీరే ఉపాధి కూలీలుగా వున్నారు. వీరికే ఎస్.సి., ఎస్.టి., సబ్‌ప్లాన్ నిధులు రావాలి. ఇంకా వీరికి ఇళ్ళస్థలాలు, పెన్షన్లు తదితర సమస్యలు వున్నాయి. కౌలు ఉద్యమం నిర్మిస్తే పై అంశాలపై కూడా వీరిని సమీకరించవచ్చు.

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలలో కౌలు రైతులే ఎక్కువగా వున్నారు. గత నవంబర్, డిసెంబర్ నెలలలో గుంటూరు జిల్లాలో 23 మంది కౌలు రైతులు చనిపోయారు. తూర్పు గోదావరి జిల్లాలోని గొల్లప్రోలు మండలంలో అక్టోబర్ నెలలో 25 మంది కౌలు రైతులు చనిపోయారు.

ఇన్ని ఇబ్బందులు వున్నా కౌలు సేద్యం పెరుగుతున్నది. కష్టాలు, నష్టాలు భరిస్తున్నారు.

గ్రామాలలో మన పార్టీ బలపడాలన్నా, సమీకరణలు పెరగాలన్నా, ప్రజా పునాది పెరగాలన్నా నేడు కౌలు రైతుల సమస్య కీలకం.

అందువల్లనే నేడు గ్రామాల్లో మనం కౌలురైతుల సమస్యలపై ప్రణాళికాబద్ధంగా, నిరంతరాయంగా కృషి చేయాలి. ముందుగా సర్వే ద్వారా కౌలు దారుల వివరాలు సేకరించాలి. గ్రామ, మండల, జిల్లా కమిటీలు వేయాలి. కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలి. ఎప్పటికప్పుడు అధికారులపై ఒత్తిడి పెంచే విధంగా రాయబారాలు, వివిధ పోరాటాలు చేయాలి. జిల్లా కేంద్రం పని ఈ ఉద్యమంలో చాలా ముఖ్యం.

# సోషలిస్టు ప్రత్యామ్నాయం కోసం పోరాటాలు పెంచాలి!

## కమ్యూనిస్టు వర్కర్స్‌పార్టీల 15వ అంతర్జాతీయ సమావేశం పిలుపు

**61 దేశాలనుండి 77 పార్టీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. వివిధ కారణాలరీత్యా ఈ సమావేశానికి హాజరుకాలేకపోయిన 14 పార్టీలు తమ సందేశాన్ని పంపాయి. అనేక ఇతర అంశాలతోపాటు ఈ సమావేశం ప్రధానంగా పెట్టుబడిదారీ విధానపు సంస్థాగత సంక్షోభం తీవ్రతరమవుతున్న నేపథ్యంలో చోటు చేసుకుంటున్న అంతర్జాతీయ పరిణామాల గురించీ, సంక్లిష్టంగా మారుతున్న అంతర్జాతీయ బలాబలాల పొందిక, రానున్న సామ్రాజ్యవాద ప్రమాదాలను గురించీ చర్చించింది.**

**ఆర్. అరుణ్ కుమార్**

కమ్యూనిస్టు, వర్కర్స్‌పార్టీల 15వ అంతర్జాతీయ సమావేశం పోర్చుగల్ దేశ రాజధాని లిస్బన్‌నగరంలో qe+<sY 8 qT+&• 10 esAÂE" జరిగింది. పోర్చుగీస్ కమ్యూనిస్టు పార్టీ ఈ సమావేశానికి చక్కటి ఏర్పాట్లు చేసింది. పోర్చుగల్ దేశంలో ఇలాంటి సమావేశం జరగడం ఇది రెండవసారి.

పోర్చుగీసు కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి జెరోనిమో డిసౌజా ప్రారంభోపన్యాసం చేస్తూ ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు, కార్మికవర్గ పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వివిధ దేశాల ప్రతినిధులకు స్వాగతం పలికారు. "సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం, అనుభవాలు పంచుకోవడం, సంక్లిష్టంగా మారిన అంతర్జాతీయ పరిస్థితులను తాజాగా మదింపు చేయడం, అంతర్జాతీయ పరిణామాల ప్రధాన ధోరణులను సరిగా అంచనా వేయడం, అవగాహన పెంచుకోవడం, పార్టీల మధ్య స్నేహ, సౌభ్రాతృత్వ భావనను పెంపొందించుకోవడం నిర్దిష్టమైన పంథాలో, చొరవతో, పరస్పర సహకారంతో అంగీకృత కార్యాచరణను చేపట్టడం" ఈ సమావేశ ముఖ్యోద్దేశ్యం అని వివరించారు.

అంతర్జాతీయ పెట్టుబడిదారీ సంక్షోభ ప్రభావం తమ దేశం (పోర్చుగల్) మీద ఏమేరకు పడింది, ఈ భారాల నేపథ్యంలో పోర్చుగీసు కమ్యూనిస్టు పార్టీ చేపట్టిన కార్యకలాపాలు ఏమిటనేది స్థూలంగా వివరించారు. 'కార్మిక హక్కుల మీద తీవ్రంగా దాడులు జరుగుతూ వున్నాయి. ప్రజల్లో ప్రభుత్వ పలుకుబడి నానాటికీ దిగజారిపోతోంది. ప్రజల నుండి వేరుపడిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పోర్చుగీసు కమ్యూనిస్టుపార్టీ తప్ప ప్రజలకు వేరే ప్రత్యామ్నాయం లేదు. పార్టీకి ప్రజలు చేరువ అవుతున్నారు. పార్టీని నిర్మాణపరంగా బలోపేతం చేయడానికి పని ప్రదేశాల్లో, దుకాణాల్లో క్షేత్రస్థాయి కృషి జరుగుతోంది. ప్రజా బాహుళ్యంతో సంబంధాలు గరిష్టంగా పెట్టుకునేందుకు పార్టీ కృషి చేస్తోంది' అని విపులీకరించారు. పోర్చుగీసు కమ్యూనిస్టుపార్టీ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి మరింతగా కట్టుబడి వుంటూ, దేశీయంగా నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా వర్గ దృక్పథంతో పని చేసేస్తున్నది. పోర్చుగీసులో విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేయడం ద్వారా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తాం' అని ఆయన ప్రకటించారు.

సమావేశంలో మూడు విడతలుగా చర్చలు జరిగాయి. మొదటి విడత చర్చల్లో సమావేశానికి హాజరైన పార్టీల ప్రతినిధులు అందరూ సమకాలీన ప్రపంచ పరిణామాలపై తమతమ పార్టీల విశ్లేషణలనూ, అంచనాలనూ తెలియ పరచడంతో పాటు ఆయా దేశాల్లోని 'పాలక శక్తుల దాడులకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటాలనూ, అనుభవాలనూ వివరించారు.

సామ్రాజ్యవాద దాడిని తిప్పికొట్టడంలో లాటిన్ అమెరికా దేశాల్లోని కమ్యూనిస్టుపార్టీల అభ్యుదయకాముక ప్రభుత్వాల అనుభవాలను సమావేశం ముందు వుంచారు. వెనిజులా ప్రభుత్వం విద్య, వైద్యం, క్రీడలు, సంస్కృతి, గృహ నిర్మాణం వంటి ప్రజా సంక్షేమ పథకాలకు 55, 000 కోట్ల డాలర్లు ఖర్చు చేసింది. ఉరుగ్వే ప్రభుత్వం కార్మికుల వేతనాలను 19 శాతం పెంచింది. అర్జెంటీనాలో పెన్షన్లు, జీతభత్యాలు గణనీయంగా పెరిగాయి. ఉమ్మడి బేరసారాల



**రచయిత భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కార్యాలయం విదేశీ వ్యవహారాల విభాగంలో పనిచేస్తున్నారు.**

హక్కును బలోపేతం చేసింది. బ్రెజిల్‌లో 5 కోట్ల జనాభా పేదరికం నుండి విముక్తి చెందారు. మొత్తంమీద చూస్తే లాటిన్ అమెరికా దేశాల్లో నిరుపేదరికం గణనీయంగా తగ్గింది, పేదరికం బాగా తగ్గుముఖం పట్టింది. నిరుద్యోగం–నిరక్షరాస్యత గణనీయంగా తగ్గాయి. ఆరోగ్య ప్రమాణాలు ఇనుమడించాయి.

**“సోషలిస్టు ాద్యమాలకూ, సోషలిజం అభివృద్ధికీ తమ పార్టీ కట్టుబడి వుందనీ, అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్ళను చైనా కమ్యూనిస్టుపార్టీ ధీటుగా ఎదుర్కొంటుందనీ, ప్రపంచ దేశాల్లోని కమ్యూనిస్టు, కార్మికవర్గ పార్టీలు, ఇతర అభ్యుదయ శక్తులతో పరస్పర అభిప్రాయాల మార్పిడికి చర్చలను మరింత బలోపేతం చేసుకుంటుందనీ చైనా పార్టీ నేత ప్రకటించారు.”**

చైనా కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధి ప్రసంగిస్తూ ప్రపంచంలో తీవ్రమైన, సంక్లిష్టమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయనీ, ఏకధృవ ప్రపంచంగా వున్న అంతర్జాతీయ సమాజంలో బహుళ–ధృవ వ్యవస్థ వైపు పరివర్తన చెందుతున్నదనీ వివరించాడు. ఐనప్పటికీ అంతర్జాతీయ పరిణామాలలో (సామ్రాజ్యవాద) ఆధిపత్య ధోరణులు, అధికార, రాజకీయాలూ, నయా–జోక్యందారీ విధానాలూ పెరుగుతున్న సంకేతాలు కొనసాగుతున్నాయి. అంటే సోషలిజం వ్యాప్తికి ఎన్ని అవకాశాలు వున్నాయో, సవాళ్ళా–ఆటంకాలూ కూడా వున్నాయని స్పష్టం చేశారు. “ఇవాళ నెలకొన్న అంతర్జాతీయ ద్రవ్య సంక్షోభం పెట్టుబడిదారీ విధానాన్ని ఒక సంస్థాగత డోలాయమాన పరిస్థితుల్లోకి నెట్టేసింది. నయా–ఉదారవాద అభివృద్ధి నమూనా ఇంకెంతో కాలం మనజాలదనీ, తక్షణమే ఏదో ఒక మార్పు, సర్దుబాటు అవసరాన్ని పీకలమీదకి తెచ్చిందనీ” విశదం చేశారు. “కొన్ని పెట్టుబడిదారీ దేశాలు నూతన పారిశ్రామిక విప్లవం మీద ఆధిపత్యం కోసం కీచులాడుకుంటూనే ప్రపంచీకరణ విధానాలను అడ్డం పెట్టుకుని అంతర్జాతీయ సూత్రాలను ఏకపక్షంగా మలచడానికి ప్రయత్నిస్తున్నాయి. సోషలిజం అవకాశాలను తుంచివేయడానికి అసమాన పోటీ, అన్యాయమైన చట్టాలు, అపభ్రంశపు ప్రపంచ ఆర్థికవ్యవస్థను అడ్డం పెట్టుకుంటున్నాయని” విమర్శిస్తూ–ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు శక్తులు ఐక్యంగా, పరస్పర సహకారంతో ప్రత్యామ్నాయ అభివృద్ధి విధానాల ద్వారా సోషలిస్టు పంథాను చేరుకోవాల్సిన అవసరం వుందని’ పిలుపునిచ్చారు. అలాగే తమ దేశంలో పార్టీ పరిస్థితికి వస్తే చురుకుదనం లోపించడం, ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ాండడంలో పెరిగిపోతున్న అసమర్థత, అవినీతి పెరిగిపోవడం, కమ్యూనిస్టు ప్రమాణాలు లోపించడం’ వంటి సమస్యలు ఎదుర్కొంటున్నామనీ, ప్రస్తుతం ఈ లోటుపాట్లను అధిగమించడానికి పార్టీయావత్తు దిద్దుబాటు కార్యక్రమాన్ని చేపట్టిందనీ వివరించారు.



పోర్చుగీసు రాజధాని లిస్బన్ నగరంలో నవంబర్ 8 నుండి 10 వరకు జరిగిన కమ్యూనిస్టు, వర్కర్స్‌పార్టీల 15వ అంతర్జాతీయ సమావేశం

సోషలిస్టు ాద్యమాలకూ, సోషలిజం అభివృద్ధికీ తమ పార్టీ కట్టుబడి వుందనీ, అంతర్జాతీయంగా ఎదురవుతున్న సవాళ్ళను చైనా కమ్యూనిస్టుపార్టీ ధీటుగా ఎదుర్కొం టుందనీ, ప్రపంచ దేశాల్లోని కమ్యూనిస్టు, కార్మికవర్గ పార్టీలు, ఇతర అభ్యుదయ శక్తులతో పరస్పర అభిప్రాయాల మార్పిడికి చర్చలను మరింత బలోపేతం చేసుకుంటుందనీ చైనా పార్టీ నేత ప్రకటించారు.

ఈజిప్టు కమ్యూనిస్టుపార్టీ ప్రతినిధి ప్రసంగిస్తూ “మా దేశంలో అసంపూర్ణంగా మిగిలిపోయి ఇప్పటికే కాలాతీతం అయిన విప్లవాన్ని పరిపూర్తి చేసే చారిత్రక కర్తవ్య నిర్వహణలో భాగంగానే జూన్ 30 విప్లవం సంభవించిందని” చెప్పారు. 1970వ దశకం మధ్యకాలంనుండి గడిచిన ముప్ఫై ఏళ్ళకాలంలో ఈజిప్టు, దాని చుట్టు పక్కల భౌగోళిక ప్రాంతమంతా మితవాద శక్తుల గుప్పిట్లో చిక్కుపడిందనీ, అరబ్ విముక్తి పోరాటం కుప్పకూలడం, సోవియట్ సోషలిస్టు రాజ్యం విచ్ఛిన్నం కావడంతో ఈ ప్రాంతమంతటా మితవాద శక్తులు ఫాసిస్టు శక్తులు, పచ్చిమితవాదులు, నియంతలు రాజ్యమేలారనీ, జూన్ 30 విప్లవం ఒక ప్రజాస్వామిక పౌర రాజ్యం ఏర్పాటుకోసం రాజ్యాంగబద్ధంగా పౌరుల రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులు కల్పించడం కోసం, సంఘం పెట్టుకునే హక్కు, రాజకీయ పార్టీ స్థాపించుకునే హక్కులకోసం, మతాన్ని రాజకీయాలనుండి వేరు చేయడం కోసం, మితవాద రాజకీయాలను నిషేధించే దానికోసం జరుగుతున్న ప్రజాతంత్ర విప్లవం” అని విశ్లేషించి చెప్పారు.

‘జూన్ 30 విప్లవం ఈజిప్టు జాతీయ ప్రజాస్వామిక విప్లవంలో నిర్ణయాత్మక దశ. ఇందులో సైన్యం పాత్ర వున్నప్పటికీ ప్రధానంగా ఇది ప్రజాబాహుళ్యం పాల్గొన్న విప్లవం, ప్రజారాశుల భాగస్వామ్యాన్ని చూసి సైన్యం

> **“ సమావేశం ముగింపు సందర్భంగా, పోర్చుగీసు కమ్యూనిస్టుపార్టీ నాయకుడు, ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమకారుడు అయిన అల్వరోకన్ హాల్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని భారీ బహిరంగ సభ జరిగింది. లిస్బన్ నగరంలో నాలుగు వేర్వేరు ప్రాంతాలనుండి మొదలైన ర్యాలీలు నగర కూడలిలోని మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు తరలివచ్చాయి. ”**




సమావేశంలో ప్రసంగిస్తున్న పోర్చుగీసు కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి జెరోనిమో డి సౌజా

కూడా మద్దతుగా నిలిచింది’ అని విశ్లేషించారు. అయితే ‘మధ్యంతర ప్రభుత్వం అనుసరిస్తున్న, రూపొందిస్తున్న విధానాలు ప్రజాస్వామిక విప్లవ స్ఫూర్తికి ఆమడ దూరంలో వున్నాయి. ఇప్పుడు సరైన ఐక్యం చేసుకోవడం తక్షణ అవసరం. ఇప్పుడున్న పరిస్థితులను యథాతథంగా కొనసాగించినా, ఊగిసలాట వైఖరితో విప్లవోద్యమం వెనుకపట్టు పట్టినా జాతీయ ప్రజాస్వామిక విప్లవానికి అసలుకే మోసం వస్తుంది. ప్రత్యర్థి శక్తులు బలాబలాల పొందికను తమకు అనుకూలంగా మార్చుకుంటాయి. అందుకే దేశంలోని వామపక్ష శక్తులను ఐక్యంచేసి, క్రియాశీలంగా ఐక్యం చేసుకోవాల్సిన అవసరం వుందనీ, తాజా పరిస్థితులకు అనుగుణంగా సోషలిస్టు శక్తులకు ఐక్య నాయకత్వాన్ని అందించే కృషి జరుగుతోందనీ’ తెలియజేశారు.

సమావేశం రెండవ విడత చర్చ ప్రధానంగా పోర్చుగీస్ కమ్యూనిస్టుపార్టీ ప్రతిపాదించిన ‘ఉమ్మడి ప్రకటన’ (జాయింట్ డిక్లరేషన్) మీద సాగింది. చాలా పార్టీలు ఈ ప్రకటనతో ఏకీభావం ప్రకటించాయి. కొన్ని పార్టీలు మాత్రం అంతర్జాతీయ పరిణామాలపై ఇది తమ అవగాహనకూ, విశ్లేషణకూ అనుగుణంగా లేదని అభిప్రాయపడ్డాయి. ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యం ఏకాభిప్రాయ సాధన అయినప్పటికీ సమావేశంలో అలాంటి ఏకాభిప్రాయానికి రాలేకపోయినందున ‘ఉమ్మడి ప్రకటన’ చేయడం సాధ్యపడలేదు. పోర్చుగీసు కమ్యూనిస్టుపార్టీ ఒక పత్రికా ప్రకటన మాత్రం జారీ చేసింది. అయితే నిర్దిష్టమైన అంశాలపై ఉమ్మడి కార్యాచరణ చేపట్టాలన్న ప్రతిపాదనకు అన్నిపార్టీలూ సుముఖత వ్యక్తం చేశాయి. (ఆ మేరకు అంగీకరించిన ప్రకటనను విడిగా ఇస్తున్నాం)

మూడవ విడత చర్చలు–ఈ అంతర్జాతీయ సమావేశాలను ఏ పద్ధతిలో నడపాలి, ఏయే పార్టీలను ఇంకా భాగస్వాములుగా చేయాలి, వర్కింగ్ గ్రూప్‌లో ఎన్ని పార్టీలు ఏయే పార్టీలు వుండాలి, భవిష్యత్తులో ఇలాంటి సమావేశాలను ఏ తీరుగా నడపాలి అనే అంశంమీద జరిగాయి. (ప్రస్తుతం 11 పార్టీలతో కూడిన వర్కింగ్ గ్రూప్ పనిచేస్తోంది. సమావేశానికి హాజరయ్యే పార్టీలన్నీ వర్కింగ్ గ్రూప్‌లో సభ్యులుగా ఉండొచ్చు. ఇది నాయకత్వ వేదికగా కాకుండా సమన్వయ వేదికగా భావించాలనే నిర్ణయానికి వచ్చాయి) విస్తృతమైన చర్చల అనంతరం ఈ అంశాలన్నింటిమీదా మరింత లోతుగా చర్చ జరగాల్సిన అవసరం వుందని భావించి ప్రస్తుత వర్కింగ్ గ్రూప్ వచ్చే 16వ అంతర్జాతీయ సమావేశం నాటికి నిర్దిష్ట ప్రతిపాదనలు రూపొందించి ఆ సమావేశం ముందు ఉంచాలని నిర్ణయించడమైంది.

సమావేశం ముగింపు సందర్భంగా, పోర్చుగీసు కమ్యూనిస్టుపార్టీ నాయకుడు, ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమకారుడు అయిన అల్వరోకన్ హాల్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని భారీ బహిరంగ సభ జరిగింది. లిస్బన్ నగరంలో నాలుగు వేర్వేరు ప్రాంతాలనుండి మొదలైన ర్యాలీలు నగర కూడలిలోని భారీ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు తరలివచ్చాయి. విక్టర్ జారా పేరిట ఏర్పడ్డ ఒక వాద్యగాయక బృందంతో పాటు ఇతర కళాకారులు ఇచ్చిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి. అంతర్జాతీయ సదస్సుకు విచ్చేసిన దేశదేశాల కమ్యూనిస్టుపార్టీల ప్రతినిధులు, పోర్చుగీసు కమ్యూనిస్టుపార్టీ నాయకత్వం వేదికపై ఆశీనులయ్యారు. జెరోనిమో డిసౌజా బహిరంగ సభనుద్దేశించి ప్రసంగించారు.

### కమ్యూనిస్టు వర్కర్స్ పార్టీల 15వ అంతర్జాతీయ సమావేశం ప్రకటన పూర్తి పాఠం

పెట్టుబడిదారీ సంక్షోభం తీవ్రమవుతున్న నేపథ్యంలో కార్మికులు, ప్రజల హక్కులు కాపాడేందుకు కార్మికవర్గం, కమ్యూనిస్టుపార్టీలు పోషించాల్సిన పాత్ర, చేపట్టాల్సిన పోరాటాలను గురించీ, సామ్రాజ్యవాద దాడులు, అంతర్జాతీయ బలాబలాల పొందికలో మార్పులు, జాతుల సమస్య, వర్గ దోపిడి నుండి విముక్తి, సోషలిజం సాధన వంటి కీలకాంశాల గురించే చర్చించే ఉద్దేశ్యంతో నవంబర్ 8 నుండి 10 వరకు మూడురోజులపాటు లిస్బన్ నగరంలో 15వ అంతర్జాతీయ సమావేశం జరిగింది.

61 దేశాలనుండి 77 పార్టీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. వివిధ కారణాలరీత్యా ఈ సమావేశానికి హాజరుకాలేకపోయిన 14 పార్టీలు తమ సందేశాన్ని పంపాయి.

అనేక ఇతర అంశాలతోపాటు ఈ సమావేశం ప్రధానంగా పెట్టుబడిదారీ విధానం సంస్థాగత సంక్షోభం తీవ్రతరమవుతున్న నేపథ్యంలో చోటు చేసుకుంటున్న అంతర్జాతీయ పరిణామాల గురించీ, సంక్లిష్టంగా మారుతున్న

అంతర్జాతీయ బలాబలాల పొందిక, రానున్న సామ్రాజ్యవాద ప్రమాదాలను గురించీ చర్చించింది.

సామ్రాజ్యవాద, దోపిడీశక్తులను ప్రతిఘటిస్తూ దేశ దేశాల కార్మికులు, ప్రజానీకం సాగిస్తున్న పోరాటాలకు ఈ సమావేశం జేజేలు పలికింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు విముక్తి పోరాటాలను అభివృద్ధి చేసేందుకూ, గుత్త వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, సోషలిస్టు అనుకూల పోరాటాల దిశగా మలిచేందుకూ అనువుగా వున్నాయన్న విశ్వాసం వెలిబుచ్చింది.

లెహ్మన్ బ్రదర్స్ వంటి అతి పెద్ద బహుళజాతి ద్రవ్యసంస్థల దివాళాతో 2008లో మొదలైన ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రతరమయ్యిందని సమావేశం గుర్తించింది. పాలకశక్తులు సంక్షోభం ముగిసిపోయిందనీ, తిరుగు వృద్ధిబాట పట్టినట్లే అని చెప్పుకొస్తున్నా, వాస్తవానికి ఇంకా ఈ సంక్షోభం ముగియ లేదు. కమ్యూనిస్టులు ఏనాడో విశ్లేషించి, నిర్ధారించిన విధంగానే ఇవాళ పెట్టుబడి అతి కేంద్రీకరణ, అలవిమాలిన ఉత్పత్తి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇది పెట్టుబడిదారీ విధానంలో ఇమిడి వుండే వైరుధ్యాన్నీ, సామాజిక ఉత్పత్తికీ – ప్రైవేటు లాభానికీ మధ్య వుండే వైరుధ్యాన్నీ బట్టబయలు చేస్తోంది. చారిత్రకంగా పెట్టుబడిదారీ విధానానికి వుండే పరిమితులను ఎత్తి చూపుతోంది. పెట్టుబడిదారీ విధానానికీ, ప్రపంచ మానవాళికీ ఏకైక ప్రత్యామ్నాయం సోషలిజమే అని పేర్కొంటూ, పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని సమావేశం అభిప్రాయపడింది.

ద్రవ్య పెట్టుబడీ, దాని కొమ్ముకాసే సామ్రాజ్యవాద శక్తులూ, ఈ శక్తుల అంతర్జాతీయ, బహుళ జాతీయ వ్యవస్థలూ – ఐరోపా యూనియన్ సహా – కార్మికవర్గం మీదా, సాధారణ ప్రజానీకం మీదా సామాజిక తిరోగమనపూరితమైన, అనాగరికమైన రీతిలో ఆర్థికంగా, హక్కులపరంగా దాడులకు తెగబడుతున్నాయి. దేశాల సార్వభౌమత్వంమీదా, స్వతంత్ర్య విధానం మీదా యుద్ధాన్ని ప్రకటిస్తున్నాయి.

ఈ సంక్షోభం వల్ల అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లోని ప్రజల సామాజిక, ఆర్థిక హక్కుల మీద కూడా మునుపెన్నడూ లేనంతటి తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయి. ఈ పెట్టుబడిదారీ సంక్షోభం వ్యవసాయ, ఆహార రంగాలను అస్తవ్యస్థం చేసేసినందున అనేక దేశాల ఆహార భద్రత

> **“ ద్రవ్య పెట్టుబడీ, దాని కొమ్ముకాసే సామ్రాజ్యవాద శక్తులూ, ఈ శక్తుల అంతర్జాతీయ, బహుళ జాతీయ వ్యవస్థలూ - ఐరోపా యూనియన్ సహా - కార్మికవర్గం మీదా, సాధారణ ప్రజానీకం మీదా సామాజిక తిరోగమనాపూరితమైన, అనాగరికమైన రీతిలో ఆర్థికంగా, హక్కులపరంగా దాడులకు తెగబడుతున్నాయి. దేశాల సార్వభౌమత్వంమీదా, స్వతంత్ర్య విధానం మీదా యుద్ధాన్ని ప్రకటిస్తున్నాయి. ”**



సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రతినిధిగా ప్రసంగిస్తున్న వ్యాస రచయిత ఆర్. అరుణ్ కుమార్

ప్రమాదంలో పడింది. మెజారిటీ ప్రజానీకం పోషకాహారలేమి, క్షుద్బాధల పాలబడుతున్నారని సమావేశం ఆందోళన వ్యక్తంచేసింది.

ప్రధాన సామ్రాజ్యవాద శక్తులు, నాటో దేశాలు మిలిటరీ జోక్యందారీ విధానాలకు, ఏకపక్ష యుద్ధాలకు కాలుదువ్వుతూ ప్రపంచ శాంతికి పెనుసవాలుగా మారుతున్న క్రమం పట్ల సమావేశం ఆందోళన వ్యక్తంచేసింది. ప్రపంచ వనరుల మీద, ముఖ్యంగా ఇంధన వనరుల మీద ఆధిపత్యం చలాయించడానికీ, ప్రజల తిరుగుబాటును కట్టడి చేయడానికి, ఇవాళ వున్న పరిస్థితుల్లో అనివార్యంగా వెల్లువెత్తే సామాజిక విప్లవాలను అణచివేయడానికీ, సామ్రాజ్యవాద శక్తులు వివిధ దేశాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా జోక్యం చేసుకుంటూ, నియంతృత్వ పాలకులకు కొమ్ముకాయడం, అంతర్గత యుద్ధాలకు ఆజ్యం పోయడం వంటి దుర్మార్గాలెన్నో చేస్తున్నాయి.

ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా సామ్రాజ్యవాద ఆధిపత్యానికీ, పెట్టుబడిదారీ బర్బరత్వానికీ వ్యతిరేకంగా సామాజిక అభ్యుదయం కోసం, స్వేచ్ఛా–స్వాతంత్ర్యాలకోసం, శాంతికోసం సర్వజనుల 'సామాజిక–ఆర్థిక వికాసం కోసం, మెరుగైన ప్రత్యామ్నాయం కోసం ఖండ ఖండాల్లో, దేశదేశాల్లో జరుగుతున్న పోరాటాలకు ఈ సమావేశం సంఘీభావం ప్రకటిస్తోంది. కార్మికవర్గం కేంద్రంగా ఇతరేతర గుత్త పెట్టుబడి వ్యతిరేక శక్తులను కలుపుకుని తమ హక్కులకోసం – ఉపాధి హామీకోసం కార్మిక –సామాజిక హక్కులకోసం, రాజ్యం నెరవేర్చాల్సిన సామాజిక బాధ్యతల అమలుకోసం పోరాటాలు సాగాలని కోరుకుంటోంది. కార్మిక వర్గం మాత్రమే ఈ కర్తవ్యం నెరవేర్చగలదని సమావేశం విశ్వాసం వ్యక్తం చేసింది.

సామ్రాజ్యవాద శక్తుల జోక్యందారీ, పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ప్రజానీకం అందరికీ సమావేశం సంఘీభావం వ్యక్తపరిచింది. ప్రత్యేకించి మధ్యప్రాచ్యం

**"వివిధ దేశాల్లోను, ప్రాంతాల్లోను జరుగుతున్న పోరాటాల నిర్దిష్ట అనుభవం ఏమిటంటే - పరిస్థితులు ఎంత గడ్డుగా వున్నా కూడా కార్మికవర్గం, ప్రజానీకం... గుత్తాధిపత్యానికీ, పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా ప్రత్యామ్నాయాలకోసం పోరాడుతున్నారు. కొన్ని విజయాలు సాధిస్తున్నారు."**

లోని ఈజిప్టు, ట్యునీషియా వంటి దేశాల్లో సార్వభౌమ, ప్రజాస్వామిక రాజ్యంకోసం, జాతీయ సమగ్రత-సామాజిక న్యాయాలకోసం జరుగుతున్న పోరాటాలకు సంఘీభావం వ్యక్తంచేసింది. తమ హక్కులకోసం పాలస్తీనా ప్రజానీకం చేస్తున్న పోరాటాలనూ, దురాక్రమణ పూరిత జోక్యందారీ విధానాలకు వ్యతిరేకంగా సిరియా ప్రజానీకం చేస్తున్న పోరాటాలనూ బలపరిచింది.

పోరాటశక్తులు బలం పుంజుకొని విప్లవాత్మక పోరాటం అభివృద్ధి అయ్యే అవకాశాలు వున్న దేశాల్లో సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని నిలువరించే కీలక పరిణామాలూ చోటు చేసుకుంటున్నాయి. లాటిన్ అమెరికా దేశాల్లోని కమ్యూనిస్టులు, అభ్యుదయ శక్తుల నాయకత్వాన ప్రజానీకం సామ్రాజ్యవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలను సమావేశం స్వాగతించింది. ఈ ప్రాంతంలో సహకారం, సంఘీభావం వెల్లివిరుస్తూ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలను బలపరిచే నూతన శక్తిగా అభివృద్ధి అయ్యేందుకు అవకాశాలు వున్నాయని గుర్తించింది.

ఈ అంతర్జాతీయ సమావేశానికి హాజరైన దేశదేశాల ప్రతినిధులు వారి వారి పార్టీల తరఫున క్యూబా ప్రజానీకానికీ, వారు చేపట్టిన సోషలిస్టు విప్లవానికీ, వెనిజులా ప్రజానీకానికీ, వారు చేపట్టిన బొలివర్ విప్లవానికీ సంపూర్ణ మద్దతు ప్రకటించాయి.

పచ్చి మితవాద శక్తులు, జాతి,వర్ణ విద్వేష శక్తులు, మతోన్మాద శక్తులు, పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేక శక్తుల దాడుల నుండి ప్రజాస్వామ్యం, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కాపాడుకునేందుకు జరిగే పోరాటాల ప్రాముఖ్యతను ఈ సమావేశం గుర్తించింది. ఐరోపా ఖండంలోనూ, ఇతరేతర దేశాల్లోనూ రాజకీయ వేదికలకూ, కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికీ పాల్పడుతున్న పాలకశక్తులకు వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్న కమ్యూనిస్టుపార్టీలు, విప్లవశక్తులకు ఈ సమావేశం సంఘీభావం ప్రకటించింది.

వివిధ దేశాల్లోను, ప్రాంతాల్లోను జరుగుతున్న పోరాటాల నిర్దిష్ట అనుభవం ఏంటంటే - పరిస్థితులు ఎంత గడ్డుగా వున్నా కూడా కార్మికవర్గం, ప్రజానీకం... గుత్తాధిపత్యానికీ, పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా ప్రత్యామ్నాయాలకోసం పోరాడుతున్నారు. కొన్ని విజయాలు సాధిస్తున్నారు.

పెట్టుబడిదారీ విధానానికీ, దాన్ని అంటి వచ్చే సంక్షోభాలకూ నిజమైన మౌలికమైన ప్రత్యామ్నాయం సోషలిజమే అన్న స్పృహ నానాటికీ బలపడుతోంది. సోషలిజం మౌలిక సూత్రాలను అందిపుచ్చుకోవడంలో జరిగిన పొరపాట్లు, వక్రీకరణలనుండి గుణపాఠాలు తీసుకుంటూనే సోషలిస్టు నిర్మాణం వల్ల మానవాళికి ఒనగూడిన మేళ్ళు, అది సాధించిన విజయాలు, అందించిన అతి విలువైన అనుభవాలను ఈ సమావేశం గమనంలో వుంచుకుంటోంది. విప్లవాలకు ఏకరూప నమూనా వుండదని సమావేశం గుర్తిస్తూనే సోషలిస్టు సమాజ నిర్మాణంలో, నిర్వహణలో ప్రజారాశుల నిర్ణయాత్మక పాత్రనూ, భాగస్వామ్యాన్నీ పెంచుకోవాలని నొక్కి చెప్పింది.

అంతర్జాతీయంగా నేడు నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అభ్యుదయ కాముక శక్తులు, సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తుల మధ్య, మరీ ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా వున్న కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల మధ్యన సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని గురించి సమావేశం నొక్కి చెప్పింది. ప్రజా పోరాటాలను బలోపేతం చేసేందుకూ, పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా సోషలిజం నిర్మించేందుకూ అటువంటి బలమైన బంధమే ఆధారం కాగలదని గుర్తించింది. ఈ అంతర్జాతీయ సమావేశాలద్వారా అనుభవాలూ, అభిప్రాయాలూ ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవడంతోపాటు అంగీకృత అంశాలమేరకు ఉమ్మడి నిర్ణయాలకూ, ఉమ్మడి కార్యాచరణకూ కట్టుబడడం, దీన్ని ఇదే రీతిగా కొనసాగించాలని నిర్ణయించడం ఈ దిశగా పనిచేసేందుకు తోడ్పడుతున్నాయి.

తరువాత జరగనున్న అంతర్జాతీయ సమావేశాల వరకు - ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను పర్యవేక్షించి, వాటి అమలుకు గట్టిగా పూనుకునేలా చూడడానికి వర్కింగ్ కమిటీకి తగిన అధికారాలు దఖలు చేయడమైనది. తరువాతి అంతర్జాతీయ సమావేశం ఎక్కడ జరపాలనే దానిమీద మూడు ప్రతిపాదనలు వచ్చాయి. సమావేశం ఎక్కడ, ఎప్పుడు, ఏ లక్ష్యంతో నిర్వహించాలి అనేది వర్కింగ్ గ్రూప్ తదుపరి సమావేశంలో నిర్ణయించబడుతుంది.

**ఏకీకృత కార్యాచరణకు మార్గదర్శకాలు**

కమ్యూనిస్టు-వర్కర్స్ పార్టీల 15వ అంతర్జాతీయ సమావేశం నిర్ణయించిన ఏకీకృత కార్యాచరణ అమలును వర్కింగ్ గ్రూప్ పర్యవేక్షించేందుకు కొన్ని విధివిధానాలు రూపొందించుకుంది. సమావేశం నిర్ణయించిన కార్యాచరణ వివరాలు ఇవీ-

1. 2014 నాటికి మొదటి ప్రపంచ యుద్ధానికి నూరేళ్లు, రెండవ ప్రపంచయుద్ధానికి 75 ఏళ్లు నిండే సందర్భాన్ని పురస్కరించుకొని అంతర్జాతీయంగా పెరుగుతున్న మిలిటరీ ఘర్షణలను నిరసిస్తూ, సామ్రాజ్యవాద దురాక్రమణదారీ యుద్ధాలను ఎండగడుతూ ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ఆందోళనలు నిర్వహించాలి. ఈ ఆందోళనలను సోషలిజం సాధనకోసం సాగే పోరాటంలో అంతర్భాగంగా మెళుకువతో నిర్వహించాలి. (ఈ సందర్భంగా 2014-15న జర్మనీ సరిహద్దు పట్టణమైన అయికెన్‌లో జర్మన్ కమ్యూనిస్టుపార్టీ, న్యూ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నెదర్లాండ్స్, బెల్జియం వర్కర్స్ పార్టీలు నిర్వహించ తలపెట్టిన కార్యక్రమం గురించి అందుకు చేస్తున్న సన్నాహాల గురించి వివరించాయి)

2. సరిగ్గా 15 ఏళ్ళక్రితం సామ్రాజ్యవాద నాటో కూటమి కుట్రపూరితంగా యుగోస్లావియా మీద దాడులకు తెగబడి దక్షిణ సెర్బియా ప్రావిన్స్‌లోని కొసావో, మెతోహిజాల మీద సైనిక చర్యకు పాల్పడడాన్ని ఎండగడుతూ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది.

3. అదే సందర్భంలో ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరేబియన్ ప్రాంత దేశాల్లో పెట్టుబడిదారీ సంక్షోభం పర్యవసానాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలమీద వాటి ప్రభావాల గురించి అంతర్జాతీయస్థాయి సెమి నార్లు నిర్వహించాలనీ, సార్వభౌమ దేశాలు సామా

**"అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న పరిణామాలను ఆసరాగా తీసుకుని సోషలిజంపై జరుగుతున్న సైద్ధాంతిక దాడి, మీడియా పాత్రమీద ఒక అంతర్జాతీయ స్థాయి చర్చాగోష్టి జరిపే అవకాశాలనూ, ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలనూ పరిశీలించాలని నిర్ణయించింది."**



**15 అంతర్జాతీయ కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల సమావేశం ముగింపు సందర్భంగా పోర్చుగీసు కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో లిస్బన్ నగరంలో జరిగిన ర్యాలీ**

జిక-ఆర్థికాభివృద్ధి సాధించడానికి గల స్వయం హక్కులు, వనరుల పరిరక్షణ, వ్యవసాయం, కౌలు సమస్య, ఆహారభద్రత వంటి అంశాల మీద కేంద్రీకరిస్తూ ప్రపంచ పర్యావరణం దెబ్బతిని పోవడంలో, అందుకు కారణమైన గుత్త పెట్టుబడి కంపెనీలను ఎండగడుతూ కూడా ఆ సెమినార్లను నిర్వహించాలి.

4. లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాల్లో సామాజిక మార్పుకోసం జరుగుతున్న పోరాటాలకూ, క్యూబామీద అమెరికా కొనసాగిస్తున్న ఆర్థిక దిగ్బంధనానికి వ్యతిరేకంగా, అమెరికా అక్రమంగా ఖైదుచేసిన నలుగురు క్యూబన్ దేశభక్తుల విడుదలకోసమూ, వెనిజులా, కొలంబియా ప్రజలు శాంతి, సామాజిక న్యాయాల కోసం సాగిస్తున్న పోరాటాలకూ పెద్ద ఎత్తున సంఘీభావం కూడగట్టాలని పిలుపునిచ్చింది.

5. అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న పరిణామాలను ఆసరాగా తీసుకుని సోషలిజంపై జరుగుతున్న సైద్ధాంతిక దాడి, మీడియా పాత్రమీద ఒక అంతర్జాతీయస్థాయి చర్చాగోష్టి జరిపే అవకాశాలనూ, ప్రత్యామ్నాయ కమ్యూ నికేషన్ నెట్‌వర్క్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలనూ పరిశీలించాలని నిర్ణయించింది.

6. మార్చి 8, 2014 అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సామ్రాజ్యవాద బహుముఖ దాడుల వల్ల శ్రామిక మహిళలు పడుతున్న ఇబ్బందులూ ఆర్థిక సంక్షోభం ప్రభావాల గురించి పెద్ద ఎత్తున ప్రచారం అయ్యేలా సంఘీభావ కార్యక్రమాలనూ, మహిళా ఉద్యమ పోరాటాలకు మద్దతు తెలియజేసేలా కార్యక్రమానూ చేపట్టాలని నిర్ణయించింది.

7. కార్మికవర్గం ప్రజానీకం ఆర్థిక, సామాజిక హక్కులకోసం, ఉపాధి హామీ కోసం, కార్మికహక్కుల కోసం, మనిషిని మనిషి దోచుకోవడానికి వ్యతిరేకంగా మేడే ఉత్సవాలను జరపాలనీ, వర్గ పోరాటాల పెంపుదల ఆవశ్య కతను ప్రచారం చెయ్యాలనీ సమావేశం నిర్ణయిం చింది. మే దినోత్సవాన్ని నిరుద్యోగ వ్యతిరేక ఆందోళనాదినంగా నిర్వహించగల అవకా శాలను పరిశీలించి నిరుద్యోగానికి మూలాలు ఏమిటో యువతలో పెద్దఎత్తున ప్రచారం చేసేందుకు ప్రయత్నించాలి. కార్మికహక్కుల పరిరక్షణకూ, కార్మికోద్యమ నాయకులపై రాజకీయ వేధింపులలో భాగంగా సాగిన అరెస్టులను నిరసిస్తూ అట్లాంటి వారి విడుదలకోసం డిమాండ్ చేయాలి.

8. జాత్యంహకారానికి, వర్ణ వివక్షతకు, ఫాసిస్టు ధోరణులకు వ్యతిరేకంగా ఏకీకృత ఆందోళన చేపట్టడానికి గల అవకాశాలను పరిశీలించాలి. చరిత్రలను తిరగరాసే పేరిట కమ్యూనిస్టు వ్యతిరేకతను ప్రచారంలోకి తెస్తున్న వైనాన్ని ఎండగడుతూ సైద్ధాంతిక ప్రచారం చేపట్టాలి. ప్రత్యేకించి ఐరోపా యూనియన్... కమ్యూనిజాన్నీ, ఫాసిజాన్నీ ఒకే గాటన కట్టి సంస్థాగతంగా సాగిస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా గర్హించాలి.

9. కమ్యూనిస్టు పార్టీల మీద రాజకీయ వేధింపులనూ, కమ్యూనిస్టు చిహ్నాలమీదా, కొన్ని పార్టీలమీదా కొనసాగుతున్న నిషేధాలనూ ఈ సమావేశం తీవ్రంగా విమర్శించింది. ఆయా పార్టీలకు మద్దతుగా సంఘీభావ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది.

10. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ 95వ వార్షికోత్సవాలనూ, మొదటి ఇంటర్నేషనల్ స్థాపనకూ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి విశేషంగా తోడ్పాటు చేసిన లెనిన్ 90వ వర్ధంతినీ పురస్కరించుకొని కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

11. అరబ్ దేశాలు, మధ్య ప్రాచ్యంలోని పార్టీలతో సమన్వయం చేసుకొని సామాజిక-జాతీయ విముక్తి పోరాటాలపై అంతర్జాతీయ సెమినార్ నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. పాలస్తీనా, సిరియా ప్రజానీకం చవిచూస్తున్న జాతి అణిచివేతను గర్హిస్తుంది. అణిచివేత నియంతృత్వ పాలనలకు వ్యతిరేకంగానూ, సామాజిక, రాజకీయ, ప్రజాస్వామిక హక్కులకోసం అరబ్, మధ్య ప్రాచ్యప్రాంత దేశాల్లో సాగుతున్న ఉద్యమాలకు బాసటగా నిలవాలని నిర్ణయించింది.

12. సిరియా, ఇరాన్ దేశాల్లో సామ్రాజ్యవాద జోక్యందారీ విధానాలను తీవ్రంగా నిరసించింది. స్వతంత్ర పాలస్తీనా దేశాన్ని గుర్తించింది.

13. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అంతర్జాతీయంగా సమన్వయంతో పనిచెయ్యడానికి వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, వరల్డ్ ఫెడరేష్ ఆఫ్ డెమొక్రటిక్ యూత్, ఉమెన్స్ ఇంటర్నేషనల్ డెమొక్రటిక్ ఫెడరేషన్ వంటి ప్రజాసంఘాల కృషి పెంచాలని తీర్మానించింది. ●

## అభిప్రాయాలు

## సామాజిక ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చే వ్యాసం

మార్క్సిస్టు ఎడిటర్ గారికి,

డిసెంబర్ సంచికలో వినోద్‌రైనా గారి గురించి ప్రచురించిన వ్యాసం చాలా బాగుంది. విద్యావేత్తల కర్తవ్యం ఏమిటి? అంటూ జస్టిస్ ఓ. చిన్నప రెడ్డిగారు చెప్పినట్లు (మార్క్సిస్టు జులై 2013) ఒక మేధావిగా సమాజానికి ఏమి చేయాలో అది చేయడానికి ఆయన కృషి చేశారు. సామాజిక ఉద్యమకారులకు ఉత్తేజాన్ని ఇచ్చే విధంగా వ్యాసం చాలా బాగుంది. రాఘవులు గారు రాసిన 'మళ్లీ మార్క్స్‌వైపు చేస్తున్న ప్రపంచం' వ్యాసం కూడా బాగుంది. కార్యకర్తలకు పనిపద్ధతులు తెలియజేసే విధంగా వ్యాసాలు రాస్తున్న వీరయ్యగారికి ధన్యవాదాలు. మంచి వ్యాసాలు ప్రచురించి ఉద్యమకారులకు ఉపయోగపడే విధంగా మార్క్సిస్టు పుస్తకాన్ని తీర్చిదిద్దుతున్న సంపాదకవర్గానికి ధన్యవాదాలు.

**ఎం.డి. అంజిబాబు,**
కర్నూలు

## వినోద్ రైనా జీవితం ఆదర్శవంతం

ఎటిటర్‌గారికి, మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక డిసెంబర్ నెల సంచికపై నా కింది అభిప్రాయాలను ప్రచురించగోరుతాను.

వినోద్ రైనాగారిపై రాసిన స్ఫూర్తి వ్యాసం విజ్ఞాన దాయకంగా ఉంది. వినోద్ రైనా జీవితం ప్రజలందరికీ ఆదర్శం. మానవ జీవితానికి ఒక లక్ష్యం అంటూ ఉండాలి. ప్రజల కోసం జీవించడం చాలా గొప్ప విషయం. 29 సంవత్సరాల క్రితం 1984 డిసెంబర్ 2 న జరిగిన భోపాల్ గ్యాస్‌లీకు ఘటన అత్యంత విషాధకరమైనది. ఇందులో వెంటనే 4 వేల మంది చనిపోగా, తరువాత రోగాలతో 30 వేల మంది చనిపోయారు. 1 లక్షా 20 వేల మంది రోగాలతో బాధపడుతున్నారు. బాధితులకు నేటికీ న్యాయం జరగలేదు. సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు లేవు. వారిపై చర్యలు తీసుకోవాలనీ, బాధితులకు న్యాయం జరగాలనీ వినోద్‌రైనా తుదివరకూ పోరాడారు.

1987లో అఖిల భారత సైన్సు ఉద్యమం ప్రారంభమైనప్పటినుండీ ఆయన అందులో కీలక నేతగా ఉన్నారు. విద్యావ్యాప్తి కోసం జీవితాంతం పోరాడారు. ఆయన గురించి వ్యాసం ప్రచురించినందుకు ధన్యవాదాలు. మిగిలిన వ్యాసాలూ బాగున్నాయి.

**తుంపాల శ్రీరామమూర్తి,**
9-9-57/2 జోగవాని పాలెం,
కొత్తగాజువాక, విశాఖపట్నం. 26

## మోడీ పాలన బండారం బయటపెట్టారు

మార్క్సిస్టు ఎడిటర్‌గారికి నమస్కారం,

ప్రస్తుతం భారత దేశ రాజకీయాల్లో బిజెపి నుండి ప్రధాని అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న నరేంద్ర మోడీ గుజరాత్‌ను చాలా అభివృద్ధి చేశారనీ, ఆయన అందరికీ ఆదర్శ ప్రాయుడనీ మీడియాలో చూస్తున్నాము. నవంబర్ నెల మార్క్సిస్టు సంచికలో 'గుజరాత్ నమూనా' అభివృద్ధిలో అథమ స్థాయి, అవినీతిలో అగ్రస్థానం అనే వ్యాసంలో ఎస్. వెంకట్రావుగారు గణాంకాలతో సహా ప్రచురించడం ద్వారా అసలు విషయాలు తెలుసుకోగలిగాము. 'కుల శక్తులు తమిళనాట తాజా పరిణామాలు' పి. సంపత్‌గారు రాసిన వ్యాసం ప్రస్తుత రాజకీయాల్లో కుల శక్తుల ప్రభావం ఎలా ఉందో, దాని వలన జరుగుతున్న అనర్థాలు చక్కగా వివరించారు. ప్రజలను చైతన్య పరచాల్సి ఉంది. ప్రజలతో మమేకమైన ప్రజా వైద్యుడు డా॥ వైఆర్‌కె జీవిన విధానం, ఆయన క్రమశిక్షణ కార్యకర్తల్లో నూతనోత్తేజాన్ని ఇస్తుంది. మన 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికను ప్రతి నెలా మొదటి వారంలోనే మండల కేంద్రాలకు అందే విధంగా పంపించినట్లయితే చందా దారుల సంఖ్య పెంచడానికి అవకాశం ఉంటుంది.

**ఉదయగిరి మల్లిఖార్జునరావు,**
కంభం, ప్రకాశం జిల్లా.

## వాతావరణ సంక్షోభంపై ప్రజాఉద్యమాలు రావాలి

పది సంవత్సరాల క్రితం అమెరికా ఉపాధ్యక్షుడు ఆల్‌గోర్ ''గ్లోబల్ వార్మింగ్''పై యుద్ధం ప్రకటించారు. పెట్రోలు, ఇతర ఆయిల్ ఇంధనాలను నీరులాగా వాడే అమెరికన్లు కాలుష్యంపై యుద్ధం చేయడం వింతైన విషయం. తరువాత ఆల్‌గోర్ ఒక చిత్రం కూడా తీయించి ఉత్తర, దక్షిణ ధృవాల్లో మంచు ఎలా కరిగిపోతోందో చూపించారు. ఆయన దీనిపై ఒక పుస్తకం కూడా రాశారు. అయితే అమెరికా ప్రభుత్వం ఆయిల్‌కోసం ఇరాక్‌పై యుద్ధం చేసిందిగానీ ఆల్‌గోర్ విజ్ఞప్తులు లెక్కచేయలేదు. వార్సా సమావేశంలో పేద దేశాలకు ఇస్తామన్న సహాయాన్ని కూడా ధనిక దేశాలు ఇవ్వలేదు. పశ్చిమ దేశాల కంటి తుడుపు చర్యల వల్ల వాతావరణ కాలుష్యం మరింత ప్రమాదకరంగా పెరిగిపోతోంది. ఇది అనేక ప్రకృతి వైపరీత్యాలను సృష్టిస్తోంది. ఈ వివరాలను మార్క్సిస్టు డిసెంబర్ సంచికలో ఎస్. వెంకట్రావు చక్కగా వివరించారు. దీనిపై తీవ్రమైన ప్రజా ఉద్యమాలు పెరగాల్సి ఉంది. ఇలాంటి రచనలు నేడు ఎంతో అవసరం.

**కాట్రగడ్డ నర్సయ్య,**
ఎస్.బి.ఐ కాలనీ,
విజయవాడ-10




# వెనిజులా ప్రత్యామ్నాయ ఆరోగ్య విధానం- విజయాలు, సమస్యలు

**ఇవాన్ రాబర్ట్‌సన్**

ఒక సమాజం నిజమైన ఆరోగ్య సంరక్షణ సాధించాలంటే ఏం చేయాలి? దీనికి సమాధానం వెనిజులా రూపొందిస్తున్న నూతన ఆరోగ్య విధానం. వెనిజులా ఒక నూతన, ప్రత్యామ్నాయ ప్రజారోగ్య సంరక్షణ విధానాన్ని తయారు చేస్తోంది. మార్కెట్ చోదక శక్తిగా నడిచే అమెరికా, సంక్షేమ రాజ్యాలుగా ఉన్న యూరప్ దేశాలకు భిన్నంగా వెనిజులాలో ఈ ప్రత్యామ్నాయం నడుస్తోంది. డాక్టర్లలకు ఇచ్చే అరుదైన శిక్షణా కార్యక్రమం ఈ విధానంలోని విశిష్టతగా చెప్ప వచ్చు.

విశేషమైన అంశం ఏమిటంటే, వెనిజులా అనుసరిస్తున్న సంపూర్ణ కమ్యూనిటీ వైద్య విధానం గురించి బయటి ప్రపంచానికి కొద్దిగా కూడా తెలియదు. కొన్ని వేల మంది ఔత్సాహికులను డాక్టర్లుగా తయారు చేయటానికి శిక్షణ ఇవ్వటం (క్యూబా పద్ధతిలో), వ్యాధి నివారణా ప్రాధాన్యత గురించి తెలపటం, ఇందులో అత్యధిక శాతం పేద, మధ్యతరగతి ప్రజల నుండి ఎంపిక చేయటం ఈ పద్ధతిలోని విశేషం. అంతర్జాతీయ సాధారణ మీడియా వర్గాలకు ఇది ఏవిధంగానూ ఆకర్షణీయమైన వార్త కాకపోవటం దురదృష్టకరం. నేరాలు–ఘోరాలకున్న ప్రాధాన్యత, ద్రవ్యోల్బణం, ఆర్థిక పరిస్థితులలో అడపాదడపా వచ్చే మార్పులకు మీడియా ఇచ్చే ప్రాధాన్యతలో కొద్ది భాగం కూడా వెనిజులాలో ప్రజలందరికీ ఉచితంగా, సంపూర్ణ ఆరోగ్య రక్షణకై ప్రతి ఇంటికీ అందుబాటులో ఉండే క్లినిక్స్ ఏర్పాటు, అందుకోసం సిద్ధం చేస్తున్న "తెల్ల కోటు ఆర్మీ" వగైరాలకు ఇవ్వకపోవడం దురదృష్టం కాక మరేమిటి?

ఏదిఏమైనా ఈ నూతన సమాజం నుంచి ఆవిర్భవిస్తున్న డాక్టర్లు ఇక ముందు, భవిష్యత్తులో కూడా వెనిజులా ఆరోగ్య రంగాన్ని విప్లవీకరించటంలో ప్రధాన భాగస్వాములు కాబోతున్నారు. ఒక వైపు ప్రపంచంలో ఆరోగ్యం, వైద్యం అందని ద్రాక్షపండ్లలా మారుతున్న నేపథ్యంలో, వైద్యం కేవలం ధనికులకే అందుబాటులో ఉన్న సరుకుగా మారుతున్న తరుణంలో, ప్రభుత్వ వైద్య–ఆరోగ్య రంగాన్ని ముక్కలు ముక్కలు చేసి ప్రైవేటు పరం కావిస్తున్న ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల పాలన ప్రపంచ వ్యాపితంగా నడుస్తున్న ఈ కాలంలో వెనిజులాలో నిర్మిస్తున్న ఈ అసాధారణ ప్రభుత్వ వైద్య–ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ తప్పనిసరిగా మొత్తం ప్రపంచానికి దిక్సూచిగా నిలబడనున్నది.

స్వతంత్రత కలిగిన మీడియాలో అభ్యుదయగాముక శక్తులు ఇప్పటికే వెనిజులా అనుసరిస్తున్న ఉచిత వైద్య–ఆరోగ్య పథకాల గురించి తెలియచెప్పి ప్రపంచానికి కళ్ళు తెరిపించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ వ్యాసం ఈ ప్రాజెక్టు తదుపరి కర్తవ్యాలను గురించీ, వేల మంది డాక్టర్లుకు క్యూబా సహాయంతో శిక్షణ ఇస్తున్న సంపూర్ణ కమ్యూనిటీ వైద్య విధానం గురించీ తెలియజేయడమే ఈ వ్యాసం ముఖ్యాద్దేశం. స్థానిక కమ్యూనిటీ క్లినిక్స్ నుండి వైద్యశాలల వరకూ వెనిజులా నూతన జాతీయ ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ విధానాన్ని అభివృద్ధి చేస్తోంది. దీనికి ఒక వెల్లువగా ముందుకొచ్చిన కమ్యూనిటీ డాక్టర్లు కృషి చేస్తున్నారు. దీనిపై వెలువడిన అనేక వ్యాసాల సారాంశం నుండీ, నూతన కమ్యూనిటీ డాక్టర్లతో నేరుగా జరిపిన సంభాషణలనుండ ఈ పరిశోధనాత్మక వ్యాసం రూపొందింది. వెనిజులా, లాటిన్ అమెరికా దేశాలలో ఆవిర్భవిస్తున్న నూతన రకమైన డాక్టర్లూ, వారి విలువలూ, నైపుణ్యత, భవిష్యత్తులో వెనిజులాకూ, మొత్తం ప్రపంచానికీ ఆరోగ్య రక్షణ అందించాలనే వారి భవిష్యత్తు కలలూ, ప్రణాళికలూ మొదలైన వాటి గురించి తెలియ చేయుట ఈ వ్యాసం లక్ష్యం.



**రచయిత జర్నలిస్టు, రచయిత. వెనిజులా డాట్ కామ్‌కు వ్యాసాలు ఇవ్వడంతోబాటు స్వంతంగా బ్లాగు నిర్వహిస్తున్నారు. వెనిజులా, లాటిన్ అమెరికా దేశాల్లో పురోగామి రాజకీయాలపై ఎక్కువగా కేంద్రీకరించి రాస్తారు.**

### కమ్యూనిటీ వైద్య విధానం పుట్టుపూర్వోత్తరాలు

సంపూర్ణ లేదా "పరిపూర్ణ కమ్యూనిటీ వైద్య విధానం" అనేది 2005లో వెనిజులా అధ్యక్షుడు హ్యూగో ఛావెజ్, క్యూబా అధ్యక్షుడు ఫైడరల్ కాస్ట్రోల మధ్య జరిగిన ఆరోగ్య ఒడంబడికతో ప్రారంభమైంది. ఈ ఒప్పందం కింద క్యూబా 30 వేల మంది వెనిజులా కమ్యూనిటీ డాక్టర్లకు శిక్షణ ఇచ్చి, వెనిజులా ప్రభుత్వ ఆరోగ్య పథకం "బారియో ఎడెంట్రో", (సమాజంలో ఒక భాగం) కార్యక్రమం నడిపేందుకు తోడ్పడుతుంది. దీనికి

> **“ గత దశాబ్ద కాలంలో వెనిజులా ఆరోగ్య సూచికల అభివృద్ధిలో ఈ పథకం కీలక పాత్ర పోషించింది. సామాజిక, ఆర్థిక పరిశోధనా కౌన్సిల్ జరిపిన సర్వే ప్రకారం 2003-2006 మధ్య స్వల్ప కాలంలోనే దేశంలో శిశు మరణాల రేటు ప్రతి వెయ్యికి 18.5 శాతం నుండి 14.2 శాతానికి తగ్గింది. ”**

బదులుగా వెనిజులా తమ దేశంలో సమృద్ధిగా లభిస్తున్న చమురును క్యూబాకు ఎగుమతి చేస్తుంది.

“బారియో ఎడెంట్రో” పథకం కింద వేలాది మంది క్యూబా వైద్యులు వెనిజులా వచ్చి, అక్కడి ప్రభుత్వ వైద్య రంగంలో పనిచేస్తారు. ఈ విధానంలో నాలుగు దశలు ఉన్నాయి. ఇందులో దేశంలో ఉన్న 7 వేల స్థానిక క్లినిక్స్ నుండి వైద్యశాల స్థాయి వరకు అందరికీ ఉచితంగా వైద్యాన్ని అందించటం ఒకటి. ఒక అంచనా ప్రకారం ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటికి ఐదు కోట్ల సార్లు ప్రజలకు వైద్యులు సేవలు అందించడం ద్వారా 14 లక్షల మంది ప్రాణాలను కాపాడగలిగారు.

గత దశాబ్ద కాలంలో వెనిజులా ఆరోగ్య సూచికల అభివృద్ధిలో ఈ పథకం కీలక పాత్ర పోషించింది. సామాజిక, ఆర్థిక పరిశోధనా కౌన్సిల్ జరిపిన సర్వే ప్రకారం 2003-2006 మధ్య స్వల్ప కాలంలోనే దేశంలో శిశు మరణాల రేటు ప్రతి వెయ్యికి 18.5 శాతం నుండి 14.2 శాతానికి తగ్గింది.

వెనిజులా ప్రజా ఆరోగ్య రక్షణ విధానాన్ని విస్తృత పరచటానికి ఈ దశాబ్ద కాలంలో పెద్ద ఎత్తున అదనంగా డాక్టర్లను చేర్చుకోవాల్సిన అవసరం వచ్చింది. ప్రతి 10 వేల మందికి 1998లో 18 మంది డాక్టర్లుండగా 2012 నాటికి వారి సంఖ్య 58కి అంటే మూడు రెట్లు పెరిగింది. అయితే స్థానికంగా అప్పటికే ఉన్న డాక్టర్ల రిక్రూట్ మెంట్లు పెరగలేదు. 2000 సంవత్సరానికి ముందు ఛావెజ్ ప్రభుత్వం ప్రజారోగ్య తరగతులను విస్తృతంగా అందించే ప్రయత్నం చేయగా, దేశంలోని ఉన్నత శ్రేణి వైద్య పాఠశాలలు అదనంగా విద్యార్థులను చేర్చుకోవటానికి సుముఖత చూపలేదు. అందులోనూ పేద వర్గాల నుండి వచ్చిన వారిని అసలు అంగీకరించలేదు. సాంప్రదాయ వైద్య విధానం నుండి వచ్చిన వారిలో ఎక్కువ శాతం యువ డాక్టర్లూ, వైద్య నిపుణులూ పట్టణ ప్రాంతాలలో ఉన్న పేదల కాలనీలకన్నా, మారుమూల గ్రామీణ ప్రాంతాలకన్నా, ఎక్కువ వేతనంతో కూడిన ఉద్యోగాలు ఉండే విలాసవంతమైన ప్రైవేటు వైద్యశాలలలో పని చేయడానికి ఇష్టపడుతున్నారు.

దీనికి ప్రత్యామ్నాయంగా ఛావెజ్ ప్రభుత్వం తన సహజ మిత్ర దేశమైన క్యూబా సహాయం కోరి, కేవలం అక్కడి నుంచి డాక్టర్లను పంపడం మాత్రమే కాకుండా, తన దేశంలో ప్రజానీకానికి ఆరోగ్య సంరక్షణ అందించడానికి తయారవుతున్న నూతన తరం డాక్టర్లందరికీ శిక్షణ ఇచ్చేలాగా ఒప్పందం చేసుకున్నారు. దీని ఫలితంగానే 2005లో జాతీయ శిక్షణా కార్యక్రమం, 'పరిపూర్ణ కమ్యూనిటీ వైద్యం' మొదలైంది. ఇందులో బారియో ఎడెంట్రో పథకంలో పనిచేస్తున్న క్యూబా డాక్టర్లే టీచర్లుగా కూడా మారి, వెనిజులా నూతన డాక్టర్లకు శిక్షణ ఇస్తూ, క్రమేణా ఈ సిబ్బంది ఆ దేశపు ప్రజారోగ్య రక్షణ వ్యవస్థను నియంత్రించేలా తయారు చేస్తారు.

2013 నాటికి ఈ ప్రణాళిక ఫలవంతమైంది. ఇప్పటికి 14 వేల మంది కమ్యూనిటీ డాక్టర్లు తయారయి స్థానిక ప్రజా క్లినిక్కుల్లోనూ, వైద్యశాలల్లోనూ పని చేస్తున్నారు. ఇందులో 8,160 మంది 2011లో ఉత్తీర్ణులవ్వగా, 6,200 మంది 2012 డిసెంబరులో ఉత్తీర్ణులయ్యారు. కమ్యూనిటీ డాక్టర్లందరూ డిగ్రీ అవ్వగానే రెండేళ్ళపాటు తప్పనిసరిగా గ్రామీణ, పట్టణ నివాస ప్రాంతాల్లో పని చేయాలి. ఈ కార్యక్రమాన్ని 2019 వరకు పొడిగించి, దాదాపు 60 వేల మందికి శిక్షణ ఇచ్చేందుకు పథకం రూపొందించారు. అలాగే, వివిధ విభాగాలలో ప్రత్యేక నైపుణ్యత సాధించేందుకు పోస్టు గ్రాడ్యూయేట్ కోర్సులను కూడా ప్రారంభించారు.

**'పరిపూర్ణ కమ్యూనిటీ వైద్యం' విధానాలు, లక్ష్యాలు**

వెనిజులా ప్రజారోగ్య సంరక్షణకు కొత్త డాక్టర్లను ఉత్పత్తి చేయటమేకాక, క్యూబాలో అమలవుతున్న వ్యాధి నివారణ ఆధారిత వైద్య విధానాన్ని వెనిజులాలో ప్రవేశపెట్టడం రెండో లక్ష్యం. ఈ 'పరిపూర్ణ కమ్యూనిటీ వైద్యం'లో విద్యార్థులకు శిక్షణా కాలం 6 సంవత్సరాలు నిర్ణయించబడినది. అదనంగా ప్రాక్టీస్ శిక్షణ కార్యక్రమం ఉంటుంది. సాంప్రదాయంగా ఉన్న వైద్య విద్యా విధానానికి భిన్నంగా, ఈ కోర్సులో మొదటి సంవత్సరం నుండే వైద్య విద్యార్థులు స్థానిక క్లినిక్స్, వైద్యశాలలలో డాక్టర్లకు చేయూతనందిస్తూ, ప్రత్యక్షముగా రోగులతో సంబంధాలు ఏర్పరచుకుంటారు. అలాగే డాక్టర్లతో ఇంటింటికి తిరిగి కమ్యూనిటీలలో పని చేస్తారు. స్టీవ్ బ్రౌవర్ అనే రచయిత ఈ 'పరిపూర్ణ కమ్యూనిటీ వైద్యం' మీద విస్తృతంగా అధ్యయనం చేశాడు. ఆయన మాటల్లో “బారియోస్‌లో విద్యార్థి వ్యాధి నివారణ ద్వారా ఆరోగ్య సంరక్షణ అందించటంలో క్యూబన్ డాక్టర్ల నైపుణ్యతను చూస్తాడు. విప్లవాత్మకమైన ఈ డాక్టర్లు తమ రోగుల విశ్వాసాన్ని ఎలా చూరగొంటారో, తత్ఫలితంగా ఆ సమాజం ఆరోగ్యవంతంగా ఎలా తయారవుతుందో చూస్తాడు. దీనికోసమే, వైద్య విద్యార్థులు తమ చివరి రెండు సంవత్సరాల విద్యలో వైద్యశాలలోను, గ్రామీణ ప్రాంతాలలోనూ పని చేయటం ద్వారా రోగులతో సంబంధాలు ఏర్పరచుకోవటమేకాక, వాస్తవ పరిస్థితులను గమనించటం ద్వారా అనుభవం గడిస్తారు.

సాంప్రదాయంగా బోధింపబడుతున్న వైద్య విద్యా విధానానికి, పరిపూర్ణ వైద్య విద్యా విధానానికి మధ్య ముఖ్యమైన వత్యాసమేమిటంటే, కమ్యూనిటీ వైద్య విద్యలోని ప్రాధాన్యాతాంశాలు ఒక క్రమ పద్ధతిలో ఏకీకృతమై ఉంటాయి. తరగతి గదులలో వివిధ వైద్య పాఠ్యాంశాలను ఒక్కొక్కటిగా ప్రవేశ పెట్టే బదులు, వాటన్నిటిని ఉన్నతమైన ప్రణాళికతో అనుసంధానం చేస్తూ శరీరశాస్త్రం నుండి వ్యాధి నిరోధక శాస్త్రం వరకు ఉమ్మడి పాఠ్యాంశాలుగా బోధించటం ప్రారంభించారు. పరిశీలకులు చెప్పేదేమిటంటే ఇటువంటి వైద్య విద్య ద్వారా విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానం మరింత మెరుగైన రీతిలో అబ్బుతుంది. మానవ దేహాన్నీ, దాని స్వాభావికశాస్త్రాన్నీ అర్థం చేసుకోవటానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. “బారియో ఎడెంట్రో”లో ఉన్న ఆరోగ్య కేంద్రాలలో తరగతులు కూడా జరుగుతాయి. విద్యార్థులను కూడా ప్రాంతాల వారీగా విడగొట్టి వివిధ పఠనా బృందాలుగా ఏర్పాటు చేసి అంశాలను

> కానీ, మితవాదులైన ప్రతిపక్ష పార్టీలూ, ప్రైవేటీకరణ మద్దతు మీడియా వర్గాలూ సాంప్రదాయంగా కొనసాగుతున్న వైద్య రంగం నిపుణులూ ఈ కార్యక్రమాన్ని తీవ్రంగా విమర్శించారు. వీరి వాదన ప్రకారం ఈ కమ్యూనిటీ వైద్యులకు పెద్ద పెద్ద వైద్యశాలలో ఉన్న ఆధునిక సౌకర్యాలపై ఎటువంటి అనుభవ పూర్వక శిక్షణా లేదన్నారు.

బోధిస్తారు.

ఇక మూడవ లక్ష్యం ఏమిటంటే, తాము ఉత్పత్తి చేసే వైద్యులు, అమెరికాలో మాదిరిగా ధనికుల మార్కెట్ వ్యాపార సంస్కృతికి భిన్నంగా, విలువలతో కూడిన వారిగా నాండేట్లు చూడ్డం. ఈ రకంగా తయారయిన కమ్యూనిటీ డాక్టర్లు సామాజిక స్పృహ కలిగిన వారుగా, ప్రజారోగ్య సంరక్షణకు కట్టుబడిన వారుగా, తమ కేంద్రీకరణంతా తమ రోగులు, కమ్యూనిటీ కేంద్రాలపైనే దృష్టి ఉండే విధంగా శిక్షణ పొందుతారు. వ్యక్తిగతంగా అధిక ధనార్జన పొందే ప్రైవేటు క్లినిక్స్‌కు దూరంగా ఉంటారు. ఈ కమ్యూనిటీ డాక్టర్ల శిక్షణా కేంద్రాలలో పాల్గొన్న ఛావెజ్, వారిని సోషలిజం వైద్యులు కమ్మని పిలుపునిచ్చారు. 2012 ఫిబ్రవరిలో బయటకు వచ్చిన నూతన కమ్యూనిటీ వైద్యులను ఉద్దేశిస్తూ ఆయన "ఒక వైద్యుడు సామాజిక నాయకుడిగా ఉండాలని, నిజమైన వైద్యుడు తన క్లినిక్‌కు నిరంతరం అందుబాటులో ఉండటమేకాదు, అవసరమైనప్పుడు తన చుట్టూ ఉన్న ప్రజల్లోకి వెళ్తూ నాండాలని" పేర్కొన్నాడు.

ఛావెజ్ యంత్రాంగం తయారు చేసిన ఉన్నత శ్రేణి విద్యా విధానంలో ఈ కమ్యూనిటీ వైద్య విధానం ఒక భాగంగా ఉంది. ఈ వైద్య విద్యలో అభ్యసించే వారందరూ ఎటువంటి ట్యూషన్ ఫీజులు చెల్లించనవసరంలేదు. వారికి ప్రభుత్వం తన దేశంలో ఉన్న కనీస వేతనాలలో 40 శాతం మేరకు భృతిని అందిస్తుంది. ఎందుకంటే ఈ విద్యార్థులలో ఎక్కువ శాతం పేద తరగతుల నుండి వచ్చిన వారే. ఈ విధానం వైద్య విద్యను ఆశిస్తున్న వేలాది మందికి ఒక సువర్ణావకాశంగా నిలబడింది. సాంప్రదాయంగా వస్తున్న వైద్య విద్య వీరికి అందుబాటులో లేకపోవడం, వారు ఖర్చు పెట్టే స్థాయి లేకపోవటం, ఈ విద్యా విధానం ముసుగులో అమలవుతున్న వర్ణ వివక్షత ఇవన్నీ కూడా ఈ పేదలను ఇన్నాళ్లూ వైద్యవిద్యకు దూరం చేశాయి. కమ్యూనిటీ వైద్య విధానం ద్వారా ఉత్తీర్ణులవుతున్న వారిలో అధిక శాతం మంది మహిళలే కావడం ఒక విశేషం. డిసెంబరు 2012లో ఉత్తీర్ణులైన వైద్యులలో 77 శాతం మంది మహిళలే.

వెనిజులా ప్రభుత్వం ఈ కమ్యూనిటీ వైద్య విద్యను కేవలం తన దేశానికే కాకుండా చుట్టూ ఉన్న లాటిన్ అమెరికన్ దేశాలకూ, ఇతర ప్రపంచానికీ అందిస్తోంది. కార్కసస్‌లో ఉన్న తన "సాల్వడార్ అలెండీ" లాటిన్ అమెరికన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ద్వారా అది ఈ పని చేస్తోంది. వీటి ద్వారా ఇప్పుడు 42 దేశాలకు చెందిన 2,200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. తమ విద్యాభ్యాసం పూర్తయిన తరువాత వీరందరూ తమ తమ దేశాలకు వెళ్ళి, ప్రభుత్వ ప్రజా ఆరోగ్య పరిరక్షణ కేంద్రాలను బలోపేతం చేసేందుకు సన్నద్ధులవుతారని ఆశిద్దాం.

### కార్యక్రమ పరిశీలన

స్లీవ్ బ్రౌవర్ అనే పాత్రికేయుడు 2010లో ఈ కార్యక్రమం గురించి రాస్తూ, ఈ వైద్యుల నాణ్యత, నిబద్ధత, సత్తా అనేవి మరికొన్ని సంవత్సరాలు వేచి చూసిన తరువాత కానీ తెలియదనీ, అప్పుడు కానీ నిర్ధారించలేమనీ పేర్కొన్నాడు. మొదటి తరం 2011 డిసెంబర్‌లో బయటకొచ్చింది. వీరు ఇప్పుడిప్పుడే ప్రజారోగ్య కమ్యూనిటీ కేంద్రాలలో పని చేయటం ఆరంభించారు.

కానీ, బ్రౌవర్ ఈ కమ్యూనిటీ వైద్య విధానంపై నిరంతరం పరిశోధన చేస్తున్నాడు కాబట్టి, ఈ విద్యా విధానం ఫలితాలపై సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. 'బారియో ఎడెంట్రో' కార్యక్రమం పని తీరును గమనించిన ఆయన... తొలి దశలో ఈ కార్యక్రమంలో వచ్చిన చిన్న చిన్న లోపాలను దీన్ని నిర్వహించే కమిటీ ఎప్పటికప్పుడు గమనిస్తూ, నిరంతరం మార్పులు చేస్తూ ఈ కార్యక్రమాన్ని మరింత పటిష్టం చేసిందని తెలిపాడు. దీని ప్రభావం 2006 నుండి 2008 మధ్య ఉత్తీర్ణులైన విద్యార్థుల్లో స్పష్టంగా కనిపించిందని పేర్కొన్నాడు. క్యూబా, వెనిజులాలోని వైద్య విధ్యా పరిశోధకులు ఈ కార్యక్రమం సరైన దిశలో పయనిస్తోందని తెలిపారు.

ప్రభుత్వానికి సంబంధించిన మంత్రులు కూడా దీనిమీద సానుకూల అభిప్రాయాలు తెలిపారు. ఫిబ్రవరి 2012లో జరిగిన మొట్టమొదటి బ్యాచ్ వైద్యులతో మాట్లాడుతూ అధ్యక్షుడు హ్యూగో ఛావెజ్ నా దగ్గర ఉన్న మొదటి రిపోర్టు ప్రకారం "మీరు అసామాన్యమైన రీతిలో పని చేస్తున్నారని తెలిసింది. మీరు ప్రజలకు మంచి సేవలను అందిస్తున్నారని" పేర్కొన్నాడు. ఉన్నత విద్యాశాఖామంత్రులైన యదిరా కార్డోవో మాట్లాడుతూ కమ్యూనిటీ డాక్టర్లు ఈ సమాజం జన్మనిచ్చిన అద్భుతమైన వైద్యులు అని తెలిపారు.

కానీ, మితవాదులైన ప్రతిపక్ష పార్టీలూ, ప్రైవేటీకరణ మద్దతు మీడియా వర్గాలూ సాంప్రదాయంగా కొనసాగుతున్న వైద్య రంగం నిపుణులూ ఈ కార్యక్రమాన్ని తీవ్రంగా విమర్శించారు. వీరి వాదన ప్రకారం ఈ కమ్యూనిటీ వైద్యులకు పెద్ద పెద్ద వైద్యశాలలో ఉన్న ఆధునిక సౌకర్యాలపై ఎటువంటి అనుభవ పూర్వక శిక్షణా లేదన్నారు. ఈ సాంప్రదాయ వైద్యుల ప్రతినిధి సంస్థ అయిన జాతీయ వైద్య విద్యా అకాడమీ, తన 2012 రిపోర్టులో 'వైద్యశాలలలో ప్రవేశం పొందుతున్న 'కమ్యూనిటీ డాక్టర్ల ప్రతిభ చాలా నాసిరకంగా ఉందని' రాశారు. అద్భుతంగా ఉందని ఒక్కరు కూడా పేర్కొనలేదని రాశారు. అంతే కాదు ఆ రిపోర్టు అంతిమంగా 'పరిపూర్ణ కమ్యూనిటీ వైద్య' కార్యక్రమమే ఒక మోసపూరిత కార్యక్రమమని విమర్శించారు. అక్కడితో ఆగకుండా జాతీయ అకాడమీ ఈ కమ్యూనిటీ డాక్టర్లను ప్రజా వైద్య విభాగంలోకి రావటానికి కూడా అభ్యంతరం తెలిపింది. మితవాద పత్రికలకు అగ్రభాగాన నిలిచే "ఎల్ యూనివర్సల్" పత్రికకు అక్టోబరు 2011న ఇచ్చిన ఇంటర్వ్యూలో జాతీయ అకాడమీ అధ్యక్షుడైన క్లాడియో అపున్ సౌలీ ఈ కమ్యూనిటీ వైద్య విధానంపై తీవ్రమైన విమర్శలు గుప్పించారు. కాని ఆయన చేసిన ఆరోపణలన్నీ దాదాపుగా నిరాధారమని తేలాయి. ఉదాహరణకు ఈ కమ్యూనిటీ వైద్య విద్య ద్వారా వచ్చిన వైద్యులకు వెనిజులా ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్న సూక్ష్మ జీవుల మీద అవగాహన లేదనీ, వారెన్నడూ శస్త్ర చికిత్సలు కానీ, ప్రసవాలు కానీ చేయలేదనీ, అలాగే యాక్సిడెంట్ కేసులు చేపట్టలేదనీ వాదించారు. ఈ అకాడమీ శ్రేణులు ఇటువంటి కమ్యూనిటీ వైద్యులను ఆరోగ్య

> **‘పరిపూర్ణ కమ్యూనిటీ వైద్యం’ మద్దతుదారులు మాత్రం ‘ఈ ప్రచారం కేవలం ప్రభుత్వ కార్యక్రమం మీద దాడి మాత్రమే కాదనీ, దాని లక్ష్యం వేరేగా ఉందనీ’ అంచనా వేశారు. మార్కెట్ ఆధారిత వైద్య విధాన మద్దతుదారుల, ధనిక వర్గాల ప్రత్యేక సౌకర్యాలపై దెబ్బ పడుతుందనే భయంతో ఈ ప్రచారం జరుగుతోందని తెలిపారు.**

రంగంలోకి వదిలితే ప్రతి క్షణం, క్షణ క్షణం వైద్య రంగంపై ఆరోపణలు వెల్లువెత్తుతాయని భయపెట్టారు.

డిసెంబరు 2011లో మొట్టమొదటి వైద్యుల బృందం కమ్యూనిటీ వైద్య విధానం ద్వారా బయటకొచ్చే సమయానికే ఈ కార్యక్రమంపై దుష్ప్రచారాలు ఊపందుకున్నాయి. ఇంటర్నెట్ బ్లాగ్సలో, ఆన్‌లైన్ జోక్సల ద్వారా ఈ వైద్యులను నపుంసకులుగా, అసమర్ధులుగా చిత్రీకరించడం జరిగింది. పూర్తి అవాస్తవాలు, అసత్యాలు కూడా ప్రచారం చేశారు. వెనిజులా పత్రిక “ఎల్‌టెండో 2012లో ఇచ్చిన ఇంటర్వ్యూలో అంజోనుటీగ్ రాష్ట్ర వైద్యుల కళాశాలల అధ్యక్షుడు, యాస్‌డన్‌బల్ గోంజలెజ్ మాట్లాడుతూ వెనిజులాలో ఉన్న క్యూబన్ వైద్యుల వ్యాధి నిర్ధారణలలో 60 నుండి 70 శాతం తప్పులతడకలేననీ, వాళ్ళు ఈ కమ్యూనిటీ వైద్యులకు ఎందుకు శిక్షణ ఇస్తున్నారో అర్ధం కావడం లేదనీ, ఎందుకంటే అది తప్పనిసరిగా వారిని వైద్యులుగా మాత్రం చేయటానికి కాదనీ” విమర్శించారు. ఈ ప్రచారం వల్ల ప్రజలలో కూడా ఈ కమ్యూనిటీ వైద్య విధానంపై అపోహలు నెలకొన్నాయి.

‘పరిపూర్ణ కమ్యూనిటీ వైద్యం’ మద్దతుదారులు మాత్రం ‘ఈ ప్రచారం కేవలం ప్రభుత్వ కార్యక్రమం మీద దాడి మాత్రమే కాదనీ, దాని లక్ష్యం వేరేగా ఉందనీ’ అంచనా వేశారు. మార్కెట్ ఆధారిత వైద్య విధాన మద్దతుదారుల, ధనిక వర్గాల ప్రత్యేక సౌకర్యాలపై దెబ్బ పడుతుందనే భయంతో ఈ ప్రచారం జరుగుతోందని తెలిపారు.

సాంప్రదాయంగా వస్తున్న వైద్య రంగానికి ఈ కమ్యూనిటీ వైద్యం ద్వారా వస్తున్న వేలాది మంది వైద్యులు, తమతోపాటు ప్రభుత్వ వైద్యశాలలో పని చేయటం, ఒక కొత్త సామాజిక, రాజకీయ తరగతులతో తలపడుతున్నట్లుంది. వీరిలో కొంత మందికి, ఈ కమ్యూనిటీ డాక్టర్ల వలన ఉన్నత విద్యా కోర్సులలో, (పోస్టు గ్రాడ్యుయేట్) ఉద్యోగాలలో, భవిష్యత్తులో పోటీగా వస్తారని భయాందోళనలు పెరిగి, వారి పట్ల మరింత వ్యతిరేకతను పెంచుకుంటున్నారు.

వీరి ఆలోచనలు, ప్రచారాలు అన్నీ అబద్ధమనీ, జాతీయ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. జాతీయ వైద్య అకాడమీ అధ్యక్షుడు ప్రకటించినట్లు “నిమిష నిమిషానికీ తప్పులు జరుగుతాయి” అనేది అసంబద్ధమనీ, ఇప్పటికి 6 నెలల నుంచి దేశ వ్యాప్తంగా ఒక్క ఆరోపణా ఈ డాక్టర్ల మీద నమోదు కాలేదనీ తెలిపారు. ‘పరిపూర్ణ కమ్యూనిటీ వైద్యం’, స్థాపించిన నాటి నుండి నేటి వరకూ నిరంతరం మార్పులు చేసుకుంటూ, ముందుకు వెళుతోందనీ, ఈ మధ్య కాలంలో వైద్య విద్యార్థులకు ఆఖరి రెండు సంవత్సరాల సమయంలో ప్రత్యేక శిక్షకులతో (స్పెషలిస్ట్) వర్క్‌షాపులు నిర్వహిస్తున్నామనీ, మెరుగైన బోధనా పద్ధతులు, పరికరాలను అందచేస్తున్నామనీ, 3వ సంవత్సరం నుండే వైద్య శాలలకు అనుసంధానం చేసే ప్రయోగాత్మక విద్యను అందచేస్తున్నామనీ పేర్కొన్నారు.

ఫ్రెంచ్ పాత్రికేయుడు జీన్ అరౌడ్ ‘2003లో ఏ విధంగానైతే క్యూబా వైద్యుల మీద దుష్ప్రచారం చేశారో ఇప్పుడూ అలాగే చేస్తున్నారు. కాని వారు విఫలమవుతారు’ అని పేర్కొన్నాడు. 2003లో క్యూబా డాక్టర్లను గూఢాచారులుగా, వైద్య నపుంసకులుగా ప్రచారం చేశారు. కానీ కమ్యూనిటీ వైద్య విద్యలో చేరే విద్యార్థులుకానీ, ప్రజలు కానీ ఈ ప్రచారాన్ని నమ్మటం లేదని, పైగా వారు వెనిజులా సమాజానికి వైద్యులను తయారు చేయటం కోసం కంకణం కట్టుకున్న వారనీ, మొత్తం వెనిజులా సమాజాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దటానికి వచ్చినవారనీ ప్రశంశిస్తున్నారు.

**ముగింపు**

వెనిజులా ప్రభుత్వం ఈ రకమైన వైద్య విద్యా విధానం కింది స్థాయి సామాజిక తరగతుల నుండి ప్రారంభించి, వేల మందిని వైద్యులుగా తయారు చేయాలని సంకల్పించటం నిజంగా ఒక పెద్ద సాహసోపేత కార్యక్రమం. నేడు దాని ఫలితాలు దేశం నలుమూలలా వ్యాపించే దశలో సాగుతోంది. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం తత్సంబంధిత వివరాలు, సర్వేల సారాంశం ప్రకారం, వెనిజులా కమ్యూనిటీ వైద్యులలో అత్యధిక శాతం, మానవీయతతో, నిబద్ధతతో, మెరుగైన శిక్షణా నైపుణ్యంతో సేవలనందిస్తున్నారని తేలింది. నేడు అందుతున్నటువంటి ఆధారాల ఫలితంగా, సాంప్రదాయ వైద్య రంగం అనివార్యంగా ఈనాడు కమ్యూనిటీ వైద్యులను తమ సహచరులుగానూ, తమ కన్నా మెరుగైన నైపుణ్యం కల వారుగానూ అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ కమ్యూనిటీ వైద్య కార్యక్రమంపై తాము జరిపిన దుష్ప్రచారం కేవలం అన్యాయమే కాదని, అది తమ దారుణమైన మానసిక దౌర్భల్యానికి పరాకాష్ట అని అంగీకరిస్తున్నారు. సాంప్రదాయ వైద్య రంగానికి ఎదురైన మరో షాక్ ఏమిటంటే ఈ మధ్య కాలంలో జరిగిన పోస్టుగ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ పరీక్షలలో నలుగురు కమ్యూనిటీ వైద్యులలో ముగ్గురికి చోటు దక్కగా దాదాపు 200 మంది సాంప్రదాయ వైద్య విద్యార్థుల్లో ఒకరికి కూడా ప్రవేశం దొరకలేదు.

2019 నాటికి, ఇటువంటి కమ్యూనిటీ వైద్యులు 60 వేల మంది తయారయి వెనిజులాలోని ఉచిత ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రాలలో పని చేస్తారు. ఒక్క చమురు ఉత్పత్తుల ఆదాయం మినహాయించి, అనేక ఇతర సమస్యలు, ఒడిదుడుకుల మధ్యలో ఇప్పటికీ మూడవ ప్రపంచ దేశంగానే గుర్తింపు ఉన్న వెనిజులా తన మానవ వనరులను ఈ రకంగా వినియోగించటం అద్భుతం. ప్రజారోగ్యానికి వచ్చే సరికి తమ వద్ద వనరుల కొరత ఉందనీ, అందువల్లనే ప్రైవేటు రంగం ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనాలనీ చెప్పే అన్ని దేశాల పాలకవర్గాలకూ ఇది చెంపపెట్టు కానుంది. బహుశా అందుకేనేమో అంతర్జాతీయ మీడియా, వెనిజులా ‘పరిపూర్ణ కమ్యూనిటీ వైద్య కార్యక్రమాన్ని’ చూసినా చూడనట్లుగా నటిస్తోంది. దాన్ని పూర్తిగా విస్మరిస్తోంది.

ఎక్కడైతే రాజకీయ నిబద్ధత, చేయాలనే పట్టుదల ఉంటుందో అక్కడ ప్రజలందరికీ ఉచితంగా వైద్య ఆరోగ్య ప్రమాణాలన్నీ అందించటం కష్టమేమీ కాదనీ, ఆ ప్రజలకు కావలసిన వైద్యులను కూడా అక్కడే తయారుచేసి, మానవత్వంతో, నైపుణ్యంతో, ప్రజా సేవ చేయవచ్చనీ వెనిజులాలో హ్యూగో ఛావెజ్ స్వప్నమైన ‘కమ్యూనిటీ వైద్య విద్యా కార్యక్రమం’ ప్రపంచానికి రుజువు చేసింది. **(అనువాదం:ఎల్.ఎస్. భారవి)**

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

# రాష్ట్ర రాజకీయ పరిస్థితులు మరింత స్పష్టమైన తరువాతనే సర్దుబాట్లు/స్వతంత్ర పోటీపై నిర్ణయం

కామ్రేడ్ రాఘవులుగారికి, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మన పార్టీ ఎవరితో పొత్తు పెట్టుకోనున్నది? ప్రభుత్వ రంగ, సహకార సంస్థల కార్మికుల, చిరుద్యోగుల పొట్టగొట్టి రోజువారీ కూలీలుగా మార్చిన చంద్రబాబునాయుడుతోనా, లేక అవినీతి ఆరోపణల్లో నిండా మునిగిన జగన్‌తోనా. లేక మొన్న జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన భారతీయ జనతా పార్టీతోనా తెలుపగలరు. లేక సొంతంగా మన అభ్యర్థులను నిలుపుతారా తెలియజేయగలరు. 2014లో జరిగే ఎన్నికల్లో మన పంథా ఏమిటి?

**అనదాసు సత్యనారాయణ,**
రాష్ట్ర నీటిపారుదల సంస్థ
కార్మికుల మాజీ నాయకుడు,
పెద్దాపురం, తూర్పుగోదావరి జిల్లా.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటీ ఇప్పటికే 2014లో జరిగే పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన ఎన్నికల ఎత్తుగడల గురించి, చేయాల్సిన సన్నాహాల గురించి చర్చించి కొన్ని నిర్ణయాలు చేసింది.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపిలను ఓడించడం ప్రధాన లక్ష్యంగా పార్టీ పెట్టుకున్నది. ఇందుకోసం అవసరమైన లౌకిక ప్రతిపక్ష శక్తులను ఎక్కడ సాధ్యమైతే అక్కడ సమీకరించి కృషి చేయాలని నిర్ణయించింది. ఏర్పడబోయే పార్లమెంటులో వామపక్షాల సంఖ్యా బలాన్ని పెంచుకోవడం ముఖ్య కర్తవ్యంగా నిర్ణయించింది. పై లక్ష్యాలను సాధించేందుకు రాష్ట్రాల వారీగా నిర్దిష్ట రాజకీయ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పోటీల గురించి, సర్దుబాట్ల గురించి ఆలోచించుకోవాలని రాష్ట్ర కమిటీలకు నిర్దేశించింది. ఇందుకనుగుణంగా ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఎన్నికల ఎత్తుగడల గురించి చర్చించి, కేంద్ర కమిటీ ఆమోదంతో పార్టీ కమిటీలు అవగాహనకు వచ్చాయి. మన రాష్ట్రంలో రాజకీయ అనిశ్చిత పరిస్థితి కారణంగా స్పష్టమైన రూపంలో ఎన్నికల ఎత్తుగడలను నిర్ణయించుకోవడం ఇప్పుడే సాధ్యం కాదని భావించాం. అందువలన రాష్ట్రంలో పొత్తులు, సర్దుబాట్ల గురించి కేంద్ర కమిటీగాని, రాష్ట్ర కమిటీగాని ఇప్పటి వరకు చర్చించలేదు. నిర్ణయాలు చేయలేదు.

మన రాష్ట్రానికి వస్తే అధికార కాంగ్రెస్ పార్టీని ఓడించటం, ప్రస్తుతం బలమైన శక్తిగా బిజెపి లేకపోయినా అది బలం పుంజుకోకుండా చూడటం మన ఎన్నికల ఎత్తుగడల్లో కీలకమైన అంశం.

కాంగ్రెస్, బిజెపిలు కాకుండా మన రాష్ట్రంలో వామపక్ష పార్టీలు, ప్రాంతీయ పార్టీలు అనేకం ఉన్నాయి. మన పార్టీ రాజకీయ విధానంలో భాగంగా లౌకిక ప్రతిపక్ష ప్రాంతీయ పార్టీలతో సర్దుబాటు చేసుకోవడానికి ఎటువంటి విధానపరమైన ఆటంకం లేదు. సర్దుబాటు చేసుకుంటేనే లాభం అనుకుంటే ఆ పార్టీలతో సర్దుబాటుకు రావచ్చు. స్వతంత్రంగానే ఉంటే పార్టీకి, ప్రజా ఉద్యమానికి లాభం అనుకుంటే స్వంతంత్రంగానూ పోటీ చేయవచ్చు. ఇది ఆయా పరిస్థితుల అంచనాపై ఆధారపడి ఉంటుంది. మన రాష్ట్రానికి సంబంధించి రాజకీయ పరిస్థితులు మరి కొంత స్పష్టమైన తరువాత సర్దుబాట్లు చేసుకోవడమా? స్వతంత్రంగా పోటీ చేయడమా? అనేది నిర్ణయం అవుతుంది. సర్దుబాట్లు చేసుకోవాలి అని అనుకుంటే అప్పుడు తెలుగుదేశంతోనా? వైఎస్ఆర్ పార్టీతోనా?, మరో పార్టీతోనా, వామపక్షాలతో మాత్రమేనా అనేది పరిశీలనకు వస్తుంది. వీటి గురించి రాష్ట్ర కమిటీ, కేంద్ర కమిటీలు చర్చించకుండా చెప్పడమంటే వ్యక్తిగత ఊహాగానాలు మాత్రమే అవుతాయి. అటువంటి ఊహాగానాలు చేయడం పార్టీ నాయకులకు సముచితం కాదు.

**బి.వి. రాఘవులుగారికి, నేను క్రమం తప్పకుండా మార్క్సిస్టు చదువుతాను. పార్టీకి వీరాభిమానిని. ఈ క్రింది ప్రశ్నలకు మీ నుంచి సమాధానాలు ఆశిస్తున్నాను.**

**– సిపిఐ(ఎం) ఇంకా పూర్తి స్థాయి విప్లవ పార్టీగా మారలేదని మీరు రాసిన ఒక వ్యాసంలో చదివాను. మరి ఆ ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుంది? ప్రస్తుతం ఏ దశలో ఉంది?**

**– పొత్తుల వల్ల పార్టీ నష్టపోతోందని ఖమ్మం మహాసభ అభిప్రాయపడినట్లు వార్తలు వచ్చాయి. మరి 2014 ఎన్నికల్లో సర్దుబాట్లు ఉండవని ఎందుకు చెప్పట్లేదు? ఒకప్పుడు బూర్జువా పార్టీలపైనా, నాయకులపైనా ప్రజలకు ఎంతో కొంత అభిమానం, నమ్మకం ఉండేవి. నేడవి లేవు. మారిన ఈ పరిస్థితుల్లో మనం వారితో ఎటువంటి పొత్తులు లేకుండా సొంత ఎజెండాతో వెళ్లడం శ్రేయస్కరం కాదా?**

**– కాంగ్రెస్ సిబ్ల్యుసి తెలంగాణా ఇవ్వడానికి నిర్ణయించినప్పుడు (జులై 29న) మీరు స్వాగతిస్తున్నామన్నారు. సమైక్యానికి కట్టుబడ్డ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా విభజన నిర్ణయాన్ని కనీసం నిరసించకుండా ఎలా స్వాగతిస్తారు?**

**సి. వంశీకృష్ణ,**
నెం.204, శ్రీజగన్నాథ ప్లాజా,
దాసన్నపేట, విజయనగరం - 535002

అ) ఖమ్మం పార్టీ మహాసభలో సుదీర్ఘకాలం నుండి బూర్జువా పార్టీలతో రాష్ట్రంలో ఎన్నికల సర్దుబాట్ల వలన వచ్చిన అనుభవాల గురించి చర్చ జరిగింది. ఈ సర్దుబాట్ల వలన మొత్తం మీద లాభం కన్నా నష్టం జరుగుతున్నదనే నిర్ధారణకు రావడం జరిగింది. పార్టీ అఖిలభారత స్థాయిలో కూడా 2002 సంవత్సరంలో బూర్జువా పార్టీలతో సర్దుబాట్ల వలన వచ్చిన అనుభవాల గురించి చర్చించి కొన్ని నిర్ధారణలకు రావడం జరిగింది.

అటు అఖిలభారత స్థాయిలోను, ఇటు రాష్ట్ర స్థాయిలోను వచ్చిన అనుభవాలను పరిశీలిస్తే

1. గుత్తపెట్టుబడిదారీ పాలకవర్గ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా ప్రాంతీయ బూర్జువా వర్గాలకు ప్రాతినధ్యం వహించే ప్రాంతీయ పార్టీలతో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సర్దుబాట్లు చేసుకోవడం సరైనదయినప్పటికీ

---

**‘మార్క్సిస్టు’కు**
**మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి.

మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**
‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ–2

వాటితో నిరంతరంగా, శాశ్వతంగా పెనవేసు కుపోయే పద్ధతిలో సర్దుబాట్లు, పొత్తులు చేసు కుంటే నష్టం జరుగుతుంది. కమ్యూనిస్టు పార్టీగా స్వతంత్రతను కాపాడుకుంటూ, ప్రజా రాద్యమా లకు, వామపక్ష ఉద్యమానికి లాభం జరుగుతుం దనుకున్నపుడే ఐక్య కార్యాచరణగాని, ఎన్నికల సర్దుబాట్లుగాని ఉండాలి.

2. కమ్యూనిస్టు పార్టీలు శాశ్వతంగా, ఎవరితోను పొత్తులు, సర్దుబాట్లు లేకుండా వుండాలనుకోవడం సరైందికాదు. అలాగే ఎల్ల ప్పుడు సర్దుబాట్లు చేసుకోవాలనేది కూడా సరైందికాదు. పార్టీ, ప్రజాఉద్యమ ప్రయోజనాన్ని బట్టి, సందర్భానుసారం నిర్ణయించుకోవాలి.

3. దీనికి భిన్నంగా జరిగినందునే సర్దుబాట్ల వలన లాభం పొందడం కన్నా ఇబ్బందులను ఎదుర్కొన్నాం. ఇప్పుడు ఆ లోపాలను అధిగ మించే ప్రయత్నం చేస్తున్నాం. స్వతంత్రతను కాపాడుకుంటూ ప్రజా ఉద్యమానికి అవసరమై నపుడు మాత్రమే సర్దుబాట్లకు సిద్ధమవుతున్నాం.

ఆ) భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వ యించుకొని విప్లవకర కార్యక్రమాన్ని రూపొం దించుకొని, విప్లవకర నిర్మాణం ప్రాతిపదికన పార్టీని నిర్మించే ప్రయత్నం చేస్తున్న పార్టీగా మార్క్సిస్టు పార్టీ ఉన్నది. చుట్టూ సమాజంలో ఉన్న ధోరణుల ప్రభావం మూలంగా అన్యవర్గ ధోరణులు ఏ విప్లవ పార్టీలోకయినా ప్రవేశించే అవకాశం ఎప్పుడూ పొంచి ఉంటుంది. దానికి మార్క్సిస్టు పార్టీ అతీతమేమీ కాదు. అందుకే మార్క్సిస్టు పార్టీ దిద్దుబాటు కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తూ ఉన్నది. ఈ పనిని ఎప్పుడు విస్మరిస్తే అప్పుడే పార్టీ పదును కోల్పోతుంది. పార్టీలో ప్రవేశించిన తప్పుడు ధోరణులను గుర్తించి దిద్దుబాటు ఉద్యమాన్ని నిరంతరం పార్టీ సాగిస్తూ ఉన్నది.

ఇ) కాంగ్రెస్ సిడబ్ల్యుసి తెలంగాణా ఇవ్వ డాన్ని మార్క్సిస్టు పార్టీ స్వాగతించిందనడం అవాస్తవం. మార్క్సిస్టు పార్టీ ఏనాడూ రాష్ట్ర విభజనను అంగీకరించలేదు. స్పష్టంగా రాష్ట్రం సమైక్యంగా ఉండాలని అన్ని సందర్భాల్లోనూ చెప్పింది. కాంగ్రెస్ పార్టీ విభజన-సమైక్యతా సమస్య గురించి స్పష్టమైన వైఖరిని ప్రకటించ కుండా అయోమయం సృష్టించడాన్ని ఖండించి తన వైఖరిని స్పష్టం చేయాలని మొదటి నుండి డిమాండు చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తన వైఖరిని స్పష్టం చేస్తూ తెలంగాణా ఇస్తున్నామని ప్రకటించినపుడు కాంగ్రెస్ పార్టీ ఒక స్పష్టమైన నిర్ణయం చేయ డాన్ని ఆహ్వానించాం తప్ప, విభజన నిర్ణయాన్ని కాదు.

**కామ్రేడ్, ఇటీవల జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో దేశ రాజధాని ఢిల్లీలో ఓటర్లు ఆమ్ ఆద్మీ పార్టీ పెద్ద శక్తిగా వచ్చి, కాంగ్రెస్ సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నది. కొత్త ఓటర్లు, యువ ఓటర్లు ఆ పార్టీకి పట్టం కట్టినట్లు కనిపిస్తున్నది. నిన్నగాక మొన్న వచ్చిన ఆ పార్టీ ప్రజలను ఆకర్షిం చింది. కానీ 90 ఏళ్లకు పైగా ప్రజల్లో పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీలకు ప్రజలు, ముఖ్యంగా యువకు లు ఎందుకు మద్దతు ఇవ్వడం లేదు. మన విధానాల్లో లోపమా, లేక మన పార్టీ క్యాదరు ప్రజల్లోకి వెళ్లి పనిచేయడంలో లోపమా? చెప్పగలరు.**

**బి. శివశంకరం,** శాంతినగర్,
భద్రాచలం, ఖమ్మం జిల్లా.

ఢిల్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ మంచి విజయాన్ని సాధించింది. అందుకు దాన్ని మన మందరం ప్రశంసించాలి. దేశ పరిపాలనా కేంద్రమైన ఢిల్లీలో రెండు గుత్తపెట్టుబడిదారీ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలను పక్కకు నెట్టి, ఏర్పడి సంవత్సరం కూడా తిరగని పార్టీ విజ యాలు సాధించడం గుర్తించాల్సిన విషయం. పేదలు, యువకులు భారీగా దానికి ఓట్లు వేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజల నిత్య జీవితా ల్లో ఎదుర్కొనే ఇబ్బందులను పరిష్కరించేందుకు చేసిన వాగ్దానాలు, నినాదాలు ప్రజలను ఆకట్టు కున్నాయి. డబ్బు, కులం, మతం ప్రలోభాలు లేకుండా ఎన్నికల్లో గెలవడం అందరికీ ఆశ్చ ర్యం కల్గించిన విషయం. హంగూ ఆర్భాటాలు లేకుండా ప్రజలను కలుసుకునే పద్ధతులను అనుసరించడం కూడా ఒక విశేషం.

కాంగ్రెస్, బిజెపిల విధానాలతో ప్రజలెంత విసిగిపోయారో ప్రత్యామ్నాయ శక్తుల కోసం ఎంత ఎదురు చూస్తున్నారో ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రత్యామ్నాయ శక్తి ఉ ందనుకుంటే డబ్బు, కులం, మతం ఇతర ప్రలోభాలను కూడా కాదని ప్రజలు ఆదరిస్తా రనేది విదితమవుతుంది. ప్రజల విజ్ఞత మీద విశ్వాసం పండితులకు, రాజకీయ నాయకులకు ఆమ్ ఆద్మీ విజయం కనువిప్పు కలిగిస్తుంది.

అయితే ఏదైనా పార్టీ ఎన్నికల్లో విజయం సాధించడం ఒక ఎత్తు. ఆ పార్టీ చేసిన వాగ్దా నాలను అమలు జరుపుతూ పరిపాలన చేయడం మరో ఎత్తు. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారాన్ని చేపట్టింది. పరిపాలన కూడా ప్రజలు ఆశించి నట్టుగా నిర్వహించి ప్రత్యామ్నాయ శక్తుల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ పెంపొం దించగలదని అందరూ ఆశిస్తున్నారు. అయితే ఆమ్ ఆద్మీ పార్టీ అధిగమించాల్సిన ఆటంకాలు చాలానే ఉన్నాయి. నక్కజిత్తుల కాంగ్రెస్ మద్దతు పై ఆధారపడాల్సి రావడం మొదటి ఆటంకం. తిష్టవేసిన బ్యూరోక్రసీ, అడుగడుగునా ఆటం కాలు కల్పించే కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలు, ఆమ్ ఆద్మీ పార్టీకి క్రమశిక్షణ కలిగిన నిర్మాణం ఇంకా ఏర్పడకపోవడం మరికొన్ని ఆటంకాలు. వీటిని అధిగమించేందుకు సరిపోయిన ఆలో చనలు ఆమ్ ఆద్మీ పార్టీ చేయాల్సి ఉంటుంది.

ఆమ్ ఆద్మీ పార్టీ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో అఖిలభారత స్థాయిలో కూడా రంగంలోకి దిగాలని ఆలోచిస్తున్నది. ఢిల్లీలో సాధించిన విజయాలే అఖిలభారత స్థాయిలో కూడా సాధిస్తే అద్భుతమైన విజయంగానే భావించాల్సి రాం టుంది. ఎంతో వైవిధ్యం కలి గిన దేశంలో ప్రధానంగా పట్టణ ప్రాంతమైన ఢిల్లీలో జయప్రదం అయిన ప్రయోగం దేశ స్థాయిలో ఏమేరకు జయప్రదం అవుతుందో వేచి చూడాలి.

అఖిల భారత స్థాయిలో స్పష్టమైన విధాన ప్రాతిపదికలేర్పాటు చేసుకోవాల్సిన అనేక అంశాలు ఆ పార్టీకి ఉన్నాయి. ఒక్క అవినీతి విషయంలో జన్‌లోక్‌పాల్ బిల్లు కావాలని ఆమ్ ఆద్మీ పార్టీ గట్టిగా ఉన్నది. లౌకికవాదం, ఫెడర లిజం, అలీన విధానం వంటి అంశాలపై స్పష్ట మైన ఆలోచనలను ఆమ్ ఆద్మీ పార్టీ ఇంకా ప్రకటించాల్సి ఉంది. వామపక్ష పార్టీల పట్ల సానుకూల వైఖరిని తీసుకొని కలిసి పని చేయడానికి సిద్ధం కావడం అఖిలభారత స్థాయి లో ఒక ప్రత్యామ్నాయ శక్తిని సృష్టించడానికి ఉ పయోగపడుతుంది. లేని యెడల ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావం భారత రాజకీయాల్లో ఒక మెరుపులాగా మిగిలిపోయే ప్రమాదం రాంటుంది.

కమ్యూనిస్టు పార్టీ వర్గ దృక్పథం నుండి పని చేస్తుంది. దోపిడీని అంతం చేసి సమసమా జాన్ని సాధించాలన్న లక్ష్యంతో పని చేస్తుంది. తమ దోపిడీ పాలన అంతం కావడానికి పాలక వర్గాలు ప్రతిఘటన లేకుండా అంగీకరిస్తాయని అనుకోలేం. అందుకే ఈ లక్ష్య సాధన కోసం జరిపే పోరాటం సుదీర్ఘంగా ఉంటుంది. అందు వలన కమ్యూనిస్టు పార్టీ తక్షణం ఫలితాలను సాధించలేకపోవడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ఫలితాలను సాధించడాన్ని పోలిక చేసుకోవడం సహేతుకంగా ఉండదు. ఆమ్ ఆద్మీ పార్టీకి స్పష్ట మైన వర్గ దృక్పథం ఉందని చెప్పలేం. అన్ని అంశాల మీద సమగ్రమైన విధానం ఉందని కూడా భావించలేం. ఇటువంటి శక్తులను భారత పాలక వర్గాలు రకరకాల పద్ధతుల్లో క్రమేణా బలహీనం చేసి కో ఆప్ట్ చేసుకునే అవకాశం ఉ ంది. అటువంటి కో ఆప్షన్‌కు అవకాశం లేకుండా స్వతంత్ర శక్తిగా ఆమ్ ఆద్మీ పార్టీ నిలబడినప్పుడే ప్రస్తుత విజయం నికరమైన ప్రజల విజయంగా నిలబడుతుంది. లేకపోతే ఒక యాధృచ్ఛిక ఘటనగా మిగిలిపోతుంది. ●

# నెల్సన్ మండేలా

**(2వ పేజీతరువాయి)**

అట్టుడుకుతున్న విషయం గమనించాను. ఒక రోజు పొద్దున్నే లేచి పత్రికలు తిరగేసినప్పుడు టెలిఫోన్ వైర్ల కత్తిరింపు, విద్యుత్ పైలాన్స్ పేల్చివేత పత్రికల నిండా ఇవే వార్తలు కనిపించాయి. అయినా ఈ ప్రభుత్వంలో కొంచెం కూడా చలనం కూడా లేదు. ఇది క్రిమినల్స్ పనేనని ప్రభుత్వం అసత్య ప్రచారం గావించింది. ఎఎన్‌సి అనుబంధ సంస్థ అయిన ఉంఖోంటో వి సిజ్వె విజృంభణతో జాతి దుర్హంకార శక్తుల వెన్నులో వణుకు పుట్టింది. పారిశ్రామిక రంగానికి గుండెకాయ లాంటి జొహాన్నెస్ బర్గ్, పోర్టు ఎలిజబెత్, దర్బన్ పట్టణాలు  నిరసనలు, ఆందోళనలతో దద్దలిల్లాయి. ఒకే రాత్రి మూడు పట్టణాల్లో బాంబుపేలుళ్లు జరపడం ద్వారా రాజకీయాధికారాన్ని చేజిక్కించుకోగలమని మేము అనుకోవడం లేదు. సమ్మెను విఫలం చేయాలన్న దుష్ట తలంపుతో ఈ అమానుష ప్రభుత్వం రాజకీయ నాయకులపైనా, స్వాతంత్ర్య సమర యోధులపైనా తీవ్రంగా విరుచుకుపడుతోంది. ప్రజలు ఇవన్నీ చూస్తూ ఊరుకోలేరు కదా!" అన్నాడు.

1962 ఆగస్టులో మండేలా తిరిగి దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టగానే ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసింది. 1964 రివోనియా విచారణ సందర్భంగా మండేలా తన వాదనను గట్టిగా వినిపిస్తూ, "అవును బెన్‌బెల్లా, అల్జీరియా నేత... తదితరుల మద్దతు మాకు వుంది. బెన్‌బెల్లా నన్ను అల్జీరియన్ విమోచనా సైన్యం ప్రధాన కేంద్రమైన ఓజ్దాకు రావాల్సిందిగా ఆహ్వానించాడు. ఈ పర్యటన వివరాల గురించి నా డైరీలోకూడా పేర్కొన్నాను.. కావాలంటే చూసుకోవచ్చు" అని  తెగేసి చెప్పాడు.

మండేలా మృతి సందర్భంగా ప్రపంచ దేశాలన్నీ  ఆయనకు ఘనంగా నివాళులర్పించాయి. ఈ విషయంలో తామెక్కడ వెనకబడతామేమోనని కార్పొరేట్ టీవీ చానెళ్లు, దాని అధీనంలోని ప్రింట్ మీడియా ఆ మహానాయకుని గొప్పతనం గురించి కీర్తించాయి. కానీ,  మండేలాను ఆనాడు సౌతాఫ్రికా శ్వేత దురహంకార పోలీసులకు పట్టివ్వడంలో అమెరికన్ గూఢచారి సంస్థ సిఐఎ పాత్ర జగమెరిగిన సత్యమే అయినా దీని గురించి కార్పొరేట్‌మీడియా ఒక్క ముక్క కూడా ప్రస్తావించకపోవడం గమనార్హం. దక్షిణాఫ్రికా మీడియాలో ఈ విషయానికి సంబంధించి ఇంతకుముందు అనేక వార్తా కథనాలొచ్చాయి. 1990లో  మండేలా జైలు నుంచి విడుదలైన నాలుగు మాసాలకు అమెరికా పర్యటనకు వెళ్లాడు. ఆ సందర్భంగా న్యూయార్క్ టైమ్స్ (1990 జూన్ 10) పత్రికలో డేవిడ్ జాన్సన్ ఒక వ్యాసం రాశాడు.  కాక్స్ న్యూస్ సర్వీస్ రిపోర్టును ఉటంకిస్తూ ఆయన ఆ వ్యాసంలో ఇలా పేర్కొన్నాడు. "ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ లోని ఒక ఏజెంటును ఉపయోగించుకుని మండేలా కార్యకలాపాలు, కదలికలకు సంబంధించిన కీలకమైన సమాచారాన్ని సిఐఎ ఎప్పటికప్పుడు సేకరిస్తూ వచ్చింది. ఆయనను పోలీసులకు పట్టివ్వడంలో సిఐఎ కీలకపాత్ర పోషించింది" అని తెలియజేశాడు. ఆ వ్యాస రచయిత ఇంకో చోట  ఇలా పేర్కొన్నాడు."మండేలా అరెస్టయిన కొద్ది సేపటికే సిఐఎకు చెందిన సీనియర్ అధికారి ఒకరు రిటైర్డు అధికారితో మాట్లాడుతూ ఆయనను దక్షిణాఫ్రికా సెక్యూరిటీ విభాగానికి తామే పట్టిచ్చామన్నాడు. ఆ రోజు మండేలా ఏ దుస్తుల్లో, ఎక్కడ తలదాచుకున్నదీ పూర్తి వివరాలను అందించామన్నాడు"

శ్వేతజాతి దురహంకార ప్రభుత్వానికీ, అమెరికా గూఢచారి సంస్థకూ మధ్య వున్న ఈ అపవిత్రపొత్తు ఆర్థిక వ్యవహారాల్లోనూ ఎలా కొనసాగిందీ ఆ వ్యాసకర్త విశ్లేషించాడు. వర్ణ వివక్షత చాలా తీవ్రంగా అమలు జరుగుతున్న కాలంలో అమెరికాలోని 400 కార్పొరేట్ కంపెనీలు దక్షిణాఫ్రికాలోనూ, వలసపాలన కింద మగ్గుతున్న నమీబియాలోనూ నేరుగా పెట్టుబడులు పెట్టిన విషయాన్ని బయటపెట్టాడు. జాతి దురహంకార ప్రభుత్వం దేశీయంగా, అంతర్జాతీయంగా ఒంటరిపాటవుతున్న తరుణంలో అమెరికన్ సామ్రాజ్యవాదం, పశ్చిమ దేశాల్లోని దాని తైనాతీలు దక్షిణాఫ్రికా లోపలా బయటా ఎఎన్‌సి కార్యకలాపాలపై నిఘాను ముమ్మరం చేశాయి. మరోవైపు మండేలా ఉద్యమానికి ఈ దేశాల ప్రజల నుంచి అపూర్వమైనరీతిలో సంఘీభావం వ్యక్తమైంది. 1980వ దశకం మధ్య నాటికి మండేలా అంటే దక్షిణాఫ్రికాలో ప్రతిఘటనకు ప్రతీకగా మారిపోయాడు. సాయుధ, ప్రజా, కార్మిక ఉద్యమాల సమ్మిళిత పోరాటం, అంతర్జాతీయ సంఘీభావ ఉద్యమం ఇవన్నీ శ్వేతజాతి దురహంకార ప్రభుత్వ మెడలు వంచాయి. ఎఎన్‌సి, దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ, ఇతర సంస్థలపై నిషేధాన్ని ఎత్తివేసి, మండేలాను, ఇతర రాజకీయ ఖైదీలను విడుదల చేయకతప్పని పరిస్థితి కల్పించాయి. 1994 ఏప్రిల్–మే మాసాల్లో జరిగిన ఎన్నికల్లో ఎఎన్‌సి తిరుగులేని విజయం సాధించింది. దక్షిణాఫ్రికా నల్లజాతి తొలి అధ్యక్షుడిగా మండేలా రాజ్యాధికారం చేపట్టాడు. మరో పర్యాయం పోటీచేసే అవకాశం వున్నా ఆయన అందుకు నిరాకరించాడు. మండేలా అధ్యక్షునిగా వున్న అయిదేళ్ల కాలంలో ప్రభుత్వం 20 లక్షల మంది పేదలకు ఇళ్లు కట్టించింది. అందరికీ విద్యుత్, మంచినీరు అందించేందుకు మండేలా కృషి చేశాడు. ప్రజలందరికీ వైద్య సేవలు అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో ఆఫ్రికన్ ఆరోగ్య భద్రతా వ్యవస్థను ప్రారంభించాడు.  అధికసంఖ్యాకులైన ఆఫ్రికన్లకు సాధికారత చేకూర్చేందుకు పలు కార్యక్రమాలు చేపట్టాడు. వర్ణం, లింగం ఆధారంగా ఎలాంటి వివక్షకు తావులేని, మరణ దండన ఊసే లేని సరి కొత్త రాజ్యాంగాన్ని రూపొందించాడు.

అణచివేతకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగా పోరాడుతన్న శక్తులకు దక్షిణాఫ్రికాను ఒక మార్గదర్శిగా మండేలా నిలిపాడు. పాలస్తీనా విమోచనా పోరాటం, పశ్చిమ సహారా దేశాల్లో ప్రజలకు దక్షిణాఫ్రికా తన సంఘీభావం నేటికీ కొనసాగిస్తున్నది. ఆప్రికన్ ఐక్యత, అభివృద్ధిపై మండేలా తనదైన ముద్ర వేశాడు. ఈ రోజు ఆఫ్రికన్ యూనియన్ కమిషన్ సారథిగా దక్షిణాఫ్రికా మహిళ డాక్టర ఎన్కొసజనా ద్లామిని జుమా వున్నారు. ఆఫ్రికన్ యూనియన్ పరిధిలో దక్షిణాఫ్రికా కీలకపాత్ర పోషించడమే కాదు, బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా) కూటమిలో సభ్యురాలిగా కూడా వుంది. సదరన్ ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ కమ్యూనిటీ, తదితర అంతర్జాతీయ సంస్థల్లో కీలకపాత్ర పోషిస్తోంది.

## మండేలా వైవాహిక జీవితం

మండేలా భార్యలు ఎవిలిన్ ఎంతో కోమేస్ (1994–96), విన్నీ మెడికిజెలా (1958–96), గ్రెస్ మెచెల్ (1998–2013), పిల్లలు, థెంబెకేల్, మకోజె, మెక్‌గాతో (మకి), జనాని, జింద్ జిస్వా

## బెంగాల్‌లో మండేలాకు ఘన స్వాగతం

భారత పర్యటనకు వచ్చినప్పుడు ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి అప్పటి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసును కలుసుకున్నారు. నల్లజాతి సూరీడుకు మద్దతుగా కొల్‌కతాలో 5లక్షల మందితో భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మండేలా కొల్‌కతాలో మాట్లాడుతూ బెంగాల్ ప్రజల ఆదరాభిమానలు చూస్తుంటే  తాను సొంత ఇంటికి వచ్చానన్న భావన కలుగుతోందని అన్నారు.

## అవార్డులు, రివార్డులు

1993లో మండేలాకు నోబెల్‌శాంతి బహుమతి లభించింది. సోవియట్‌యూనియన్ లో సోషలిజం కుప్పకూలక ముందు అక్కడి ప్రభుత్వం మండేలాకు ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డు బహూకరించింది. 1990లో భారత ప్రభుత్వం ఆయనకు భారత రత్న పురస్కారం ఇచ్చి సన్మా నించింది.